సోమవారం
19•3•2018
హైదరాబాద్
• వెల.5 రూ.
• సంపుటి 7 • సంచిక 281
• పేజీలు : 16 + (24/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



మన రాష్ట్రం • మన పత్రిక
నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE



జాతిసేవలో తెలంగాణ

కేంద్రానికి మనమిచ్చేది 50 వేల కోట్లు

మనకు కేంద్రం ఇచ్చేది 24 వేల కోట్లే

- స్వయంసమృద్ధ, సుసంపన్న రాష్ట్రం మనది
- జాతినిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాం
- ఉగాది పచ్చడి షడ్రుచులు జీవన సందేశమిస్తాయి
- అన్ని మతాల పండుగలను ప్రభుత్వం నిర్వహిస్తున్నది
- సర్వ ప్రజలు సకల సంతోషాలతో ఉండాలి
- ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్
- పండుగ సందర్భంగా వేదపండితులకు సత్కారం
- రాములవారి కల్యాణ శుభలేఖను సీఎంకు అందించిన భద్రాద్రి అర్చకులు


ఆదివారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన విళంబినామ ఉగాది వేడుకల్లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, నాయిని నర్సింహారెడ్డి, సీ లక్ష్మారెడ్డి, ఎంపీ కే కేశవరావు, సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ స్వయంసమృద్ధమైన సుసంపన్న రాష్ట్రమని, జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. కేంద్రానికి మనం ఇచ్చేదానికన్నా మనకు వచ్చేది తక్కువేనని చెప్పారు. అయినప్పటికీ మిగులు రాష్ట్రంగా తెలంగాణ సాయపడుతూ జాతిసేవలో పాల్గొంటున్నదని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రజలందరం సంతోషించే విషయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన ఉగాది వేడుకలకు హాజరైన సీఎం రాష్ట్ర ప్రజలకు విళంబి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్ర ప్రజానీకానికి శుభం జరుగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టువస్త్రాలు అందజేశారు. భద్రాద్రి సీతారాముల కల్యాణ మహోత్సవ ఆహ్వానపత్రికను భద్రాచల దేవాలయ అర్చకులు అందించారు. బాచంపల్లి సంతోష్‌కుమార్ శాస్త్రి పంచాంగ పఠనం చేశారు. అనంతరం సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ఉగాది పచ్చడి కేవలం షడ్రుచుల సమ్మేళనం మాత్రమే కాదని.. మనకు జీవన సందేశాన్ని ఇస్తుందన్నారు. పచ్చడిలో తీపి, వగరు, పులుపు మాదిరిగానే.. మన జీవితంలో కూడా మంచి, చెడు, కష్టం, నష్టం వంటివి ఉంటాయని, ఈ సందేశాన్ని అన్ని సందర్భాల్లో గుర్తుంచుకోవాలని చెప్పారు. భగవంతుడికి నమస్కరించి అన్ని సంవత్సరాల్లాగానే ఈ ఏడాది కూడా రాష్ట్ర ప్రజానీకానికి మంచి జరుగాలని, మంచి వర్షాలతో పంటలు పండి.. రైతాంగం సంతోషంగా ఉండాలని.. సర్వ ప్రజలు సకల సంతోషాలు కలిగి ఉండాలని మనసారా ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

నూటికి నూరుపాళ్లు గర్వించే తెలంగాణ

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి తెలంగాణ మిగులు బడ్జెట్‌తో సుసంపన్న రాష్ట్రంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నదని, ఈ ఏడాది కూడా ఆర్థికాభివృద్ధి సాధిస్తుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. 'ఉద్యమకాలంలో మనం చేసిన వాదన నూటికి నూరుపాళ్లు నిజమని తేలింది. ఇది మనమందరం సంతోషించే విషయం' అని ఆయన చెప్పారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందడమంటే దేశం అభివృద్ధి చెందడమేనని ముఖ్యమంత్రి అన్నారు. స్వయంసమృద్ధమై

మిగతా 4వ పేజీలో

- తలపెట్టిన కార్యక్రమాలన్నింటిలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజయమే
- మంచి వర్షాలు.. బంగారు పంటలు
- అన్ని రంగాలలో మహిళలు రాణిస్తారు
- పుంజుకోనున్న రియల్ ఎస్టేట్ రంగం
- పంచాంగపఠనంలో బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి


విళంబినామ ఉగాది సందర్భంగా ఆదివారం ప్రగతిభవన్‌లో పంచాగ శ్రవణం చేస్తున్న శృంగేరీపీఠం ఆస్థాన విద్వాంసులు సంతోష్‌కుమార్‌శాస్త్రి

రాష్ట్ర భవిష్యత్తు అత్యద్భుతం

విళంబిలో అంతా సానుకూలమే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ రాష్ట్రం నూతన విళంబినామ సంవత్సరంలో అత్యద్భుత ఫలితాలను సాధిస్తుందని ఉగాది సందర్భంగా పంచాంగపఠనం చేసిన బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రం రాశి కర్కాటకం, తెలంగాణ ముఖ్యమంత్రి రాశి కర్కాటకం కావడం వల్ల సంకల్పబలంతో తలపెట్టిన కార్యక్రమాలన్నింటిలో ముఖ్యమంత్రి కేసీఆర్ విజయం సాధిస్తారని శుభాశీస్సులు పలికారు. ఉగాది సందర్భంగా ఆదివారం ప్రగతిభవన్ జనహితలో పంచాంగపఠన కార్యక్రమం వైభవంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు శాసనమండలి చైర్మన్ కనకమామిడి స్వామిగౌడ్, మంత్రివర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శృంగేరీపీఠం ఆస్థాన విద్వాంసులు సంతోష్‌కుమార్‌శాస్త్రి తనదైన విలక్షణ శైలిలో పంచాంగ ఫలితాలను సభికులకు వివరించారు. ఆశ్లేష నక్షత్రం, మేష లగ్నంలో జన్మించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ ఏడాది చక్కని యోగబలం ఉన్నదని.. ఇది శాస్త్రం చెప్తున్న విశ్లేషణ అని ఆయన తెలిపారు. ఏకాదశ స్థానంలోని సూర్యభగవానుడు కేసీఆర్‌కు గొప్ప యోగబలాన్ని ఇస్తున్నాడని వివరించారు. విళంబి నామ సంవత్సరంలో ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి కేసీఆర్ జాతక బలాలను పరిశీలించినట్లయితే.. కేసీఆర్ ముందడుగు వేస్తారని, ప్రధానిది వెనుకడుగేనని విశదీకరించారు. తెలంగాణకు శుభఫలితాలున్నాయని శాస్త్రప్రమాణంగా

మిగతా 4వ పేజీలో

నేడు కోల్‌కతాకు సీఎం కేసీఆర్

ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో కీలక అడుగులు

కేసీఆర్ వెంట కేకే, కవిత తదితరులు 4

సిరిసిల్ల మరమగ్గాలపై బతుకమ్మ చీరెలు

20 వేలమందికి ఆరునెలలపాటు ఉపాధి 11

తప్పుడు స్థానంలో టెలిమెట్రీ!

- పరికరం ఏర్పాటుకు అనువైన ప్రదేశం కాదని కృష్ణా బోర్డుకు లేఖ?
- మొదట్లోనే వ్యతిరేకించిన తెలంగాణ
- సోమర్ కంపెనీ లేఖతో కక్కలేక.. మింగలేక.. అన్నట్టుగా బోర్డు పరిస్థితి
- సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనం పేరిట కాలయాపన


పోతిరెడ్డిపాడు 12.265 కి.మీ.పాయింట్‌పై సోమర్ కంపెనీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

పోతిరెడ్డిపాడు దిగువన ఏర్పాటుచేసిన టెలిమెట్రీపై కృష్ణాయాజమాన్య బోర్డు పరిస్థితి కక్కలేక.. మింగలేక అన్నట్టుగా ఉంది. టెలిమెట్రీని అనువైన ప్రదేశంలో కాకుండా, తప్పుడు స్థానంలో ఏర్పాటుచేసిందని పరికరాన్ని తయారుచేసిన సంస్థ సోమర్ కంపెనీయే లిఖిత పూర్వకంగా పేర్కొన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. దీంతో బోర్డు పరువు నిలుపుకొనేందుకు నానా తంటాలు పడుతున్నది. ముందుగా నిర్ణయించినచోట కాకుండా ఏపీ ఒత్తిడులకు తలొగ్గి ఏర్పాటుచేసిన ప్రదేశం సరైంది కాదని, అక్కడ నీటి డిశ్చార్జి నమోదులో గందరగోళం నెలకొంటున్నదని, ట్యాంపరింగ్

మిగతా 4వ పేజీలో







నేడు కోల్‌కతాకు సీఎం కేసీఆర్

- ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో కీలక అడుగులు
- కేసీఆర్ వెంట కే కేశవరావు, కవిత తదితరులు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటులో సోమవారం అత్యంత కీలకమైన ముందడుగు పడనున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కోల్‌కతాలో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతో సోమవారం భేటీ కానున్నారు. ఫ్రంట్ ఏర్పాటు ప్రకటన అనంతరం కేసీఆర్ చేస్తున్న తొలి పర్యటన ఇది. సోమవారం ఉదయం సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరైన అనంతరం మధ్యాహ్నం బేగంపేట నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి కోల్‌కతా వెళ్లనున్నారు. సీఎం కేసీఆర్ వెంట టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు, ఎంపీ కల్వకుంట్ల కవిత వెళ్తారు. వీరితోపాటు ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ తదితరులు వెళ్తున్నట్టు సమాచారం. మధ్యాహ్నం పశ్చిమబెంగాల్ సచివాలయంలో ఇరు రాష్ట్రాల సీఎంలు భేటీ కానున్నారు. ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణ, ఎజెండా, ఇతర విషయాలపై ఇద్దరు నేతలు చర్చించనున్నట్టుగా సమాచారం. దాదాపుగా రెండు గంటలకు పైగా సమావేశం జరుగుతుందని భావిస్తున్నారు. ఈ భేటీ అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ అక్కడి ప్రసిద్ధ కాళీమాత ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకొంటారు. రాత్రి బయలుదేరి హైదరాబాద్ చేరుకుంటారు.





గవర్నర్, సీఎంకు భద్రాద్రి రాములోరి కల్యాణానికి ఆహ్వానం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఆలయంలో జరుగనున్న రాములోరి కల్యాణం, పట్టాభిషేకానికి హాజరుకావాలని ఆలయ ఈవో ప్రభాకర శ్రీనివాస్, అర్చకులు ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ దంపతులకు, ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు ఆహ్వానపత్రికలు అందజేశారు. భద్రాద్రిలో ఈ నెల 26న శ్రీ సీతారాముల కల్యాణం, 27న శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

- భద్రాచలం, నమస్తే తెలంగాణ:



ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



యాదాద్రి దేవస్థానం ప్రచురించిన శ్రీ విళంబినామ పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, నాయిని, తుమ్మల నాగేశ్వరరావు, లక్ష్మారెడ్డి, సీఎస్ ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఎంపీ కే కేశవరావు, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



ఆదివారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన శ్రీవిళంబి నామ సంవత్సర పంచాంగ శ్రవణం కార్యక్రమానికి హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు, అధికారులు

జాతిసేవలో తెలంగాణ

మూడోపేజీ తరువాయి...

జాతిసేవలో పాత్ర పోషించడం గర్వకారణమని అభిప్రాయపడ్డారు. 'ఓ సందర్భంలో ప్రధానమంత్రికి కూడా నేను చెప్పిన.. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందడమంటే అది తన వంతుగా జాతి అభివృద్ధిలో భాగమవడమేనని. మనకు మనంగా అభివృద్ధి చెందుతూ జాతినిర్మాణరంగంలో కూడా ప్రముఖమైన పాత్ర పోషిస్తున్నాం. మనం కేంద్రానికి 50 వేల కోట్లిస్తం.. అక్కడి నుంచి మనకు తక్కువే వస్తది.. 24 వేల కోట్లే వస్తయి. అయినప్పటికీ మనం సముపార్జించుకున్న ఆదాయంతో మనల్ని మనం పోషించుకుంటూ దేశాన్ని కూడా అభ్యుదయంగా ముందుకు తీసుకుపోయేదానిలో పాత్ర పోషిస్తున్నం. ఇది మనకు గర్వకారణం. దేశంలో ఏడెనిమిది స్వయంసమృద్ధ రాష్ట్రాల్లో మనం ఒకళ్లం. ఇతరులకు సహాయపడే స్థితిలో ఉన్నం' అని ఆయన చెప్పారు. 'రాష్ట్రం అద్భుతమైన వెలుగు జిలుగులతో సిరిసంపదలతో తులతూగుతుందని పంచాంగకర్తలు ప్రవచించారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కర్కాటకరాశికి ఈ ఏడాది ఆదాయం 8.. వ్యయం 2 కావడం వల్ల రాష్ట్రం తప్పకుండా సుసంపన్నంగా ఉంటుందని పంచాంగకర్త శుభకరమైన వార్త చెప్పారు. తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉంటుందని చెప్పారు' అని సంతోషం వ్యక్తం చేశారు.

అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం

తెలంగాణ దేవభూమి అని సీఎం అభివర్ణించారు. పూజలు దైవకార్యక్రమాలు అధికంగా జరిగే రాష్ట్రమని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాలకు సంబంధించిన అన్ని పండుగలను ప్రభుత్వమే నిర్వహిస్తున్నదని, అన్ని మతాలకు సమాన ప్రాధాన్యమిస్తున్నదని పేర్కొన్నారు. దేవాలయాల్లోని అర్చకులకు, మసీదుల్లోని ఇమాంలకు వేతనాలు చెల్లించే రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. వేల ఏండ్ల కిందటనే పంచాంగం పుట్టిందని, పంచాంగకర్తలు మార్గనిర్దేశనం కోసం సూచనలు చేస్తారని చెప్పారు. సాంకేతికరంగం అభివృద్ధి చెందకముందే 50 ఏండ్ల తర్వాత ఏం జరుగుతుందన్నది పంచాంగకర్తలు వెల్లడించేవారని తెలిపారు. ఎటువంటి పరికరాలను ఉపయోగించకుండా ఖగోళశాస్త్రాన్ని అవగాహన చేసుకుని జరుగబోయే ఉపద్రవాలను సూచించే పంచాంగంలో సైన్స్ ఇమిడి ఉందన్నారు. పంచాంగకర్తలు ఎవరైనా ఆయా ఫలితాలు సమానంగా గుర్తిస్తారని.. చెప్పే విధానంలో మాత్రమే ప్రత్యేకత ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ అద్భుతమైన వెలుగు జిలుగులతో విరాజిల్లుతుందని పంచాంగకర్తలు చెప్పడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. 'నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉంటారని పండితులు చెప్పారు. పోలీసు, ఆరోగ్యశాఖల పనితీరు బాగుంటుందని శాస్త్రి చెప్పడంతో ఆ శాఖల మంత్రులకు ఎలాంటి ఢోకా లేదు' అంటూ మంత్రులు మహేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. 'పంచాంగ ఫలితాలు విని హోంశాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి చాలా సంతోషంగా ఉన్నారు. మేము ఎవరినీ కొట్టే పరిస్థితి లేదు.. ఎవరినీ పట్టుకునే పరిస్థితి లేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుంటాయి. దుర్మార్గుల ప్రకోపం తగ్గుతుందని చెప్పారు. సంతోషం' అని వ్యాఖ్యానించారు.

టికెట్లు కావాలంటే ప్రజల్లో ఉండాలి

టికెట్లు సంపాయించుకోవాలి అంటే హైదరాబాద్‌లో కాకుండా.. ప్రజల్లో ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజల్లో మమేకమై ఉన్నవారికి గెలుపు సాధ్యమని, టికెట్ల కేటాయింపు విషయంలో ఎటువంటి సమస్యలుండవని తెలిపారు. పంచాంగపఠనం సందర్భంగా.. రాశులను బట్టి టికెట్ల విషయంలో అంచనాలు చెప్పడంపై ఆయన స్పందించారు. 'కొందరు పంచాంగకర్తలు గంభీరంగా, మరికొందరు హాస్యోక్తంగా వ్యవహరిస్తారు. ఇక్కడ పంచాంగపఠనం చేసిన సంతోషకుమారశాస్త్రి చాలా చతురుడు. ఈ సంవత్సరం ఎన్నికల సంవత్సరం కాబట్టి ఏ రాశి వారికి టికెట్ల ఢోకా ఉండదు.. ఏ రాశివారికి ఇబ్బంది అవుతుందో చెప్పారు. మరి ఆ రాశులవారు జాగ్రత్తగా ఉండాలి. ప్రజల్లో ఉంటే టికెట్లకు ఢోకా ఉండదు. ఆటోమెటిక్‌గా వస్తాయి' అని సీఎం అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా చిరునవ్వుతో బతుకాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

వేద పండితులకు సత్కారం

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వేదపండితులు, అర్చకులు, ఆధ్యాత్మికవేత్తలను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదివారం ప్రగతిభవన్‌లో సత్కరించారు. సత్కారం పొందినవారిలో.. బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి, కూచి ఆదివెంకట చంద్రశేఖరశర్మ, గుదిమళ్ల మురళీ కృష్ణమాచార్యాలు, ఆర్ వేణుమాధవశర్మ, కాకనూరి వెంకటరమణశాస్త్రి, చక్రపాణి నరసింహమూర్తి, ప్రవీణ్‌కుమార్‌చార్యులు, నడుపూడి మఠం భవానయ్యస్వామి, గట్టు యాదగిరిస్వామి, వీ జగన్నాథచారి, అడ్డేపల్లి లక్ష్మణాచార్యులు, గణాచారి మఠం, పీ ఫణీంద్ర, జోషి మధుసూదనశర్మ, సంపత్‌కుమార్ కృష్ణమాచార్య, బిరుదు రాజశేఖరశర్మ, మఠం కల్యాణయ్యస్వామి, భాస్కరభట్ల ఆంజనేయశర్మ, మండపల్లి పరాంకుశాచార్యస్వామి, చెరుకు రాజేశ్వరశర్మ, పురాణం చంద్రమౌళిశర్మ, స్థపతి వల్లినాయగం, డోలు విద్వాన్ ఆర్ అశోక్, సన్నాయి బుద్దన్నగారి నారాయణ ఉన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు అత్యద్భుతం

మూడోపేజీ తరువాయి...

చెప్తున్నామని అన్నారు. సూర్యభగవానుడు రాజుగా, శని మంత్రిగా విళంబి సంవత్సర పరిపాలనను అందిస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది తొమ్మిది గ్రహాల్లో నాలుగు శుభ గ్రహాలు ఉన్నాయని పేర్కొన్నారు. సూర్యనారాయణ భగవానుడే కొత్త సంవత్సరానికి అధిపతిగా ఉన్నందున యోగబలం బాగుంటుందని చెప్పారు. 'శ్రీరామరామ రఘునందన రామరామ' అంటూ మనందరం పూజించే మన భద్రాద్రి రాముడు విళంబి నామ సంవత్సరంలోనే జన్మించాడని, 60 సంవత్సరాల తర్వాతనే మళ్లీ ఈ సంవత్సరాన్ని చూడగలుగుతామని ఆయన పేర్కొన్నారు. అందుకని ఈ ఏడాది శ్రీ సీతారామకల్యాణాన్ని దర్శించే వాళ్లందరూ అదృష్టవంతులని ఆయన తెలిపారు. రాజు సూర్యుడికి, మంత్రి శనికి కొంత సహజ వైరుధ్యం ఉండే అవకాశాలు ఉన్నాయని, ఈ కారణంగా రాష్ట్రంలోని మంత్రులు ముఖ్యమంత్రి వేగాన్ని కొన్ని సందర్భాలలో అందుకోలేకపోతారని ఆయన భవిష్యవాణిని చెప్పారు. కుజుడు కారణంగా కుటుంబాలలో కలహాలు పెరుగుతాయని అన్నారు.

మహిళలు మరింత శక్తిమంతం

విళంబిలో మహిళలు శక్తిమంతంగా ఉంటారని పంచాంగపఠనంలో తెలిపారు. పర్యాటకం, రోడ్డురవాణా, సాంఘికసంక్షేమం, ఆరోగ్యం వంటి శాఖలలో మంచి ఫలితాలు వస్తాయని.. పంచాయతీరాజ్‌లో కొంచెం కష్టాలు ఉంటాయని సంతోష్‌కుమార్‌శాస్త్రి చెప్పారు. దేవాదాయశాఖలో ఒక ఇబ్బంది ఎదురవుతుందని, అవినీతి ఆరోపణలు వస్తాయని అన్నారు. అందరికన్నా కుంభరాశివారికి ఈ ఏడాది ఎంతో బాగుంటుందని, కుంభరాశివారందరికీ పార్టీ టికెట్లు దొరుకుతాయని చమత్కరించారు. శుక్రుడి శుభదృష్టివల్ల క్రీడారంగంలో తెలంగాణ, భారతదేశం ఎన్నెన్నో పతకాలను సాధిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విమానయానం, సాంకేతిక శాఖ చాలా బాగుంటాయని అన్నారు. పోలీస్‌శాఖ బ్రహ్మాండంగా ఉంటుందని చెప్పారు. పోలీస్‌శాఖకు ఈ ఏడాది సమర్థవంత యోగకాలమని తెలిపారు. ఆషాఢ పౌర్ణమి రోజున చంద్రగ్రహణం ఏర్పడుతుందని.. ఈ గ్రహణం తెలంగాణకు మంచిదేనని పేర్కొన్నారు.

జోరు వర్షాలు.. బోలెడు పంటలు

అక్టోబర్‌లో వర్షాలు కురుస్తాయని, డిసెంబర్‌లో ఎక్కువ వర్షపాతం ఉన్నదని పంచాంగపఠనంలో సంతోష్‌కుమార్‌శాస్త్రి చెప్పారు. బంగారుపంటలు పండుతాయని సందేహాలు అవసరం లేదని స్పష్టం చేశారు. మే 2 నుంచి నవంబర్ 6 వరకు మకరరాశిలో కుజస్తంభన ఉన్నదని, ఇటువంటి విషయాలలో జాగ్రత్తలు అవసరమని ఆయన పేర్కొన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం బాగా పుంజుకుంటుందని చెప్పారు. తెలంగాణలో ధర్మాచరణ పెరుగాలని, అన్ని దేవాలయాలలో దీపాలు వెలుగాలని చెప్పారు. ఈ ఏడాది ప్రతీ ఇంటిలో ప్రతీ రోజు ఆదిత్యహృదయం పారాయణం చేసుకోవాలని, తద్వారా విళంబి శుభ ఫలితాలను అందుకోవాలని బాచంపల్లి సూచించారు. ద్వాదశరాశుల ఫలితాలను రేఖామాత్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, అజ్మీరాచందూలాల్, లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శాసనమండలి వైస్‌చైర్మన్ నేతి విద్యాసాగర్, శాసనసభ్యులు రసమయి బాలకిషన్, మేయర్ బొంతు రామ్మోహన్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డి, దేవాదాయశాఖ సెక్రటరీ శివశంకర్, భాషా సాంస్కృతిక శాఖ సెక్రటరీ బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. దేవాదాయశాఖ తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పట్టువస్త్రాలతో సత్కరించారు. యాదాద్రి పంచాంగాన్ని ఆవిష్కరించారు.


ముహూర్తం

సూర్యోదయం: 6.25 గంటలకు

సూర్యాస్తమయం: 6.23 గంటలకు

శ్రీవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం విదియ సాయంత్రం 5.55 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: రేవతి రాత్రి 8.09 వరకు తదుపరి అశ్విని, అమృతఘడియలు: సాయంత్రం 5.45 నుంచి రాత్రి 7.21 వరకు, రాహుకాలం: ఉదయం 7.54 నుంచి 9.24 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 12.00 నుంచి 12.48 వరకు, తిరిగి మధ్యాహ్నం 3.11 నుంచి 3.59 వరకు, వర్జ్యం: ఉదయం 8.10 నుంచి 9.46 వరకు.

లోకం పోకడ



కేంద్ర పన్నులలో రాష్ట్ర వాటాకు గండి

- పెరిగిన రాష్ట్ర రాబడి.. తగ్గుతున్న కేంద్ర వాటా
- ఢిల్లీ నుంచి ప్రోత్సాహం లేదు.. ఆర్థిక సాయమూ లేదు..
- నెలవారీ చెల్లింపులూ బంద్.. మూడు నెలలకోసారి వాయిదా చెల్లింపు..



ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: రాష్ట్రం తలసరి ఆదాయం గణనీయంగా పెరుగుతున్నది. రాష్ట్ర సంపద జీఎస్డీపీ అంచనాలకు మించుతున్నది. కానీ అదేస్థాయిలో కేంద్రం పన్నుల వాటాలో రాబడీ తగ్గుతున్నది. సొంత వనరులను ఉపయోగించుకొని రాష్ట్ర సంపదను పెంచుకుంటున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ విధానాలు ప్రగతి ప్రతిబంధకాలుగా మారాయి. ఆర్థిక క్రమశిక్షణతో ప్రగతిపథంలో ముందుకు దూసుకుపోతున్న తెలంగాణకు కేంద్రం నుంచి ప్రోత్సాహం అందకపోవడమే కాకుండా పన్నుల రాబడిలో వాటా కూడా తగ్గిపోతున్నది. ఆర్థిక 'క్రమశిక్షణ' ఒక రకంగా 'శిక్ష'గా మారుతున్నది. తలసరి ఆదాయంతోపాటు రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ) గణనీయంగా పెరుగడం వల్ల కేంద్రం పన్నుల రాబడిలో తెలంగాణ వాటాను తగ్గిస్తున్నది. రాష్ట్రం ఎంతో కష్టపడి ప్రజల, రాష్ట్రసంపదను పెంచడానికి తీసుకొంటున్న చర్యలకు కేంద్రం ప్రోత్సాహం ఇవ్వకపోగా.. రాష్ట్రానికి రావాల్సిన నిధులకు కూడా గండికొడుతున్నది. అన్ని రాష్ట్రాలనుంచి ఆదాయపు పన్ను, కేంద్ర ఎక్సైజ్ సుంకాలు, సీజీఎస్టీ, ఎస్టేట్ డ్యూటీల ద్వారా వసూలయ్యే పన్నుల రాబడి మొత్తం కేంద్ర ఖజానాకు చేరుతుంది. ఇందులో నుంచి 14వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు 42 శాతం నిధులను.. కేంద్రం రాష్ట్రాలకు పంపిణీ చేస్తుంది. ఈ కేటాయింపులలో పలు అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితికి 47.5 శాతం, జనాభాకు 25 శాతం, ఆర్థిక క్రమశిక్షణకు 17.5శాతం, రాష్ట్ర వైశాల్యానికి, అటవీ విస్తీర్ణానికి 11 శాతం వరకు వెయిటేజీ ఇస్తుంది. ఆర్థిక పరిస్థితి బాగాలేని, లోటు ఎక్కువగా ఉండే రాష్ట్రాలకు ఎక్కువ వెయిటేజీ లభిస్తుంది. ఆ రాష్ట్రాలకు నిధులు కూడా ఎక్కువగా అందుతాయి. తెలంగాణ ఆర్థిక పురోగతి ఇతర రాష్ట్రాల కంటే మెరుగ్గా ఉన్నందున పన్నులలో వాటా తగ్గిస్తున్నది. ఆర్థిక పరిస్థితి బాగాలేని రాష్ట్రాలకు అత్యధిక వెయిటేజీ ఇవ్వడం వల్ల తెలంగాణకు కేంద్ర పన్నుల వాటాలో ప్రత్యక్షంగా, పరోక్షంగా నష్టం జరుగుతున్నది. నిర్దిష్టమైన ప్రణాళిక లేకుండా అన్నిరకాల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించకుండా, ఆర్థికంగా గాడి తప్పిన రాష్ట్రాలు కేంద్ర పన్నులవాటాలో అధిక ప్రయోజనం పొందుతుండటం గమనార్హం. కేంద్ర పన్నులవాటాను అధికంగా పొందుతున్న రాష్ట్రాల్లో బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటివి అగ్రభాగాన ఉన్నాయి. బీహార్‌కు 10.9 శాతం, యూపీకి 19.677 శాతం, ఎంపీకి 7.55 శాతం, పశ్చిమబెంగాల్‌కు 7.264 శాతం వాటా లభిస్తుండటం విశేషం. కానీ అన్ని రంగాల్లో దూసుకుపోతూ కేంద్రానికి అత్యధిక ఆదాయం ఇస్తున్న రాష్ట్రాల్లో అగ్రభాగాన ఉన్న తెలంగాణకు మాత్రం కేవలం 2.44 శాతం మాత్రమే రావడం గమనార్హం. పొరుగు రాష్ట్రం ఏపీలో రాబడి తక్కువ ఉన్నా జనాభా, ఆర్థిక లోటు ప్రాతిపదికన 4.31 శాతం కేంద్ర వాటా లభిస్తున్నది. పైగా కొత్తగా ఏర్పడిన రాష్ట్రం తెలంగాణను ప్రత్యేక దృష్టితో చూడాలని, ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ప్రోత్సాహకాలను ఇవ్వాలన్న డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోలేదు. మిషన్‌భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలకు ఆర్థిక సాయం అందించాలనే నీతి ఆయోగ్ సూచనను, 14వ ఆర్థిక సంఘం సిఫారసును కూడా కేంద్రం పెడచెవిన పెట్టింది.

సన్నగిల్లుతున్న ఆశలు

కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రం పెద్దగా ఆశలు పెట్టుకునే పరిస్థితి కన్పించడం లేదు. ఆశించిన మేరకు పన్నుల మొత్తం పెరుగకపోవడంతో రాష్ట్రం సొంత పన్నులపైనే ఎక్కువ భారం పడుతున్నది. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా రాష్ట్రం ఆశించిన దానికంటే లోబడే ఉంటుంది. ప్రస్తుతం కేంద్రం నుంచి పన్నుల వాటా రూపంలో నెలకు సుమారు 13 వందల కోట్ల రూపాయలు వస్తున్నాయి. 2017-18లో పన్నుల రూపంలో రూ. 17 వేల కోట్ల వరకు రాబడి రావచ్చని రాష్ట్రం తన బడ్జెట్‌లో అంచనా వేసింది. కానీ కేంద్రంలో పరిస్థితిని చూసి దానిని సవరించిన అంచనాలలో రూ.16,420 కోట్లకు ఖరారు చేసింది. మార్చి ఫిబ్రవరి వరకు రాష్ట్ర ఖజానాకు కేంద్ర పన్నుల వాటా రూపంలో 14 వేల కోట్ల పైచిలుకు జమైనట్టు సమాచారం. 2018-19 బడ్జెట్‌లో ఈసారి కేంద్ర పన్నుల వాటా అంచనాను పెద్దగా పెంచలేదు. మొత్తం పన్నుల వాటా 19,207 కోట్లుగా ఉంటుందని అంచనా వేసింది. సాధారణంగా ప్రతీ నెల 3వ తేదీ లోపు పన్నుల వాటాగా రాష్ట్ర ఖజానాకు 1250 నుంచి 1300 కోట్ల రూపాయల వరకు జమయ్యేది. కానీ జులైలో కొత్తగా అమలులోకి వచ్చిన జీఎస్టీ వల్ల క్రమంలో కొంత ప్రతికూలత ఏర్పడింది. వాస్తవానికి వచ్చే ఆర్థిక సంవత్సరం 2018-19 నుంచి నెలవారీగా కాకుండా మూడు నెలలకు ఒకసారి మాత్రమే పన్నుల వాటాను ఆయా రాష్ట్రాల ఖజానాకు జమచేయాలని కేంద్రం నిర్ణయించింది. దీనికి జీఎస్టీ అమలులోకి రావడమే ప్రధాన కారణం.

తప్పుడు స్థానంలో టెలిమెట్రీ!

మూడోపేజీ తరువాయి...

జరుగుతున్నదంటూ తెలంగాణ నీటి పారుదలశాఖ చేసిన ఆరోపణలు నిజమని తేలింది. దీంతో కృష్ణాబోర్డు ఏపీకి ఎంతగా వత్తాసు పలుకుతున్నదో మరోసారి రుజువైందని తెలంగాణ అధికారులు పేర్కొంటున్నారు. సోమర్ కంపెనీ రాసిన లేఖను తొక్కిపెట్టేందుకు, విషయాన్ని పక్కదారి పట్టించేందుకు -సీడబ్ల్యూపీఆర్‌ఎస్ అధ్యయనం పేరిట కాలయాపన చేస్తున్నట్టు తెలుస్తున్నది. తెలుగు రాష్ట్రాల పరిధిలోని కృష్ణా ప్రాజెక్టులపై కృష్ణా నదీ యాజమాన్యబోర్డు 18 చోట్ల మొదటిదశ టెలిమెట్రీలను ఏర్పాటు చేసింది. ఇందులో 17 చోట్ల పరికరాలు సక్రమంగా పనిచేస్తుండగా, పోతిరెడ్డిపాడు టెలిమెట్రీ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. మొదటి దశలో భాగంగా 18 చోట్ల పాయింట్లను ఎంపిక చేసిన బోర్డు.. 14 పాయింట్లను తెలంగాణ పరిధిలోనే ఏర్పాటుచేసింది. కేవలం నాలుగుచోట్ల మాత్రం ఏపీ పరిధిలో కృష్ణాజలాల వినియోగాన్ని లెక్కించేందుకు సిద్ధమైంది. పోతిరెడ్డిపాడుపై టెలిమెట్రీని మొదటి దశలోనే ఏర్పాటుచేయాలంటూ తెలంగాణ నీటిపారుదలశాఖ ఒత్తిడి మేరకు అంగీకరించిన కృష్ణాబోర్డు దానిని అనువైన ప్రాంతంలో కాకుండా మరోచోట ఏర్పాటుచేసింది. వాస్తవంగా రెండు రాష్ట్రాల ఇంజినీర్లు, బోర్డు ఇంజినీర్లు కలిసి నిర్వహించిన సర్వేలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన 600 మీటర్ల వద్ద పరికరం ఏర్పాటుచేయాలి. ఈ మేరకు బోర్డు కూడా ధ్రువీకరించింది. కానీ, అప్పటి బోర్డు సభ్య కార్యదర్శి సమీర్ ఛటర్జీ ఆంధ్రప్రదేశ్ ఒత్తిడి మేరకు నిర్ణయాన్ని మార్చి, 600 మీటర్ల వద్ద కాకుండా 12.265 కిలోమీటర్ వద్ద ఏర్పాటుచేశారు. దీనిని తెలంగాణ నీటిపారుదలశాఖ అధికారులు అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించారు. తెలంగాణ ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి అయిన బోర్డు ఎట్టకేలకు విచారణ చేపట్టింది. పోతిరెడ్డిపాడు 12.265 కిలోమీటర్ వద్ద ఏర్పాటుచేసిన టెలిమెట్రీ పనితీరు ఎలా ఉంది? అది అనువైన పాయింటేనా? అనే దానిపై సాంకేతిక విచారణ చేపట్టే బాధ్యతను బోర్డు అధికారులు దానిని తయారుచేసిన సోమర్ కంపెనీకి అప్పగించారు. కొద్దికాలం క్రితం దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన సోమర్ కంపెనీ ఇంజినీర్లు 'ఆ పరికరం ఏర్పాటుకు అది అనువైన ప్రదేశం కాదు' అని లిఖిత పూర్వకంగా బోర్డుకు లేఖ రాసినట్టు తెలిసింది. విషయం తెలిసి తెలంగాణ నీటిపారుదలశాఖ ఎదురుదాడికి దిగితే బోర్డు పరువు పోతుందని సోమర్ రాసిన లేఖ విషయాన్ని బయటకు రాకుండా తొక్కిపెడుతున్నట్టు సమాచారం. అంశాన్ని పక్కదారి పట్టించేందుకు ఇటీవల సెంట్రల్ వాటర్, పవర్ రిసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్‌ఎస్) శాస్త్రవేత్తలతో ఆ పాయింట్‌ను అధ్యయనం చేయించి కాలయాపన చేస్తున్నది. సీడబ్ల్యూపీఆర్‌ఎస్ ఏమి తేలుస్తుందో వేచి చూడాలి.



తిరుమలలో వైభవంగా ఉగాది ఉత్సవాలు

తిరుమల: తెలుగు నూతన సంవత్సరాది శ్రీవిళంబి నామ ఉగాది వేడుకలు తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి ఉగాది ఆస్థానం ఆగమోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయంలోని బంగారువాకిలిలో సర్వభూపాల వాహనంపై గరుడాళ్వారుకు అభిముఖంగా ఆశీనులను చేశారు. పక్కనే మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడు శ్రీ విష్వక్సేనులవారిని ఏర్పాటుచేశారు. అనంతరం పండితులు, అర్చకులు ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీవారి మూల విరాట్టు, ఉత్సవ మూర్తులను నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆపిల్, ద్రాక్ష, బత్తాయి, సపోటా, నారింజ, దానిమ్మ, కర్బూజ, మొక్కజొన్న, మామిడి, చెరకు వంటి విభిన్న రకాల పండ్ల గుత్తులు, అపురూపమైన పుష్పాలతో ఆలయం లోపల ఆకర్షణీయంగా అలంకరణ చేశారు. ధ్వజస్తంభం చెంత పుచ్చకాయలతో చెక్కిన వేంకటేశ్వర మహత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉగాది పండుగ సందర్భంగా నటుడు మోహన్‌బాబు కుటుంబసభ్యులు, నటి రకుల్‌ప్రీత్‌సింగ్‌తోపాటు పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.

సముద్ర గర్భంలో ఓటరు గుర్తింపు కార్డుల అందజేత

- కర్ణాటక అధికారి వినూత్న ఆలోచన

కార్వార్: ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటరు గుర్తింపు కార్డు ఎంత ముఖ్యమైందో మనందరికీ తెలిసిందే. మన దేశంలో ఓటరు గుర్తింపు కార్డును పొందడానికి నానా కష్టాలు పడాల్సి వస్తుందనే విషయం అందరికీ అనుభవమే. అయితే త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కర్ణాటకలో మాత్రం నూతనంగా ఓటు హక్కు పొందిన వారికి ఓటరు గుర్తింపు కార్డులను అందజేయడానికి ఓ ఐఏఎస్ అధికారి పెద్ద సాహసమే చేశారు. జిల్లాస్థాయి అధికారులు స్వయంగా గుర్తింపు కార్డులను తెచ్చి ఇవ్వడం అనే విషయాన్ని నమ్మడం సాధ్యంకాకపోయినా ఇది నిజం. కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్ నకుల్ 2000 సంవత్సరం జనవరి 1న పుట్టిన 13మంది 'మిలీనియల్స్'కు నీటిలో 15 అడుగుల లోతున ఓటరు గుర్తింపు కార్డులను అందజేయడానికి ఇతర అధికారులతో కలిసి ఏకంగా అరేబియా సముద్రంలో దూకారు. మొత్తం మీద నూతన ఓటర్లకు వెరైటీగా సముద్రంలో ఓటరు



సముద్రంలో ఈదుతూ వెళ్తున్న అధికారులు

గుర్తింపు కార్డులను అందజేశారు. ఓటరు కార్డులు అందుకున్న వారిలో ముదేశ్వర్‌కు చెందిన దీక్ష, పృథ్వి తదితరులు ఉన్నారు. నకుల్ అర్హులైన ఓటర్లకు గుర్తింపు కార్డులు అందజేయడానికి జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రశంసలు పొందుతున్నారు.

'పోస్కో' వచ్చినా మారలే!

- చిన్నారులపై లైంగికదాడి కేసుల విచారణలో తీవ్ర జాప్యం
- 2016 నాటికే దేశంలో లక్ష పెండింగ్ కేసులు
- సుప్రీంకోర్టుకు చేరిన నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ: చిన్నారులపై లైంగిక వేధింపులు, నేరాలను అరికట్టేందుకు పోస్కో (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రం సెక్సువల్ అఫెన్సెస్) వంటి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చినా పెద్దగా ఫలితం కనిపించడం లేదు. ఈ చట్టం ప్రకారం ట్రయల్ కోర్టుల్లో కేసు విచారణ ప్రారంభమైననాటి నుంచి ఏడాదిలోగా తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది. అయినా 2016 చివరి నాటికి దేశవ్యాప్తంగా బాలలపై లైంగిక దాడుల కేసులు లక్షకు పైగా పెండింగ్‌లో ఉన్నాయి. ఆ ఏడాది కేవలం 229 కేసుల్లో మాత్రమే తుది తీర్పులు వచ్చాయి. స్వయంగా సుప్రీంకోర్టు సేకరించిన సమాచారంతో వెల్లడైన కఠోర సత్యమిది. దేశవ్యాప్తంగా పోస్కో పెండింగ్ కేసుల వివరాలను నాలుగు వారాల్లోగా సమర్పించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్‌మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఇటీవల అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లను ఆదేశించింది. ఈ మేరకు అందించిన నివేదికలో 2016 చివరినాటికి పోస్కో చట్టం కింద 1,01,326 కేసులు ట్రయల్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నట్టు తేలింది. ఇందులో 70,435 కేసులు 2015 నుంచి బదిలీ కాగా, 2016లో 30,891 కేసులు నమోదయ్యాయి. పోస్కో చట్టం కింద నమోదైన కేసుల్లో విచారణ ఆలస్యం అవుతున్నదంటూ లాయర్ అలోక్‌శ్రీవాత్సవ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై స్పందించిన ధర్మాసనం పోస్కో చట్టం కింద దేశవ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలను సేకరించింది. ఈ నివేదికను పరిశీలించిన ధర్మాసనం జిల్లాల వారీగా పూర్తి వివరాలతో నివేదిక అందించాలని రిజిస్ట్రార్ జనరళ్లను ఆదేశించింది.

చైనాలో 2 వేల ఏండ్ల నాటి మద్యం లభ్యం

- క్విన్ రాజవంశానికి చెందినదిగా గుర్తించిన పురావస్తు శాస్త్రవేత్తలు
- క్రీస్తుపూర్వం 221-207 నాటిదిగా గుర్తింపు




బీజింగ్: చైనాలో సుమారు 2 వేల ఏండ్ల నాటి మద్యం లభించింది. షాంగ్జీ ప్రావిన్స్‌లోని ఓ పురాతన కట్టడంలో జరిపిన తవ్వకాల్లో టీ కెటిల్ మాదిరిగా ఉన్న మద్యం సీసా బయటపడింది. ఈ మద్యం క్విన్ రాజవంశానికి చెందినదిగా పురావస్తు శాస్త్రవేత్తలు గుర్తించారు. క్రీస్తుపూర్వం 221-207 నాడు కొలువైన క్విన్ రాజవంశం నాటి సమాధుల్లో జరిపిన తవ్వకాల్లో సుమారు 260వస్తువులను శాస్త్రవేత్తలు సేకరించారు. వీటిలో చాలా వస్తువులు ఆధ్యాత్మికానికి సంబంధించినవిగా గుర్తించారు. కాగా తవ్వకాల్లో లభ్యమైన 2వేల ఏండ్ల నాటి మద్యం బాటిల్ సీల్ వేసి ఉందని, బాటిల్‌లో తెలుపు వర్ణంలో ఉన్న 300 మిల్లీ లీటర్ల మద్యం ఉన్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. కాగా, క్విన్ రాజ్యం రాజధానిగా ఉన్న జియాన్‌యాంగ్ సంస్కృతిలో మద్యం వాడకం, ఆరోజుల్లో ఎలా పులియబెట్టే వారో తెలుసుకునేందుకు పరిశోధకులు సిద్ధమయ్యారు. ఇలా ఉండగా, పురావస్తు తవ్వకాల్లో అతి చిన్నదైన 60 సెంటీ మీటర్ల పొడవైన కత్తి కూడా లభ్యమైంది.

ఆర్థిక వ్యవస్థను ఆగం చేశారు

పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనాలు ■ మిస్‌మేనేజ్‌మెంట్ వల్లే కశ్మీర్‌లో పరిస్థితి దిగజారింది ■ ఏ ఒక్క హామీనీ మోదీ నెరవేర్చలేదు

రెండుకోట్ల ఉద్యోగాలిస్తామని రెండు లక్షలూ ఇవ్వలేకపోయారు ■ కాంగ్రెస్ ప్లీనరీలో మండిపడిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్



న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వ విధానాలపై మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మండిపడ్డారు. ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం గందరగోళంలో పడేసిందని విమర్శించారు. ఢిల్లీలో జరుగుతున్న 84వ కాంగ్రెస్ ప్లీనరీలో రెండవరోజు ఆదివారం మన్మోహన్ మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవ స్థ నుంచి విదేశాంగ విధానం వరకూ, కశ్మీర్ అంశం నుంచి ఉద్యోగ కల్పన వరకు అన్నింటిపైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తా రు. దేశ ఆర్థికస్థితి మోదీ ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతున్నదన్నారు. దేశీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో 1.6% మాత్రమే రక్షణరంగంపై వెచ్చిస్తున్నా, సరిహద్దుల్లో సవాళ్లకు ఆ కేటాయింపులు ఏ మాత్రం సరిపోవడంలేదన్నారు. 'యూపీఏ హయాంలో ఆర్థిక వృద్ధిరేటు 7.8శాతం పెరిగింది. 2014 నుంచి 2018 వరకు ప్రపంచ ఆర్థికవృద్ధిరేటు 2.8% నుంచి 3.8శాతానికి పెరుగగా, భారత్‌లో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది' అని తెలిపారు. మోదీ సర్కార్ చేపట్టిన పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీని మన్మోహన్ తప్పుపట్టారు. పెద్దనోట్ల రద్దు తప్పుడు అంచనా అని, ఆదరాబాదరాగా జీఎస్టీ అమలుతో చిన్న పరిశ్రమలు మూతపడి, లక్షల మంది ఉపాధి కోల్పోయారన్నారు.

నిర్వహణ వైఫల్యం వల్లే కశ్మీర్ సమస్య జటిలం

గతంలో ఎన్నడూలేని విధంగా జమ్ముకశ్మీర్‌పై మోదీ అసమర్థ విధానాలను అవలంబిస్తున్నదని మన్మోహన్ పేర్కొన్నారు. మోదీ సర్కారు వైఫల్యంవల్లే కశ్మీర్ పరిస్థితి రోజురోజుకు దిగజారుతున్నదని ఆయన నిప్పులు చెరిగారు. 'పరిస్థితి రోజురోజుకు దిగజారుతున్నది. మన సరిహద్దులు అంత సురక్షితంగా ఏమీ లేవు. తరచిచూస్తే అభద్రతాభావం నెలకొన్నది' అని ఆయన అన్నారు. రెండున్నర యుద్ధాలు చేయగలమని బీరాలు పలికిన ప్రభుత్వం కశ్మీర్‌లో పరిస్థితే చక్కదిద్దలేని స్థితిలో ఉందన్నారు. కశ్మీర్‌లో కేంద్ర, రాష్ట్ర భద్రతావిభాగాలే పరస్పరం వ్యతిరేక దిశలో పనిచేస్తున్నాయని, ఇటీవలి అనేక పరిణామాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయని మన్మోహన్ చెప్పారు. 'పరస్పరం సహకరించుకునే వాతావరణం, సౌహార్ద్రత వంటి విధానాలనే కాంగ్రెస్ అనుసరించింది. అన్ని పొరుగు దేశాలతో భారత విదేశాంగ విధానం ఇలాగే ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తే పాక్‌ను హెచ్చరించాలి. పాక్‌ను నష్టపరిచే క్రమంలో భారత్ నష్టపోతున్న వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారు' అని మన్మోహన్ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన రెండుకోట్ల ఉద్యోగాల హామీ అభూతకల్పనగా మారిందని ధ్వజమెత్తారు. 'మోదీజీ 2014నాటి ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన పెద్దపెద్ద హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు. రెండుకోట్ల ఉద్యోగాలకు బదులు రెండులక్షల ఉద్యోగాలైనా కల్పించలేకపోయారు. పలు హామీలతో మాయలు చేయాలని చూ శారు' అని మన్మోహన్ పేర్కొన్నారు. 'వచ్చే ఆరేండ్లలో రైతుల ఆదాయం రెండింతలు చేస్తానని మోదీ చెప్పారు. అందుకు భిన్నమైన పరిస్థితి దేశంలో నెలకొంది. రైతుల ఆదాయం రెట్టింపు చేయాలంటే కనీసం 12% వృద్ధిరేటు ప్రతి ఏటా సాధించాలి. అది ఊహించలేని విషయం' అని అన్నారు. పేదరికం, వ్యాధులు, నిరుద్యోగం వంటి సమస్యలను సరిదిద్ది మళ్లీ పట్టాలెక్కించాలంటే కాంగ్రెస్‌కు పెద్ద సవాలే అవుతుందన్నారు. దేశంలోని రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తెచ్చేందుకు కాంగ్రెస్ మరోసారి తన 'చారిత్రక పాత్ర'ను పోషించాలని సూచించారు. అంతకు ముందు ప్రసంగించిన కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ సైతం విదేశాలతో భారత్ సంబంధాలను మోదీ సర్కార్ చెడగొట్టిందని ఆరోపించారు.

మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థ తిరోగమనం

- సుస్థిర ఆర్థిక ప్రగతితోనే దేశం ముందడుగు
- సంక్షోభం నుంచి గట్టెక్కించడం కాంగ్రెస్‌కే సాధ్యం:చిదంబరం

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అసమర్థుల నుంచి దేశాన్ని రక్షిస్తేనే వృద్ధిరేటు సాధ్యమన్నది. ఢిల్లీలో జరుగుతున్న కాంగ్రెస్ 84వ ప్లీనరీలో కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పీ చిదంబరం ఆదివారం ఆర్థిక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సుస్థిర ఆర్థిక ప్రగతి సాధించడంతోనే దేశం ముందడుగు వేయగలదని తీర్మానం తెలిపింది. తద్వారా దారిద్ర్య నిర్మూలనతోపాటు సాంఘిక సంక్షేమ పథకాలకు సరిపడా నిధులు కేటాయించడానికి వీలవుతుందని కాంగ్రెస్ పార్టీ ఆర్థిక తీర్మానం పేర్కొన్నది.యూపీఏ ప్రభుత్వ హయాంలో సాధించిన ఆర్థిక ప్రగతిని ముందుకు తీసుకెళ్లేందుకు గల సువర్ణావకాశాలను మోదీ ప్రభుత్వం వృథా చేసిందన్నారు. ఇది ప్రభుత్వ వైఫల్యమేనని, దాని తప్పుడు విధానాలే కారణమని పేర్కొన్నారు. మరో 12 నెలల్లో తాము అధికారంలోకి వస్తే అతిపెద్ద సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని చిదంబరం ఆందోళన వ్యక్తం చేశారు. పన్ను 'ఉగ్రవాదం', హెచ్చరికలు, అర్ధరాత్రి దాడుల వంటి భయం లేని విధానాన్ని అమలులోకి తీసుకొచ్చి సంపద సృష్టికి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. 'మోదీ ప్రభుత్వం లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించలేకపోయింది. కోట్ల మంది రైతుల పంటలకు నిజమైన ఆదాయం లభించడం లేదు. ఉత్పాదక వ్యవస్థ కుప్పకూలింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ విధ్వంసానికి గురవుతున్నది. బ్యాంకింగ్ వ్యవస్థ అచేతనంగా మారింది' అని పేర్కొన్నది. నాలుగేండ్లలో విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధి కల్పనకు ఏం చర్యలు తీసుకున్నారని ప్రధాని మోదీని చిదంబరం ప్రశ్నించారు.

వారు మీ కంటే వేగంగా డబ్బు ను లెక్కిస్తారు

- తిరుపతి హుండీ నిర్వాహకుల నుంచి నేర్చుకోండి
- ఆర్బీఐ అధికారులకు కాంగ్రెస్ నేత చిదంబరం చురకలు



న్యూఢిల్లీ: పెద్దనోట్ల రద్దుతో తిరిగి వచ్చిన డబ్బెంతో ఇప్పటికీ లెక్కించలేదంటున్న ఆర్బీఐ అధికారులపై కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఢిల్లీలో జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో ఆదివారం ఆయన మాట్లాడుతూ 'నేను ఆర్బీఐ అధికారులకు ఓ సలహా ఇవ్వదల్చుకున్నా. డబ్బును ఎలా లెక్కించాలో తిరుపతి హుండీ నిర్వాహకుల దగ్గరకు వెళ్లి నేర్చుకోండి. వారు మీ కంటే వేగంగా డబ్బును లెక్కిస్తారు' అని అన్నారు. గత అక్టోబర్‌లో ఓ ఆర్టీఐ దరఖాస్తుకు ఆర్బీఐ జవాబిస్తూ రద్దయిన నోట్ల లెక్కింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నదని పేర్కొన్నది. పెద్ద నోట్లను రద్దు చేసి ఇన్నిరోజులవుతున్నా ఇంకా లెక్కింపు పూర్తి చేయకపోవడంపై చిదంబరం ఆర్బీఐకి చురకలు అంటించారు.

ఇది మరో కురుక్షేత్రం

- బీజేపీ,ఆర్ఎస్ఎస్ కౌరవుల్లాంటివి
- పాండవుల్లా సత్యం కోసం కాంగ్రెస్ పోరు
- బీజేపీ అధ్యక్షుడు హత్యకేసులో నిందితుడు
- ఏఐసీసీ ప్లీనరీలో రాహుల్‌గాంధీ



న్యూఢిల్లీ, మార్చి 18: బీజేపీ కౌరవులలాగా అధికారం కోసం యుద్ధం చేస్తున్నదని, తమ పార్టీ మాత్రం పాండవుల్లా సత్యం కోసం పోరాడుతున్నదని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న 84వ ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల్లో రెండోరోజైన ఆదివారం రాహుల్ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్రస్థాయిలో విమర్శల వర్షం కురిపించారు. మహాభారత ప్రస్తావన తెస్తూ.. 'వేల ఏండ్ల క్రితం కౌరవులు- పాండవుల మధ్య కురుక్షేత్ర సంగ్రామం జరిగింది. కౌరవుల్లా బీజేపీ, ఆర్ఎస్ఎస్ అధికారం కోసం యుద్ధం చేస్తున్నాయి. పాండవుల్లా కాంగ్రెస్ పార్టీ నిజాయితీ, సత్యం కోసం పోరాడుతున్నది' అని రాహుల్ అన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఓ హత్య కేసులో నిందితుడని విమర్శించారు. ఆశ్రిత పక్షపాతం, ప్రధాని పదవి కలబోతకు మోదీ ఒక ప్రతీక అని రాహుల్ అన్నారు. 'మీరు బ్యాంకుల్ని లూటీ చేసి రూ.33వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకెళ్తే ఈ ప్రభుత్వం మిమ్మల్ని కాపాడుతుంది. ఆర్థికమంత్రి, ఆయన కూతురు ఆశ్రిత పెట్టుబడిదారుల పక్షాన పనిచేస్తారు కాబట్టి వారంతా మౌనంగానే ఉండిపోతారు' అని రాహుల్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం 126 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు ఒప్పందం చేసుకుంటే, దాన్ని మార్చిన మోదీ, అంతే డబ్బు చెల్లించి కేవలం 36 యుద్ధ విమానాలను కొనుగోలు చేశారన్నారు. మోదీ మాయ తప్ప 'అచ్చేదిన్' ఏదీ బీజేపీ పాలనలో కనిపించడంలేదన్నారు. సత్యాన్ని దాచడం కోసమే ప్రధాని ప్రజల దృష్టిని మరల్చుతున్నారన్నారు. 'రైతులు చనిపోతుంటే ఇండియాగేట్ ముందు యోగా చేస్తున్నారు. ముస్లింలను ఈ దేశం వారు కాదంటారు. తమిళనాడు వెళ్లి భాష మార్చుకోమంటారు. ఈశాన్య రాష్ర్టాలకు వెళ్లి మీరు తినేది నచ్చలేదంటారు. మహిళల్ని బట్టలు సరిగా వేసుకోవడం లేదంటున్నారు' అని రాహుల్ తెలిపారు. 'భారత్‌లో ఎక్కడికైనా వెళ్లి ఓ యువకుడిని ఏం చేస్తున్నావని అడిగితే.. ఏమీ చేయట్లేదంటాడు. యువత నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతున్నది' అని చెప్పారు. 'ప్రపంచంలో రెండు విజన్‌లున్నాయి. ఒకటి అమెరికా, రెండు చైనా. రాబోయే పదేండ్లలో నేను భారత్ విజన్‌ను చూడాలనుకుంటున్నాను' అని కాంగ్రెస్ అధ్యక్షుడు తెలిపారు. గత యూపీఏ చివరిరోజుల్లో తమ ప్రభుత్వం ప్రజలు ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోయిందన్నారు. కాంగ్రెస్‌లో అంతర్గత మార్పులు అవసరమన్నారు. కాంగ్రెస్ పార్టీలో విధాన నిర్ణాయక వేదిక 'కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ'ని నియమించుకునేందుకు అధ్యక్షుడు రాహుల్ గాంధీకి అధికారం కల్పిస్తూ కాంగ్రెస్ ప్లీనరీ అధికారం కట్టబెట్టింది.

నేడు టీడీపీ, వైసీపీ మరోసారి అవిశ్వాసం

- 150 మంది ఎంపీల మద్దతు ఉంది: ఏపీ మంత్రి గంటా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీడీపీ, వైసీపీ సోమవారం మళ్లీ అవిశ్వాస తీర్మానాలను అందజేయనున్నాయి. రిజర్వేషన్లను పెంచాలని ఇప్పటికే టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఆందోళనలు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం పార్లమెంట్ సమావేశాలు మరోసారి వాడి వేడిగా కొనసాగే అవకాశముంది. ఏపీ విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానానికి అనుగుణంగా పలు పార్టీల మద్దతును సీఎం చంద్రబాబు కూడగడుతున్నారని తెలిపారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 150 మంది ఎంపీల మద్దతు కూడగట్టినట్లు చెప్పారు.

శ్రీలంకలో ఎమర్జెన్సీ ఎత్తివేత

కొలంబో: శ్రీలంకలో 12 రోజులుగా కొనసాగుతున్న అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)ని దేశాధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ఆదివారం ఎత్తివేశారు. క్యాండీ, అంపారా జిల్లాల్లో సింహళ బౌద్ధులు-ముస్లింల మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు చెలరేగడంతో ఈ నెల 6న దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీని విధించారు. భారత్, జపాన్ పర్యటన ముగించుకుని శనివారం రాత్రి సిరిసేన శ్రీలంకకు తిరిగి వచ్చారు. దేశంలో సాధారణ పరిస్థితులు నెలకొనడంతో అత్యవసర పరిస్థితిని ఎత్తివేసినట్టు సిరిసేన ట్వీట్‌చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఎయిమ్స్ వైద్యులు మృతి

- ఢిల్లీ నుంచి ఆగ్రా వెళుతుండగా ప్రమాదం

మథుర: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మథుర సమీపంలో యమునా ఎక్స్‌ప్రెస్ వేపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఎయిమ్స్ వైద్యులు దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగా గాయపడిన మరో నలుగురు డాక్టర్ల పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఇద్దరు మహిళా వైద్యులు ఉన్నారు. డాక్టర్ హర్షద్ వాంఖడే పుట్టినరోజు కోసం వీరంతా ఢిల్లీ నుంచి ఆగ్రా బయల్దేరారు. కంటైనర్ పైకి వీరు ప్రయాణిస్తున్న కారు దూసుకుపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో పుట్టినరోజు జరుపుకుంటున్న డాక్టర్ హర్షద్ కూడా మరణించారు.

బంగ్లాదేశ్‌లో ఏడుగురు ఉగ్రవాదులకు మరణశిక్ష

ఢాకా: సూఫీ మసీదు సంరక్షకుడు రహమత్ అలీ హత్య కేసులో ఏడుగురు ఉగ్రవాదులకు బంగ్లాదేశ్ కోర్టు ఆదివారం మరణశిక్ష విధించింది. 2015 నవంబర్ 10న ఉగ్రవాదులు రహమత్ అలీని అపహరించి గొంతుకోసి చంపేశారు. ఈ కేసులో నియో-జేఎంబీ ప్రాంతీయ కమాండర్ మసూద్ రణ సహా ఏడుగురు ఉగ్రవాదులకు రంగ్‌పూర్ కోర్టు న్యాయమూర్తి నరేశ్‌చంద్ర సర్కార్ మరణశిక్ష విధించారు. శిక్షపడిన ఏడుగురిలో ఒకరు పరారీలో ఉన్నారు.

పాక్‌లో ఇద్దరు పోలియో వలంటీర్ల హత్య

పెషావర్: పాకిస్థాన్‌లోని పెషావర్‌లో పల్స్‌పోలియో బృందంపై ఆదివారం ఉగ్రవాదులు దాడి చేశారు. ఇద్దరు వలంటీర్లను కాల్చి చంపారు. సఫీ తహసిల్‌లోని మహ్మద్ ఏజెన్సీకి చెందిన ఏడుగురు సభ్యుల బృందంపై గుర్తుతెలియని ఉగ్రవాదులు కాల్పులు జరిపారని అధికారులు తెలిపారు. వ్యాక్సినేషన్ ముసుగులో సంతానశక్తి హరించే మందులు వేస్తున్నారంటూ మత సంస్థలు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో పోలియో సిబ్బందిపై దేశవ్యాప్తంగా దాడులు జరుగుతున్నాయి.

విమానాశ్రయాల్లో 5 కేజీల బంగారం స్వాధీనం

మంగళూరు: మంగళూరు, కొచ్చి విమానాశ్రయాల్లో శనివారం రూ.1.6కోట్ల విలువైన బంగారం పట్టుబడింది. దుబాయ్ నుంచి మంగళూరు వచ్చిన జెట్ ఎయిర్‌వేస్ విమానం టాయిలెట్‌లో కొందరు ఒక్కొక్కటి కిలో బరువున్న నాలుగు బంగారు బిస్కెట్లను వదిలివెళ్లారు. మరో ప్రయాణికుడి నుంచి 227 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొచ్చి విమానాశ్రయంలో గల్ఫ్ నుంచి వచ్చిన ప్రయాణికుడి వద్ద 973గ్రాముల బంగారం పట్టుబడింది.

పాక్ కాల్పుల్లో ఐదుగురు పౌరుల మృతి

జమ్ములోని పూంఛ్ జిల్లాలో ఘటన

జమ్ము, మార్చి 18: పాక్ సైన్యం మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని పూంఛ్ జిల్లా నియంత్రణరేఖవద్ద పాక్ సైన్యం జరిపిన కాల్పుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు బలయ్యారు. మరో ఏడుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో ఐదుగురు సైనికులు ఉన్నారు. పాక్ సైన్యం నాలుగుగంటల పాటు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడిందని ఆర్మీ లెఫ్ట్‌నెంట్ కర్నల్ దేవేందర్ ఆనంద్ పేర్కొన్నారు. పాక్ సైన్యం అమాయకులైన పౌరులపై దాడులకు పాల్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. భారతసైన్యం పాక్‌కు దీటైన జవాబు ఇస్తున్నదని రాష్ట్ర డీజీపీ ఎస్పీ వైద్


పాక్ కాల్పుల్లో గాయపడిన బాలిక

హెచ్చరించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలుపుతున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి మహబూబా ముఫ్తీ ట్విటర్‌లో పేర్కొన్నారు. పాక్ సైన్యం కాల్పుల్లో ఒకే కుటుంబానికి చెందిన భార్య, భర్త వారి ముగ్గురు కుమారులు మృతిచెందారు. ఇద్దరు కుమార్తెలు తీవ్రంగా గాయపడగా వారిని హెలిక్యాప్టర్‌లో జమ్ములోని దవాఖానకు తరలించారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

పాక్ సైన్యం కాల్పుల్లో మృతిచెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని.. వారికి ప్రభుత్వం అన్ని విధాల సాయం చేస్తుందని జమ్ముకశ్మీర్ మంత్రి నయీం అక్తర్ హామీ ఇచ్చారు. జమ్ములోని ప్రభుత్వ మెడికల్ కళాశాల దవాఖానలో చికిత్సపొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు.

రాజకీయ పార్టీల విదేశీ విరాళాలపై పరిశీలన ఉండదు

- కీలక సవరణను ఆమోదించిన లోక్‌సభ

న్యూఢిల్లీ, మార్చి 18: దేశంలో రాజకీయ పార్టీలు విరాళాలు స్వీకరించడానికి బాండ్ల విధానాన్ని తీసుకొచ్చిన కేంద్రప్రభుత్వం.. విదేశాల నుంచి మాత్రం ఎంతైనా విరాళాలు స్వీకరించేలా అనుమతినిస్తున్నది. ఇందుకు ప్రతిపాదించిన సవరణను ఇటీవల లోక్‌సభ ఆమోదించింది. ఆ సవరణ ప్రకారం 1976 నుంచి రాజకీయ పార్టీలు విదేశాల నుంచి స్వీకరించిన విరాళాలపై పరిశీలన ఉండదు. దీంతో జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌కు పెద్ద ఊరట లభించినట్లైంది. గత బుధవారం లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2018 ఆమోదం సందర్భంగా ప్రభుత్వం 21 సవరణలు చేసింది. అందులో విదేశీ విరాళాల స్వీకరణకు సంబంధించిన సవరణ ఒకటి ఉంది. 'ఫారెన్ కంట్రిబ్యూషన్(రెగ్యులేషన్) యాక్ట్-2010(ఎఫ్‌సీఆర్ఏ)' ప్రకారం రాజకీయ పార్టీలు విదేశీ విరాళాలు స్వీకరించడంపై పలు ఆంక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎఫ్‌సీఆర్ఏను గతంలో కేంద్రప్రభుత్వం సరళీకరించింది. తాజాగా సవరణ చేయడంతో ఇక రాజకీయ పార్టీలు విదేశీ విరాళాలను ఎంతైనా స్వీకరించడానికి వెసులుబాటు లభించింది.

9 సవరణలతో క్యాబినెట్‌కు ట్రాన్స్‌జెండర్ హక్కుల బిల్లు

ట్రాన్స్‌జెండర్ హక్కులకు సంబంధించిన బిల్లును కేంద్ర సామాజిక, న్యాయ మంత్రిత్వ శాఖ క్యాబినెట్‌కు పంపింది. పార్లమెంట్ స్థాయీ సంఘం సిఫారసులను పరిగణనలోకి తీసుకున్న సామాజిక, న్యాయ శాఖ మొత్తం తొమ్మిది సవరణలు చేయాలని నిర్ణయించింది. ఇటు పురుషుడు, అటు స్త్రీ కాని వారిని గతంలో ట్రాన్స్‌జెండర్‌గా గుర్తించేవారు. అయితే దీనికి సామాజిక న్యాయ శాఖ కొత్త నిర్వచనాన్ని ప్రతిపాదించింది. సంబంధిత వ్యక్తి హిజ్రాగా పుట్టడం(స్త్రీ లేదా పురుషుడిగా జన్మించకపోవడం) తర్వాత ఆ వ్యక్తి లింగ మార్పిడి చేసుకొని స్త్రీ లేదా పురుషుడిగా మారడం జరిగితే వారిని ట్రాన్స్‌జెండర్‌గా గుర్తించాలని సూచించింది. మొత్తం తొమ్మి ది ప్రతిపాదిత సవరణలు ఉన్నాయి. ఈ బిల్లును క్యాబినెట్ ఆమోదించాక పార్లమెంట్ ముందుకు రానుంది. ట్రాన్స్‌జెండర్స్‌కు పథకాలు రూపొందించడానికి, ఆయా పథకాలు లబ్ధిదారులకు చేరడానికి ఈ బిల్లు ఎంతగానో ఉపయోగపడనుంది.


నాలుగో దఫా రష్యా అధ్యక్షుడిగా పుతిన్!




మాస్కో: రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ నాలుగో దఫా ఎన్నికయ్యేందుకు రంగం సిద్ధమైంది. 74% ఓట్లను పుతిన్ సాధించనున్నట్లు ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించాయి. స్థానిక కాలమానం ప్రకారం శనివారం రాత్రి 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై ఆది వారం ముగిసింది. చట్టపరమైన సమస్యలతో ప్రధాన పోటీదారు అలెక్సీ నావల్నీని పోటీకి అనర్హులని ప్రకటించారు. దీంతో పుతిన్ ఎన్నిక లాంఛనమేనని భావిస్తున్నారు. దేశ అధ్యక్షుడిగా, ప్రధానిగా 18 ఏండ్లు అధికారంలో ఉన్న పుతిన్‌కు 70 శాతం ఓట్లు లభిస్తేనే ఆయన ఎన్నికకు చట్టబద్ధత లభిస్తుంది. నాలుగో దఫా అధ్యక్షుడిగా ఎన్నికైతే.. స్టాలిన్ తర్వాత అత్యధిక కాలం రష్యా అధ్యక్షుడిగా పనిచేసిన రికార్డు పుతిన్ దక్కించుకోనున్నారు.

పేపర్ బ్యాలెట్‌పై బహిరంగ చర్చకు సిద్ధమన్న బీజేపీ

- భవిష్యత్‌లో పరిశీలిస్తామన్న రాంమాధవ్



న్యూఢిల్లీ, మార్చి 18: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లకు బదులుగా బ్యాలెట్ విధానాన్ని అమలులోకి తేవాలన్న డిమాండ్‌పై బీజేపీ సానుకూలంగా స్పందించింది. పేపర్‌బ్యాలెట్లపై ఏకాభిప్రాయం వ్యక్తమైతే భవిష్యత్‌లో ఈవీఎంల స్థానంలో వీటిని తిరిగి వినియోగంలోకి తేచ్చే విషయాన్ని పరిశీలిస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ తెలిపారు. 'సార్వజన సమ్మతి మేరకు ఈవీఎంలను తీసుకొచ్చాం. ఇప్పుడు బ్యాలెట్ పేపర్లనే తిరిగి వినియోగించాలని పార్టీలన్నీ కోరితే అందరితో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటాం' అని రాంమాధవ్ వెల్లడించారు. కాగా, ఈవీఎంలకు బదులుగా పేపర్ బ్యాలెట్లు తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ తన 84వ ప్లీనరీలో తీర్మానం ఆమోదించింది.



మీ హృదయంపై లిఖించుకోండి. ఏడాదిలో ప్రతి దినం శుభదినమే.

ఎమర్సన్

ఉగాది యుగాది!

బతుకు చెట్టుకు ఆశల చిగుళ్ళు వేయించి
భవిష్యత్ సూర్యుడితో ప్రేమలో పడ్డ క్షణమే
వసంతం..!
నిర్లిప్త నిరామయ నిర్విణ్ణ ఘడియలకు
రాగాల రంగులను పూయించినదే
కోయిల గీతం!
మూసుకున్న తలపుల దర్వాజా పై
ఆకు పచ్చని కొత్త కోరికలను అలంకరించిందే
మామిడాకుల తోరణం!
షడ్రుచుల లాలసలో ఓలలాడే నిండు దేహానికి
పుట్టి పెరిగిన ఊరుకు
ఎదిగి నిలిచిన నగరానికి
ఊహిస్తున్న ఉటోపియా కు
పొంతన కుదరని ఆగమాగపు విస్మయం
వేప పూత వికాసం!
పంచేంద్రియాల బందిఖానా లోంచి
ప్రపంచ వీక్షణం
పంచ భూతాల సయ్యాటలోంచి
అంతరిక్షాల అన్వేషణం
నింగికీ– నేలకూ, తలకూ– పాదానికీ
లంకె పెట్టే సందిగ్ధ సమయం
పంచాంగం!
మనో యవనిక మీద
స్వప్న వాస్తవాలు– తాత్విక మీమాంసలు
వైఫల్య విజయాలు– విషాదానందాల వర్ణ చిత్రం
కొత్త సంవత్సరం!
అకాల కాలం – కాలాకాలం
కకావికలం– కలకలం
అన్నిటికీ అతీతమై నిలిచే
చిగురాకు అస్తిత్వం– చినుకు మనస్తత్వం
ఎండ పొడ తత్త్వం– పైరగాలి మహత్యం
ఉగాది ఉత్సవం!
ఉగాది...
పునాది మనాదిల కలబోత..!
అనాది యాదిల కలల నేత ...!!

- మామిడి హరికృష్ణ, 80080 05231

ప్రకృతికే నేస్తంలా..

కోయిలా కూయవేల?
రాయిలా మౌనమేల?
ఉగాది రాలేదనా..? రాదేలనా..?
మామిడమ్మ చివురేయలేదనా
మల్లిచెల్లి పూయలేదనా
చింత కాయకుంటే ఎందుకంత చింత?
మన్మథుడు చెఱకును విల్లుకై
ఎత్తుకెళ్లాడనా !
మమకారాలు కరువయ్యాయనా..!
నీ పాట జనం మరి'చేద'య్యిందనా..!
పర్యావరణముప్పు వల్ల కన్నీటి ఉప్పూ
కరువయ్యిందనా!!
ఎందుకు నేస్తం? ఈ బేలతనం..?
నేనున్నాను నీకోసం
నా షడ్రుచుల జీవితమూ ఉంది
తలపు(తలుపు)'తీయని'మనసుంది
కాసింత మా'నవత'పై మమ'కార'ముంది
నచ్చక చిటపట లాడినా
తప్పని సరియగు స్నేహిత(ం)ము(ఉ)ప్పుంది
కారణమేదైనా మెచ్చేనేస్తాలను మరిచేదుంది
నొప్పించినా స'వరించి' ఉల్లాస తీరాలకు
పరుగులు తీసి వగర్చేదుంది(వగరు+చేదు)
జీవిత మలుపు మలుపులో గెలిపించే
'వే(లు)పు'లు అందించే దీవెన ఉంది
పాడవే కోయిలా.. పాడుకోయిలా..
ప్రకృతికే నేస్తంలా.. పాటే సమస్తంలా...

- రాఖీ, 94910 42010

రొట్టె మరియు రోజా పూలు

లక్ష చీకటి పాఠశాలల్ని
వేలాది బూడిద వర్ణపు మిల్లుల ధాన్యపు గదుల్నీ స్పృశిస్తూ
హఠాత్తుగా వచ్చి సూర్యుడు వెలిగించే
అందమైన ఉషోదయాన
మేం వస్తాం కదం తొక్కుతూ.. పదం పాడుతూ..
మా పాటల్ని జనం వింటారు
'మాకు రొట్టె కావాలి వికసించే కుసుమాలు కూడా కావాలి
మాకు రొట్టె కావాలి రోజా పూలు కూడా కావాలి..'
మేం కదం తొక్కుతూ, పదం పాడుతూ..
పురుషుల కోసం కూడా పోరాడుతాం!
వాళ్లు మా సంతానమే కదా! మేం వాళ్ళకు తల్లులమే కదా!!
పుట్టుక మొదలుకొని బతుకు ముగిసేదాకా
అలుపెరుగక సాగుతాం!
మా దేహాలే కాదు హృదయాలు కూడా
ఆకలితో అలమటిస్తే..
'మాకు రొట్టెలివ్వండి, వికసించే కుసుమాలనివ్వండి'
మా ఈ మహా ప్రస్థానంలో అమరులైన
అసంఖ్యాక మహిళల దుఃఖం ధ్వనిస్తూ ఉంటుంది
ఒక చిన్న కల, కాసింత ప్రేమ మరియు సౌందర్యం
వారి బానిస ఆత్మలకు తెలుసు!
అవును మేం పోరాడేది రొట్టె కోసం
అంతేకాదు వికసించే కుసుమాల కోసం
కదం తొక్కుతూ.. పదం పాడుతూ..
మేం మంచి రోజుల్ని సాధిస్తాం!
స్త్రీలు వెలిగిపోవడమంటే
జాతి ప్రకాశించడమేనంటాం
ఇకపై బానిసత్వానికి వీల్లేదు
పది మంది కష్టంతో
ఒకడు సుఖించడానికి వీల్లేదు
జీవన మాధుర్యాన్ని అందరమూ కలిసి ఆస్వాదిద్దాం
'మనకు రొట్టె కావాలి
వికసించే కుసుమాలు కూడా కావాల'ని నినదిద్దాం
అవును మనకు రొట్టె కావాలి
రోజా పూలు కూడా కావాలి.

- డాక్టర్ ఎస్వీ సత్యనారాయణ, 96180 32390
(ఇంగ్లీష్ మూలం: జేమ్స్ ఓపెన్‌హామ్)

యుతనేసియా

నా చుట్టూ నేను పెంచుకున్న
బంధాలు గట్టివి
ప్రేమదారాలతో నేనే
అల్లుకుంటూ పోయిన ఆశలూ అనురాగాలూ
దేహం చుట్టూ పెనవేసుకున్నాయి!
వాటిని తెంపుకోవాలంటే
అచేతన దేహమేమో కానీ
హృదయం విలవిలలాడుతున్నది! కానీ..
నిశ్చయంగా కనిపిస్తూనే వుంది
'కొడిగట్టిన దీపపు చివరి మెరుపు..'!
మృత్యువు కదలికనేమో
మందులూ మాకులూ శ్వాసోపకరణాలూ
ద్వారం వద్దే నిలిపేశాయి..!
రాత్రులూ పగల్లూ.. ఎన్నని
దీపపు చివరి 'నుసి' రాలాల్సిందే
హాజీర్ హో అన్న చివరి ఘంట మోగాల్సిందే!
ముగింపే..తలెత్తుకున్నంత గౌరవంగా..
సముద్రపు అలలంత గంభీరంగా..
గాలి వీచినంత స్వేచ్ఛగా..
పిలవంగానే పక్కమీంచి లేచినంత
సహజంగానూ జరగాలి!
కారుణ్యంతో కర్టెన్ దిగిపోవాలి..!!

- వారాల ఆనంద్, 94405 01281

దేశీ రీతుల రత్నావళి



కాకతీయ ప్రభువులలో మొదటి ప్రతాపరుద్రుడు 'విద్యాభూషణ' బిరుదాంకితుడు. గణపతిదేవ చక్రవర్తి సుమారు 60 సంవత్సరాల కు పైగా రాజ్యాన్ని పాలించి కాకతీయ సామ్రాజ్యాన్ని విస్తరింపజేశాడు. ఇతని కాలంలో కళలు విశిష్ట స్థానాన్ని సంతరించుకున్నాయి. ఇక రెండవ ప్రతాపరుద్రుడు స్వతహాగా కవి, పండితుడు, గాయక శిరోమణి, కళావేత్త. ఇతని కాలంలో లలితకళలకు ముఖ్యంగా శిల్పకళలకు, నృత్యానికి ఎంతో ప్రాశస్త్యం లభించింది. ఆ కాలంనాటి కళారూపాలకు నిదర్శనం జాయసేనాపతి విరచిత **'నృత్త రత్నావళి'** గ్రంథం.

జాయన అయ్యకుల వంశస్థుడు. పిన్నచోడ నాయకుని కుమారుడు. వీరిది వెలనాడులోని కొయ్యూరు గ్రామం. ఇతని వంశస్థులందరూ చోళరాజుల సేవకులు. జాయన తాతగారైన నారాయణ నాయకుడు వెలనాటి రెండవచోళుని కాలంలో గొప్ప నగరాన్ని నిర్మించి అక్కడే స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. క్రీ.శ.1203లో కాకతీయ గణపతిదేవ చక్రవర్తి వెలనాడుపై దండెత్తి జాయన తండ్రి అయిన పిన్నచోడ నాయకున్ని ఓడించి వెలనాడును వశపరుచుకొని, జాయన అక్కలైన నారమ, పేరమ లను వివాహం చేసుకున్నాడు.

అలాగే వయసులో చిన్నవాడైన జాయన సౌమ్యాకారము, సవినయ శౌర్య గాంభీర్యాలను గమనించిన గణపతిదేవుడు ఆయనను కాకతీయ గజ సైన్యాధిపతిగా నియమించి 1213లో 'తామ్రపురి'ని బహూకరించి పరిపాలనాధికారాన్ని కూడా ఇచ్చాడు. అంతేకాకుండా జాయన ప్రజ్ఞాపాటవాలను గుర్తించి కళాభ్యాసం కోసం గుండనామాత్యులను నియమించాడు. ఆ విధంగా కళలో ప్రాజ్ఞుడైన జాయన గణపతిదేవుని ఆజ్ఞతో 1253–54లో, అంటే సుమారు 60ఏండ్ల వయసులో **'నృత్తరత్నావళి'**ని రచించాడు.

నృత్తరత్నావళి 8 అధ్యాయాలతో కూడిన గ్రంథం. దీనిని రెండు భాగాలుగా విభజించవచ్చు. మొదటి నాలుగు అధ్యాయాలు మొదటి వర్గము. ఇందులో భరతుని నాట్యశాస్త్రాన్ని అనుసరించి **'మార్గ'** నృత్తము వివరింపబడింది. తరువాతి నాలుగు అధ్యాయాలు రెండవ వర్గము. ఇందులో 'దేశీ' సంప్రదాయాన్ని వర్ణించాడు జాయన.

జాయన వర్ణించిన దేశీ భేదాలను రెండు వర్గాలుగా విభజించవచ్చు. దేశీ స్థానక, ఉత్ప్లుతి, కరణ, భ్రమర, పాద, పాట, చారి, లాస్యాంగ, గతి భేదాలు మొదటి వర్గం. ఇవన్నీ మార్గ భేదాలను అనుసరిస్తూ అదనంగా చెప్పబడినవి. ఇక పేరణి, రాసకము, చర్చరి, బహురూపము, భాండిక, కొల్లాట నర్తనము మొదలైనవి ప్రత్యేక నృత్య పద్ధతులను రెండవ వర్గం కింద చేర్చవచ్చు.

దీనిని బట్టి జాయన వర్ణించిన దేశీ నృత్తములన్నీ ఆ కాలంలో ప్రచారంలో ఉన్నవే అని స్పష్టమవుతున్నది.

ఈ దేశీ నృత్తముల ప్రసక్తి ఒక్క నృత్తరత్నావళిలో తప్ప మరే గ్రంథంలోనూ కనబడదు. కాకతీయుల కాలంలో ప్రచారంలో ఉన్న దేశీ నృత్తాలను గురించిన ఏకైక ఆధారము జాయన రచన **నృత్తరత్నావళి** మాత్రమే. నృత్తరత్నావళిలో దేశీ నృత్తాలు ఈ విధంగా వర్ణింపబడ్డాయి.

పేరిణిని ప్రదర్శించే పురుషుడు కొన్ని లక్షణాలు కలిగి ఉండాలని నృత్తరత్నావళిలో వివరించాడు జాయన. అదేవిధంగా పేరిణి వేషం ఎలా ఉండాలో కూడా వర్ణించాడు జాయన. తన లాగానే వేషము ధరించిన సహాయకులు నలుగురుకానీ, ఆరుగురుకానీ, ఎనిమిదిమందికానీ ఒక్కొక్కరు లేదా జంటలుగా రంగస్థలంపై ప్రవేశించగా, సమపాదంతో కానీ, భుజంగ త్రాసిత పాదంతో కానీ నిలబడి, తెర ఎత్తిన తరువాత పేరిణి ప్రవేశించాలి.

నృత్తరత్నావళి 8 అధ్యాయాలతో కూడిన గ్రంథం. దీనిని రెండు భాగాలుగా విభజించవచ్చు. మొదటి నాలుగు అధ్యాయాలు మొదటి వర్గము. ఇందులో భరతుని నాట్యశాస్త్రాన్ని అనుసరించి 'మార్గ' నృత్తము వివరింపబడింది. తరువాతి నాలుగు అధ్యాయాలు రెండవ వర్గము. ఇందులో 'దేశీ' సంప్రదాయాన్ని వర్ణించాడు జాయన.

నృత్తము: లాస్య, తాండవ భేదాలతో చెప్పబడినది.

కైవారము: చరిత్రలో ప్రసిద్ధికెక్కిన చక్రవర్తుల, రాజుల శౌర్య గుణాలను పొగిడి వాటిచేత సభాపతిని స్తుతించడం.

ఘర్ఘము: తాళముతో కూడి లేదా తాళము లేకుండా చేసే వివిధ రకాల పాద విన్యాసం. ఏడు రకాల ఘర్గరి నృత్తరత్నావళితో వివరింపబడింది.

వికటము: తాళము లేని వికృత నృత్తము ఇది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే ప్రయుక్తమవుతుంది.

గీతము: వివిధ రాగాలలో ప్రబంధాలను పాడటం.

రాసకము: ఇది కాకతీయుల కాలంలో ప్రాచుర్యాన్ని పొందిన స్త్రీల బృంద నృత్యము. పదహారు మంది స్త్రీలు వాద్యాలను అనుసరిస్తూ, వివిధ పాద విన్యాసాలతో రంగస్థలానికి రెండు వైపుల నుంచి ప్రవేశించి బృందాలుగా ఏర్పడి హారము లాగా, వల లాగా వివిధ ఆకారాలను ఏర్పరచి, విడదీయబడుతూ నృత్యం చేయడం రాసక విశేషం.

నాట్య రాసకము: ఇది కూడా స్త్రీల నృత్యమే. నాయికలు వసంత రుతువుల్లో దేశీ ఉయ్యాల పాటలు పాడుతూ రాజుగారి చరిత్రను పదార్థాభినయంతో ప్రదర్శిస్తారు.

దండ రాసకము: ఇది నాట్యరాసకము వంటిదే. అయితే ఇందులో నర్తకులు చేతిలో కోలలను ధరిస్తారు. ఎనిమిది మంది నుంచి అరువై నాలుగు మంది వరకు ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. వీరు సరి జట్లుగా ఏర్పడి, చేతిలో మూరపొడవు కలిగి పలు రకాల చిత్రాలను చిత్రించిన కోలలను ధరిస్తారు.

శివప్రియము: ఇది శైవోత్సవ సమయాల్లో చేయబడే నృత్యం. ఇందులో స్త్రీలు లేదా పురుషులు కంచుతో కానీ, రాగితో కానీ చేసిన పాములను ఎడమచేతిలో, అట్టికొడుపులను కుడిచేతిలో పట్టుకుని లయానుసారంగా 'కిరికిట' అనే శబ్దం స్ఫురించేవిధంగా వాయిస్తూ రుద్రాక్షలను, విభూతిని ధరించి శివుని స్తుతిస్తూ బంతులు దీరి శివుని పాటలు పాడు తూ కొన్నిసార్లు గుండ్రంగా తిరుగుతూ, కొన్నిసార్లు ఎదురెదురుగా తిరిగి వివిధ విన్యాసాలతో నర్తిస్తారు.

చింతు నృత్తము: ఇది స్త్రీలు ప్రదర్శించే నర్తనం. స్త్రీలు 'చింతు' అనే పేరు కలిగిన ద్విపదలను పాడుతూ, ఆ పాటల అర్థాన్ని అభినయిస్తూ నర్తించడంవల్ల చింతు నృత్తము అని పేరు వచ్చింది. పాటలు, వాద్యాలను అనుసరిస్తూ లయానుగుణంగా చప్పట్లు కొడుతూ నర్తించడం దీని ప్రత్యేకత. ఈ నృత్తాన్ని జాతర్లలో ఎక్కువగా ప్రదర్శిస్తారు.

కందుక నృత్తము: ఇది విశేషమైన బంతి ఆట. లోపల కదులుతూ ధ్వని చేసే ఇనుపగుండ్లతో బంగారం, వెండి, కంచు లేదా మట్టితో చేయబడిన బంతులను తీసుకుని తమ బంతిని ఎదుటివారికి అందిస్తూ, వారి బంతులను తాము పట్టుకుంటూ స్త్రీలు నృత్యం చేస్తారు. బంతులను పట్టుకునే క్రమంలో 'స్త్రీలు' పక్షులలాగా ఎగురుతూ, వేడుకతో గట్టిగా కూతలు వేస్తూ బంతి కోసం చంచల నేత్రాలతో ఆకాశంలో చేపలు, తామరపూలు నిండిన కొలనులాగా ఈ ప్రదర్శన ఉంటుంది.

భాండిక నృత్తము: హాస్యగాళ్ళు ప్రదర్శించే నృత్తము భాండిక. పక్షుల, జంతువుల అనుకరణ, వికృష్టమైన మాటలు, చేష్టలతో హాస్యాన్ని కలిగించే ప్రదర్శన.

ఘటిసణీ నృత్తము: మృదువైన వేషము, స్ఫుటమైన నాదము గల శరీరము కలిగిన మాల జాతి స్త్రీ లేదా పురుషుడు ప్రదర్శించే నర్తనము, నర్తకులు హుడుక్కా అనే వాద్యాన్ని వాయిస్తూ దీనిని ప్రదర్శిస్తారు.

బహురూపము: ఒకే నర్తకుడు ఆశువుగా బహురూపాలను ధరించడమే బహురూప నృత్తము. లోకుల ఆయా రూపము, వేషము, చేష్ట, భాషలతో ప్రదర్శింపబడుతుంది.

సాత్త్వికాభినయము వదిలి లోకధర్మాన్ని ఆశ్రయించిన ఆంగిక, వాచక, ఆహార్యాభినయాలతో, హావ భావాలతో రెండు కాళ్ళు, నాలుగు కాళ్ళు, కాళ్ళు లేని సజీవ వస్తువుల అభినయంతో, అన్ని వాద్యాలతో కూడి పాటలతో, నృత్తముతో రాజు వంశము లేదా లోక ప్రసిద్ధమైన చరిత్రను బహురూపి ప్రదర్శిస్తారు.

గొండ్లి : ఇది వేటగత్తె నృత్యము లాంటిది. ఆటవిక సంప్రదాయానుసారం అలంకరించుకుని ధిల్లాంగనలు చేసే ప్రదర్శన ఇది.

కొల్లాట నర్తనము: కొల్లాటవారు అంటే దొమ్మరులు అని అర్థం. వారు ప్రదర్శించే నర్తనమే కొల్లాట నర్తనము (దొమ్మరాట).

మద్దెల, కంచు తాళాలు, జేగంట, భేరులు, తప్పెటలను వాద్యకారులు వాయిస్తుండగా, నర్తకులు తోలు తాడు మీద నడుస్తూ, వెదురుగడ మీద అనేక విన్యాసాలను ప్రదర్శిస్తారు. ఎత్తుగా ఎగురుతూ, కత్తులు మొదలైన శస్త్రాలను తిప్పుతూ కొల్లాట నర్తనాన్ని ప్రదర్శిస్తారు.

నృత్తరత్నావళిలో జాయసేనాపతి వివరించిన ఈ నర్తనాలన్నీ కాకతీయుల కాలం కన్నా ప్రాచీనమైనవని ఊహించవచ్చు. కాకతీయుల కాలంలో ఇవి మరింత వైభవాన్ని పొంది ఉంటాయి. దేశీ నృత్యాలన్నీ తరతరాలుగా ప్రాంతీయ సంస్కృతీ వైభవానికి ప్రతీకలుగా చెప్పుకోవచ్చు.

– డాక్టర్ హెచ్.అనిత, 80197 35237

నిత్యహాసములు



'**వ**ర్షమ్ము' మనకెంతో హర్షమ్ము నింపగా
సరియైన సమయాన కురియుగాక!
నెలరాజులను బోలు నిత్యహాసమ్ములు
మా రైతు ముఖముల నమరుగాక!
పక్షపాతములేని పరిపాలనము మాకు
అధినాయకుల నుండి అందుగాక!
వారను, వీరను తారతమ్యములేక
స్త్రీలను గౌరవించెదము గాక!
అమ్మరో జుగుప్సను వీడి అన్ని మాధ్య
మములు శాంతి గంటల శబ్ద మయము గాగ
అనిమిషవరులు సతము మమ్మరయుచుండి
రక్షణము నిచ్చుత 'విళంబి' సాక్షముగను!!

-దోరవేటి
9866251679

అనుసృజనలో అడుగుజాడలు

తెలుగు సాహిత్యంలో సుదీర్ఘ కవితాయానం చేసి, ప్రజానుకూల సాహిత్య సృజనలో తనదైన ముద్ర వేసిన కవి నిఖిలేశ్వర్. తను ఎనభయవ పడిని చేరుకున్నా వడి తగ్గని కవితా కృషీవలుడు. ఇటీవలనే ఆయన 50 ఏండ్ల కవితా సేద్యపు సంకలనం వెలువడింది. ఆయన తెలుగులోనే కాక, ఇంగ్లీషు, హిందీ భాషలలోనూ నేరుగా సాహిత్య సృష్టి చేశారు. అంతేగాక ఆ భాషల నుంచి కవితలను తెలుగులోనికి అనువదించారు. వీటి నుంచి ఎన్నిక చేసిన 63కవితల సమాహారంగా **'అనుసృజన'** సంకలనం ఆవిష్కరించారు. అందులో తాను మొట్టమొదట 1959లో అనువదించిన రష్యన్ కవిత నుంచి 1917లో అనుసృజించిన టర్కిష్ కవిత వరకు దేశ విదేశ కవితలు సంకలించారు. విశాల విశ్వ కాన్వాసుపై ఇంతకాలం పాటు వచ్చిన కవితను ఒక్కచోట చదువగలుగటం చాలా ఆసక్తికరంగా వుంటుంది.


నిఖిలేశ్వర్ పునఃసృష్టించిన ఈ కవితలను చదువుతుంటే, పరాయి కవిత్వాన్ని గాక, తెలుగు కవిత్వాన్ని చదువుతున్నట్టు ఉంటుంది. అది నిఖిలేశ్వర్ సాధించిన విజయం. ఆయా భాషల నైసర్గికత, జాతీయత కూడా ప్రతిబింబించింది. ఈ సంకలనంలోని కవితలు ఒక అంతర్జాతీయ దృక్పథాన్ని కూడా కలిగిస్తాయి. అలా ఈ అనువాదాలు భిన్న సంస్కృతుల మధ్య వారధులుగా నిలుస్తాయి.

హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో చదివిన కవితల్లో తనను బాగా ఆకట్టుకున్న వాటిని ఆయన అనువదించారు. అలాగే ఆకాశవాణి వారి సౌజన్యంతో, వారి కోసం కొన్ని అనువాదం చేశారు. ఎన్నిక చేసిన ఇతర భాషల ఉత్తమ కవితలు కొన్ని ఉన్నాయి. అందువల్ల ఈ సంకలనంలో విస్తృతమైన వస్తు వైవిధ్యం వుంది. దాంతోపాటు నిఖిలేశ్వర్ అభిరుచి మేరకు ఎన్నిక చేసిన కవితలు కావటంతో ఒక తాత్విక ఏక సూత్రత, ఒక శైలీ సంవిధానం, విధానం కూడా కనిపిస్తాయి.

'అనువాదకుడు కవి అయితే అతని శైలీ సంవిధానం అనువాదాలను వెంటాడుతూనే వుంటుంద'ని స్వయంగా నిఖిలేశ్వర్ భావించారు. ఇది కొన్ని అనువాదాలకు అదనపు బలంగా తోడ్పడితే, కనీసం కొన్ని చోట్లయినా ఒక బలహీనతగా పరిధి విధిస్తుంది. ఈ అనుసృజనలో కవితలు జాగ్రత్తగా చదివితే ఆయా దేశాల, ప్రాంతాల మూలకవుల సంవిధానం కూడా స్పష్టాస్పష్టంగా కనిపిస్తుంది. నిఖిలేశ్వర్ తన తెలుగు కవితల్లో (సొంత రచనలు) వాడని పదాలు, పద బంధాలు, సమాసాలు, ఉపమాన ఉపమేయాలు, భావ చిత్రాలు, శైలీ విన్యాసాలు ఈ సంకలనంలో విరివిగానే కనిపిస్తాయి.

'నేనే గాంధారి కళ్ళ గంతల్లో
నేనే ద్రౌపది ఆగ్నేయ సంకల్పంలో
నేనే కవిత్వంలోని శోణిత కటాక్షాన్ని..'
(వనమాలీ విశ్వాస్)

ఎన్నుకొన్న కవితాంశాలను చూస్తే కవిగా, వ్యక్తిగా



నిఖిలేశ్వర్ నడిచివచ్చిన మార్గం కూడా రేఖామాత్రంగా కనిపిస్తుంది. 1959లో చేసిన బోరిస్ పాస్టర్ నాక్ అనువాదంలో వినిపించిన స్వేచ్ఛ–వెలుగు 'నా వెనుక గూఢచిత సంచలనం' అనే భావం కమ్యూనిస్టు వ్యవస్థలో పౌర స్వేచ్ఛ వుండదు అనే ప్రచారానికి లోబడిన దశ. 1969లో చేసిన జగదీష్ చతుర్వేది కవితానువాదం 'నగ్న ఆధారాలపై, కుష్టు గాయంతో, బాధతో అరుస్తోంది మానవత, సంస్కృతి వాంతి చేసుకొంది కుప్పలుగా పేద పురుగుల్ని' వంటివి ఆయన దిగంబర కవితాదశను సూచిస్తుంది. 1970లో ఎం.టి.ఖాన్ కవిత 'వర్తమానాన్ని పెరికి విప్లవ భవిష్యత్తును స్థాపించు' 'తూర్పు అడవుల మూలాలలోంచి మాట్లాడుతున్న బాణం. ఎర్రగా, ఉద్రేకంగా' వెయ్యి టి.ఎన్.టి శక్తితో బలంగా పేలమని పిలుపునిచ్చిన విప్లవ అతివాద దశకు నిదర్శనం.1974లో 'గోడ మీద రాత' (పంజాబీ నుంచి అనువాదం) 'జీవితం–స్వేచ్ఛ–విప్లవం' గురించి ఆలోచిస్తూ **' నా స్వరం వ్యాపిస్తున్నది రోదసిలోకి. మంటల నాలుకలా కనిపించని పక్షి పాటలా'** అని విప్లవం జన సమ్మతంగా ఒక విస్తృతిలో సాగవలసిన అవసరాన్ని గుర్తించిన ప్రజాతంత్ర విప్లవదశను సూచిస్తోంది. 1978లోని ఫిలిప్పైన్స్, కవితానువాదం 'కవి లాంటివాడు గెరిల్లా'. 1985లో వచ్చిన 'మేమంటే ఏమిటో నీకు తెలుసుకోవాలని వుంటే' కవితలు మేమంటే విప్లవం అని ఒక ఆత్మ కథాత్మక ప్రకటన చేస్తాయి. పాబ్లో నెరుడా కవితానువాదం (1971లో) వారి గోడలను కడుతున్నది మా చక్కెర, వారి నగరాలను నిర్మిస్తున్నది చిలీ నిబైట్, విశ్వవిద్యాలయాలకు ఇస్తున్నది పెరాగ్వే, బ్రెజిల్ కాఫీ, కొలంబియా పచ్చరాళ్ళు..ఇలా మూడవ ప్రపంచ దేశాలన్నీంటా వ్యాపించిన సామ్రాజ్యవాద దోపిడీని గుర్తించిన తీరు భావాంబర విప్లవం నుంచి భౌగోళిక వాస్తవాలను నడచివొచ్చిన దశకు అద్దం పడుతున్నది. అమర్‌జిత్ చందానీ పంజాబీ కవితను 1988లో చేసిన 'మామిడిచెట్టు' అనువాదం, 1990లో వచ్చిన హత్య జరిగాక, 2007 లోని 'జైల్లో వున్న ఉద్యమకారుల కోసం', నాజిమ్ హిక్మెత్ టర్కిష్ కవితానువాదం, నిఖిలేశ్వర్ ప్రజాతంత్ర హక్కుల కోసం ఉద్యమిస్తున్న దశకు సంకేతం.

'కుచాలు తప్ప ఇక్కడ కనపడవు మాతృమూర్తి పాలిండ్లు. డబ్బుతో అన్నీ కొనెయ్యగలమనే కృత్రిమ అంతరంగాలు తప్ప ఆప్యాయంగా పల్కరించే పెదాలు ఉండవు' అంటూ సెనెగల్ మాజీ అధ్యక్షుని ఆవేదన పంచుకున్నా (2005), 'నా కూతురు ప్రపంచపటంలో తనకిష్టమైన రంగులు నింపటం నేర్చుకుంది. నా వేలు విడిచి నడవడం నేర్చుకుంది' అన్న పాకిస్థానీ కవయిత్రి ఆత్మవిశ్వాసాన్ని అనువదించినా (2015), 'మీ వెనుకే వున్నది ఉత్సాహ ఉద్వేగాల సహోదరత్వం.. నీలి ఆకాశంలా' అని, 'స్వతంత్ర ద్వారాలు దగ్గర నిండైన కొమ్మల్లా విస్తరించిన టర్కిష్ కవులతో కరచాలనం చేసినా (2017).. ఈ అనుసృజన కవిత్వం దిగంబరం నుంచి అరుణాంబరం వరకు విస్తరించి నిఖిలేశ్వర్ కవితా తాత్వికతకు కరకంకణంలా భాసిస్తున్నది.

'స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ పైకెత్తుతోంది తన కాగడాను, చావు దగ్గరి కొవ్వొత్తిలా..' అంటూ.. **'నీ కొవ్వొత్తుల్ని మళ్లీ పైకి లేపి చరిత్రలో నడువు'** అని పిలుపునిస్తున్నాడు నిఖిలేశ్వర్. సాహితీ సృజనలోనూ, 'అనుసృజన'లోనూ తనదైన ప్రత్యేకత చాటుకున్న కవి నిఖిలేశ్వర్ ఆనుసరణీయుడు, ఆదర్శప్రాయుడు.

– డాక్టర్ యస్.జతిన్‌కుమార్, 98498 06281

ప్రకటనలు

ప్రపంచ కవితా దినోత్సవం

కవిసంధ్య, డాక్టర్ ఎస్.ఆర్.కె. ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 21న ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా ఆధునిక కవిత్వంపై జాతీయ సదస్సు, కావ్య సంపుటాల ఆవిష్కరణ ఉంటుంది. ఈ కార్యక్రమంలో మల్లాడి కృష్ణారావు, జయరాజ్ డానియల్, వాడ్రేవు సుందర్రావు, ఖాదర్ మొహియుద్దీన్, జి.లక్ష్మీనరసయ్య, రామతీర్థ, ప్రసాదమూర్తి, యాకూబ్, మువ్వా శ్రీనివాసరావు, మధునాపంతుల, దాట్ల దేవదానం రాజు, వాడ్రేవు వీరలక్ష్మి తదితరులు పాల్గొంటారు.

–తెలుగుశాఖ, డాక్టర్ ఎస్.ఆర్.కె. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల
– కవి సంధ్య, యానాం

తెలంగాణ సాహితి లిటరరీ ఫెస్ట్–2018

2018 ఏప్రిల్ 28,29,30 తేదీల్లో తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో జరుగు తెలంగాణ లిటరరీ ఫెస్ట్ –2018 సదస్సు తెలుగు విశ్వవిద్యాలయంలో జరుగుతుంది. ఈ సందర్భంగా పరిశోధనా వ్యాసాలను ఆహ్వానిస్తున్నాం.అంశాలు– తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కాలంలో వచ్చిన సాహిత్యం, ప్రపంచీకరణ కవిత్వంలో తెలంగాణ ప్రాదేశికత, తెలంగాణ ఉద్యమ కవిత్వం–తొలి మలిదశలు, సామాజిక మాధ్యమాలు–కవిత్వ ప్రమాణాలు, తెలంగాణ కవిత్వం–తెలంగాణ భాషానుశీలన. వ్యాసాలు ఐదు పేజీల నిడివితో అనుఫాంట్–7.0 వర్షన్‌లో ఓపెన్, పీడీఎఫ్ ఫైల్స్ ఏప్రిల్ 10లోపు పంపాలి. వ్యాసానికి 300 రూపాయలు చెల్లించాలి. చిరునామా: mk.ananthoju@gmail.com. రుసుమును– SATAE BANK OF INDIA, A/C No. 20137804269 , IFS Code: SBIN000916

–తెలంగాణ సాహితి

మూడుతరాల కవిసంగమం–37

కవిసంగమం ఆధ్వర్యంలో 2018 మార్చి25న, సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్,బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వతపరిషత్తులో మూడుతరాల కవిసంగమం సభ జరుగుతుంది. ఇందులో అల్లం నారాయణ, దయాకర్ వడ్లకొండ, పల్లిపట్టు, రమాదేవి బాలబోయిన, కృష్ణ గుగులోత్ హాజరవుతారు. అందరికీ ఆహ్వానం.

–కవి సంగమం

తెలంగాణ వచన కవితా వికాసం

తెలంగాణ సాహిత్య అకాడమీ, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి హనుమకొండ ఆధ్వర్యంలో 2018 మార్చి 22, 23 తేదీల్లో 'తెలంగాణ వచన కవితా వికాసం'పై జాతీయ సదస్సు జరుగుతుంది. ప్రొఫెసర్ బన్న అయిలయ్య ఆధ్వర్యంలో జరుగు ఈ సదస్సులో డాక్టర్ నందిని సిధారెడ్డి, డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, రామాచంద్రమౌళి, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఆచార్య కాత్యాయనీ విద్మహే, ప్రొఫెసర్ బూదాటి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ మాడభూషి సంపత్‌కుమార్, ఆర్. సీతారాం, డాక్టర్ బెల్లి యాదయ్య, ఆచార్య గుండెడప్పు కనకయ్య, డాక్టర్ జి. బాల శ్రీనివాసమూర్తి, డాక్టర్ త్రివేణి, డాక్టర్ లావణ్య, డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి, పగడాల నాగేందర్, షాజహానా తదితరులు హాజరవుతారు.

–ప్రొఫెసర్ బన్న అయిలయ్య, 9949106968, –డాక్టర్ పెద్ది వెంకటయ్య, 8919138273

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

నమస్తే తెలంగాణ

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
సోమవారం 19 మార్చి 2018
WWW.NTNEWS.COM

ఈ నొప్పి ఎందుకు?



అడుగండి చెబుతా

నా వయసు 45 సంవత్సరాలు. నాకు పదిరోజుల క్రితం నడుముకు ఒకపక్క కురుపుల మాదిరిగా వచ్చి బాగా నొప్పి వచ్చింది. పదిరోజుల్లో అవి మాడిపోయాయి. అయితే ఇప్పుడు లోపలి నుంచి భరించలేని నొప్పి వస్తున్నది. నాకు వస్తున్న నొప్పికి ఈ కురుపులకు ఏదైనా సంబంధం ఉందా? దీనికి పరిష్కారం ఏమిటి?

రవి, వరంగల్

మీరు పోస్ట్ న్యూరాల్జియా అనే వ్యాధితో బాధపడుతున్నారు. ఇది వారిసెల్లా జోస్టర్ అనే వైరస్ వల్ల వస్తుంది. షుగర్ వ్యాధి ఉన్న వారిలో రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వారికి ఇది రావచ్చు. జబ్బు వచ్చినపుడు మందులు వాడితే కురుపులు తగ్గిపోతాయి. వాడని వారిలో కురుపుఉల మాడిపోయినా భరించలేని నొప్పి వస్తుంది. దీనినే హెర్పెటిక్ న్యూరాల్జియా అంటారు. దీనికి రెండు, మూడు రకాల మందులు వాడాల్సి ఉంటుంది. మీరు వెంటనే డాక్టర్‌ను సంప్రదించి మీ వయసు, బరువును అనుసరించి మందులు వాడితే ఈ సమస్య పూర్తిగా తగ్గిపోతుంది.



డాక్టర్ మురళీధర్ రెడ్డి
కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్
కేర్ హాస్పిటల్స్
హైదరాబాద్



సంస్కృతి పరిరక్షణ కోసం..

భారతదేశం భిన్న సంస్కృతులు.. విభిన్న సంప్రదాయాలకు చిరునామా. ఇక్కడ భిన్నత్వంలో ఏకత్వం కనిపిస్తుంది. మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచ దేశాలు సైతం గొప్పగా చెప్తుంటాయి. మన వేషభాషల్ని గౌరవించడంతో పాటు కొందరు ఆచరిస్తుంటారు కూడా. మరి మన సంస్కృతీ.. సంప్రదాయాలను రక్షించుకోవాలి కదా!

సామాజిక మాధ్యమాల వేదికగా నెటిజన్లు అదే పనిచేస్తున్నారు. ట్విట్టర్ ద్వారా మన కల్చర్‌ను ప్రమోట్ చేసేందుకు.. విస్తరింపజేసేందుకు ముందుకొచ్చారు. #FinePeopleFromIndia పేరుతో ఓ మూమెంట్‌ను ఫామ్ చేశారు. ఈ హ్యాష్‌ట్యాగ్ ఉద్యమానికి ప్రవాసభారతీయులు శ్రీకారం చుట్టారు. దీంట్లో భాగంగా కల్చర్‌కు సంబంధించిన భిన్నమైన ఫొటోలను సెల్ఫీల రూపంలో జతచేసి ట్విట్టర్‌లో పోస్ట్ చేయాలి. #BindiTwitter selfie trend ట్రెండ్ తర్వాత సోషల్‌మీడియా వేదికగా మార్పు తీసుకొచ్చిన ట్రెండ్‌గా ఇది నిలుస్తున్నది. ఈ మూమెంట్‌లో యువత.. మహిళలు కూడా ఆసక్తితో పాలు పంచుకుంటున్నారు. దేశంలోని భిన్నత్వాన్ని చాటిచెప్పేందుకు.. సంస్కృతీ సంప్రదాయాల్ని పరిరక్షించేందుకు ఇది తోడ్పడుతుందంటున్నారు నెటిజన్లు.



సక్సెస్ మంత్ర

వ్యాపారం అనగానే చాలామంది మార్కెట్లో ఉన్న వాటినే ఎంచుకొని అందులోనే కొత్తగా ప్రయోగాలు చేయాలనుకుంటారు. కానీ ఆమె మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించింది. తండ్రి వారసత్వంగా వచ్చే బిజినెస్‌ను కాదని తనకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని విజయం సాధించింది. తనెంతో ఇష్టంగా తినే వేఫుల్స్‌నే వ్యాపారానికి ముడిసరుకుగా ఎంచుకొని అందులో రాణిస్తున్నది. సాధారణంగా తయారుచేసే రొటీన్ వేఫుల్స్‌కు భిన్నంగా ఎగ్‌లెస్ వేఫుల్స్ పరిచయం చేసి ఒక్క ఏడాదిలోనే రెండు వేఫుల్ స్టోర్స్ ప్రారంభించి తియ్యని వేడుక చేసుకుంటున్న నిషిత బియానీ సక్సెస్‌మంత్ర.



వేఫుల్స్ బిజినెస్‌లో కొత్త ట్రెండ్

నిషిత బియానీ

కొన్ని రకాల ఫుడ్ ఐటెమ్స్ టేస్ట్ నాలుకకు ఎంతగా నచ్చుతాయంటే వారంలో ఒక్కసారైనా వాటిని కచ్చితంగా టేస్ట్ చేయాలనిపిస్తుంది. వేఫుల్స్ కూడా అలాంటివే. గల్లు గల్లుగా ఉండే క్రిస్పీ అండ్ క్రంచీ స్నాక్ ఐటెమ్ ఇది. ముంబైకి చెందిన నిషిత బియానీకి కూడా వేఫుల్స్ అంటే చాలా ఇష్టం. ముంబై మొత్తం తిరిగినా అవి దొరికే స్టోర్స్ ఒక్కటి కూడా కనిపించలేదామెకు. ఇంత పెద్ద నగరంలో వేఫుల్స్ దొరుకకపోవడం ఆమెకు విచిత్రంగా తోచింది. ఇదే నిషిత మైండ్‌లో స్టార్టప్ ఐడియా తళుక్కున మెరిసేలా చేసింది. అలా 2014లో ముంబైలో ప్రారంభమైంది వేఫుల్స్ బిజినెస్. వాటి టేస్ట్ జనానికి ఏ రేంజ్‌లో నచ్చిందంటే– ఏడాది తిరిగే సరికి సిటీలో సెకండ్ వేఫులిస్ట్ స్టోర్ ఓపెన్ చేయాల్సి వచ్చింది.

ఇష్టాన్ని వ్యాపారంగా మార్చి..

ముంబైకి చెందిన 28 ఏళ్ల యువ పారిశ్రామికవేత్త నిషిత బియానీ. తన కుటుంబం నిర్వహిస్తున్న వ్యాపారంలో చేరడానికి అవకాశం ఉన్నప్పటికీ దాన్ని కాదని వేఫ్‌లిస్ట్ పేరుతో వేఫుల్స్ బిజినెస్‌ను ఎంచుకుంది. ఇంకా ప్రత్యేకంగా ఎగ్‌లెస్ వేఫుల్స్ తయారు చేయడంలో ఈ కేఫ్ ప్రసిద్ధి చెందింది. ఈ వినూత్న స్టార్టప్‌ను ప్రారంభించడానికి ఆమెకు ఒక సంవత్సర కాలం పట్టింది. 'వేఫుల్సే ఎందుకు? సాధారణంగా ఇది అందరికీ వచ్చే ప్రశ్న. దానికి ' ఇందులో పెద్ద విశేషం ఏం లేదు. నేను స్పష్టమైన వ్యాపార అవకాశాన్ని చూశాను. నాకు వేఫుల్స్ అంటే చాలా ఇష్టం. అయితే భారతీయ మార్కెట్లో వాటి లోటు కనిపించింది. దాన్ని భర్తీ చేయాలన్న సంకల్పమే ఈ వ్యాపారంలోకి అడుగుపెట్టడానికి కారణం. ముఖ్యంగా భారతదేశంలో ఇలాంటి ముఖ్యమైన స్వీట్ ఉండాలనిపించింది' అని నిషిత చెప్తారు.





వారసత్వ బిజినెస్‌ను కాదని..

ముంబైకి చెందిన ప్యూచర్‌గ్రూపు డైరెక్టర్ అనిల్ బియానీ కూతురే నిషిత బియానీ. చిన్నప్పటి నుంచి డబ్బుకు కొదువలేదు. సొంతంగా బిజినెస్ చేయాలన్న ఆలోచన ఉన్నా.. ముందు ఎంతో కొంత అనుభవం సంపాదించుకోవాలనుకొని ఫ్యామిలీ బిజినెస్‌లోకి ఎంటరైంది. అయితే కస్టమర్లతో డైరెక్టుగా మాట్లాడే చాన్స్ లేకపోవడం, వర్క్ చాలెంజింగ్ కాకపోవడంతో ఆమెకు ఆ పని నచ్చలేదు. అందుకే తనకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుంది. వ్యాపారం చేయడం నా రక్తంలోనే ఉంది. నాన్న వ్యాపారాన్ని పెంపొందించడానికి పెట్టుబడి పెడుతూనే ఉంటారు. నాకు ఏదన్న కావాలంటే నేను ప్రతిసారీ నాన్న అనుమతి తీసుకోవలసిందే. ఈ రోజు వరకు నాకు డెబిట్, క్రెడిట్ కార్డులు లేవు' అని నిషిత చెప్పుకుంది.

అనుభవాలే పాఠాలుగా..

అనుభవం నేర్పిన పాఠాలతో ధైర్యంగా ముందడుగేసి సొంత వెంచర్ స్టార్ట్ చేశారు నిషిత. ఆమెకు వ్యాపార పాఠాలు నేర్పిన గురువులు ఇద్దరున్నారు. వారే ఆమె తండ్రి, బాబాయి. సప్లయ్ చైన్, కాస్ట్ మేనేజ్‌మెంట్, బ్యాలెన్స్ షీట్ తదితర విషయాల గురించి ఆమె వారి దగ్గరే నేర్చుకుంది. తండ్రి, బాబాయి కేవలం గురువులు మాత్రమే కాదు, మంచి విమర్శకులు కూడా. వేఫ్‌లిస్ట్ ప్రారంభించడానికి కొన్ని రోజుల ముందు నిషిత తండ్రి ఆమెకు ఓ చాలెంజ్ విసిరారు. నిషిత స్వయంగా వేఫుల్స్ తయారు చేసి అమ్మాలని పందెం కట్టారు. నిజానికి ఆ పందెం వల్లే మంచి అనుభవం వచ్చిందంటారు నిషిత. మొదట రోడ్డు పక్కన వేఫుల్స్ తయారుచేసి అమ్మాలని నిర్ణయించుకుంది. అయితే గాలికి స్టవ్ మాటిమాటికీ ఆరిపోతుండేది. ఎండ వేడికి వేఫుల్స్ బ్యాటర్ గట్టిపడుతుండేది. ఆమె ఇబ్బంది చూసి పక్కనే దోశలు అమ్ముతున్న వ్యక్తి బ్యాటర్ ఎండిపోకుండా తడిగా ఉంచేందుకు ఏం చేయాలో చెప్పాడు. అది ఫాలో అయింది. అలా తొలిసారి వేఫుల్స్ అమ్మడం.. జీవితంలో గొప్ప పాఠం నేర్పింది అంటారు నిషిత. తర్వాత రోజుకో కొత్త సమస్య ఎదురయ్యేది. వాటిని పరిష్కరిస్తుంటే ఏదో తెలియని ఉత్సాహం కమ్మేసేది.

ఎగ్‌లెస్ వేఫుల్స్ రెడీ..

నిషితకు ఒకప్పుడు బేకింగ్ గురించి అసలేమీ తెలియదు. కానీ పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిదేమీ ఉండదన్న మాటలను నిజం చేస్తూ.. ఆమె ఇప్పుడు ఎక్స్‌పర్ట్ అయిపోయింది. వేఫుల్స్ తయారు చేయాలంటే ఎగ్స్ మస్ట్. గుడ్లు కలపనిదే వేఫుల్స్ చేయడం అసాధ్యం. బెల్జియంలోని బడా చెఫ్‌లు సైతం ఆమెకు ఇదే మాట చెప్పారు. కానీ నిషిత మాత్రం పట్టు వదులలేదు. ఇంటి కిచెన్‌నే ప్రయోగశాలగా మార్చేసింది. గంటల తరబడి కష్టపడి చివరకు ఎగ్‌లెస్ వేఫుల్‌ను జనానికి పరిచయం చేసింది. 'చిన్నప్పటి నుంచి ఏమైనా కొత్తగా చేయాలనిపించేది. కొత్తగా ఏదైనా ప్రయత్నిద్దామన్న ఆలోచనతో వేఫుల్స్ బిజినెస్‌లో అడుగుపెట్టా. కృషి ఉంటే ఏదైనా సాధ్యమేనన్న ధీమా, పట్టుదలతో ఈ రంగాన్ని ఎంచుకున్నా' అంటారు నిషిత.



విజయం దిశగా అడుగులు

వేఫ్‌లిస్ట్‌లో ప్రస్తుతం 25 మంది సిబ్బంది ఉన్నారు. ఉద్యోగుల్ని నియమించుకోవడం కన్నా వారికి ట్రైనింగ్ ఇవ్వడం చాలా కష్టం. మొదట్లో ఇబ్బందులు ఎదురైనా ఉద్యోగులకు అనుభవం వచ్చే కొద్ది అంతా సాఫీగా సాగిపోతున్నది. వేఫ్‌లిస్ట్ టీంలో చాలా మందికి ఇంగ్లిష్ సరిగా రాదు. అందుకే మీటింగ్‌లలో హిందీలోనే మాట్లడుతుంది నిషిత. ఇంగ్లిష్ రాదన్న కారణంతో తన స్టోర్స్‌లో ఒక వ్యక్తికి ఉద్యోగం ఇవ్వకపోవడమన్నది ఇప్పటి వరకు జరుగలేదంటారు నిషిత. వేఫులిస్ట్‌కు కస్టమర్ల సంఖ్య పెరుగుతోంది. తరుచూ వచ్చేవారు కొత్త మెనూ కావాలని డిమాండ్ చేస్తుంటారు. నిజానికిది పెద్ద సవాల్. రుచిలో తేడా రాకుండా కొత్త వెరైటీలను తయారుచేయడమన్నది కత్తి మీద సాములాంటి వ్యవహారమే. ఏ మాత్రం తేడా వచ్చినా బిజినెస్ దెబ్బతింటుంది. అలా డిమాండ్‌కు తగ్గ క్వాలిటీని మెయింటెన్ చేయడం వల్ల కస్టమర్ల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్నది. ఫోర్ట్ స్టోర్‌లో ఉన్న వేపులిస్ట్ బాంద్రాలోని స్టోర్ కన్నా 8 రెట్లు పెద్దగా ఉంటుంది. అక్కడి మెనూకీ ఇక్కడి మెనూకి తేడా ఏం లేదు. ఫోర్ట్ స్టోర్ లో వై–ఫై ఫెసిలిటీ, సీటింగ్ అరేంజ్‌మెంట్ కస్టమర్లను అట్రాక్ట్ చేస్తున్నది. వేపులిస్ట్‌లో జనం ఎక్కువ సేపు గడుపుతున్నారంటే ఆర్డర్‌లు పెరిగినట్లే లెక్క.

రిటైల్ ఆలోచనలు.

సెకండ్ స్టోర్ ఓపెన్ చేసేందుకు అవసరమైన డబ్బు సమకూర్చుకునేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది. బ్యాంకులను ఒప్పించి లోన్ పొందేందుకు దాదాపు ఆరు నెలల సమయం పట్టిందంటారు నిషిత. ప్రస్తుతం బిజినెస్ బాగా సాగుతున్నది. భవిష్యత్తుపై ఆమెకు భారీ అంచనాలే ఉన్నాయి. త్వరలోనే ఇతర సిటీల్లోనూ వేఫ్‌లిస్ట్‌లను ప్రారంభించాలన్నది నిషిత ప్లాన్. వేఫుల్స్‌ను రిటైల్‌గా అమ్మే అలోచనా ఉంది. సవాళ్లను సంతోషంగా స్వీకరించాలి. అప్పుడే వ్యక్తిగతంగానూ, ఆర్థికపరంగానూ అనుకున్నది సాధించగలుగుతారంటారు నిషిత. నిషిత జీవితంలో మ్యూజిక్ కూడా ఒక భాగం. పని ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఆమె సంగీతంతో స్వాంతన పొందుతుంది.

ఫ్యాషన్ రిటర్న్!

ఫ్యాషన్ ప్రపంచంలో రోజుకో కొత్త స్టైల్ వస్తుంటుంది. ఇప్పుడున్న స్టయిల్స్ తర్వాత పాతవైపోతుండొచ్చు. తర్వాత వచ్చినవే కొత్త ట్రెండ్ సెట్ చేస్తుండొచ్చు. అయితే పాతవి మళ్లీ రావా? ఎందుకు రావు. వస్తాయి. అలా వచ్చి ఫ్యాషన్ రంగంలో హల్‌చల్ చేస్తున్న స్టయిలే ఓవర్‌సైజ్డ్ స్లీవ్స్.

పదిహేనేళ్ల క్రితం లాంగ్ సైజ్డ్.. ఓవర్ సైజ్డ్ స్లీవ్స్ ట్రెండ్. సెలబ్రిటీలు వాటిని ధరిస్తే ఫ్యాన్స్ వాటిని ఫాలో అయ్యేవాళ్లు. తర్వాత కొంతకాలానికి స్లీవ్‌లెస్ స్టయిల్స్ వచ్చేసి లాంగ్ సైజ్డ్ ట్రెండ్‌కు చెక్‌పెట్టాయి. స్వీవ్‌లెస్ ట్రెండ్ ప్రభావం ఇప్పటికీ ఉంది. అయితే మళ్లీ ఓవర్‌సైజ్డ్ స్లీవ్స్ ఫ్యాషన్ వచ్చేసింది. దానికి అమెరికా శ్రీకారం చుట్టింది. ఆస్కార్ అవార్డ్ అందుకున్న ఫ్రాన్సెస్ మెక్ డార్మాండ్ ఈ డ్రెస్‌తో కనిపించి సందడి చేసింది. అందర్నీ ఆకట్టుకున్నది. బాలీవుడ్ నటి దీపికా పదుకోన్ కూడా ఇటీవల ఈ డ్రెస్‌లనే వేస్తున్నది. దీంతో క్రమంగా ఓవర్‌సైజ్డ్ స్వీవ్స్ ఫ్యాషన్ విస్తరిస్తున్నది. దీపికా తర్వాత సోనమ్ కపూర్ ఎక్కువగా ఈ డ్రెస్‌లో కనిపిస్తూ అలరిస్తున్నది. పాత ఎప్పటికైనా కొత్త ట్రెండ్‌గా వస్తుందని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ రోక్సండా ఇల్లిన్సిస్ అంటున్నది.



డాక్టర్ చదివిన వాళ్లు రాజకీయాల్లోకి రావడం అరుదు. అలాంటిది చిన్న వయసులోనే మెడలో స్టెతస్కోప్ తగిలించుకుంటే.. రోగుల ఆరోగ్యాలు తప్ప పాలిటిక్స్ గురించి అసలు ఆలోచన రాదు. కానీ ఈమె అలా కాదు.



సర్పంచ్.. అలియాస్

ఎంబీబీఎస్ డాక్టర్!

రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లా గ్రామ పంచాయతీ పరిధిలో ఆడపిల్లలను బడికే సరిగ్గా పంపించరు. అక్కడ డిగ్రీ, బీఈడీ చదివిన వాళ్లను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. కానీ ఈ ఫొటోలో కనిపిస్తున్న షహనాజ్ మాత్రం వీరందిరి కంటే ప్రత్యేకం. ఎందుకంటే.. ఈమె ఎంబీబీఎస్ చదువుతున్నది. 24 సంవత్సరాల షహనాజ్ ఈ విద్యా సంవత్సరం గడిస్తే ఎంబీబీఎస్ పూర్తి చేయబోతున్నది. ఆ తర్వాత పోస్టు గ్రాడ్యుయేషన్ చేయాలన్నది ఆమె ఆలోచన. కానీ.. ఉన్నట్టుండి పరిస్థితులు డాక్టర్ కావాల్సిన ఆమెను ఆ ఊరికి సర్పంచిని చేశాయి. అంతేకాదు.. ఇకపై పూర్తిస్థాయి రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నట్టు కూడా ప్రకటించింది షహనాజ్. దీనికంతటికీ కారణమేమంటే.. షహనాజ్ వాళ్ల తాతయ్య సర్పంచిగా ఉండేవారు. గతేడాది ఆయన ఎన్నిక చెల్లదని, స్థానిక కోర్టు ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ఆయన స్థానంలో సర్పంచిగా పోటీ చేయడానికి ఎవరూ లేకపోవడంతో ఆ స్థానాన్ని ఆయన వారసురాలిగా భర్తీ చేయాలనుకుంది షహనాజ్. అయితే.. రాజస్థాన్‌లో సర్పంచిగా పోటీ చేయాలంటే పదవ తరగతి పాసై ఉండాలి. ఈ అమ్మాయి ఏకంగా ఎంబీబీఎస్ చదువడం, తెలివితేటలు గల అమ్మాయిగా పేరుండడంతో ఆమె ఎన్నిక సులువుగా జరిగిపోయింది. అంతేకాదు.. గత 55 ఏళ్లుగా వీళ్ల తాతయ్యే ఆ ఊరి సర్పంచి. ఆమె తల్లి రాజస్థాన్ మంత్రిగా పనిచేస్తున్నారు. ఎంబీబీఎస్ చదువుతూ.. అతి చిన్న వయసులో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన షహనాజ్ పేరు రాజస్థాన్‌లో మారుమోగుతున్నది.

ఎండాకాలం ఫ్లవర్ ఫేషియల్స్..

వేసవిలో ఫేషియల్స్ ముఖానికే కాకుండా, మనసుకు కూడా హాయినిస్తాయి. ఫేషియల్స్‌తో ముఖానికి రక్తప్రసరణ జరిగి అందంగా కనిపిస్తుంది. అంతేకాకుండా పువ్వులతో చేసే ఫేషియల్స్‌తో లాభాలెన్నో ఉన్నాయి.

- రోస్ ఫేషియల్ వేసవిలో చర్మాన్ని పొడిబారకుండా స్మూత్‌గా ఉంచేందుకు ఉపయోగపడుతుంది. రంధ్రాల పరిమాణాన్ని, బ్రేకవుట్లను తగ్గిస్తుంది.
- లావెండర్ ఫేషియల్ క్రిమినాశక, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలతో ఉంటుంది. చర్మంపై అదనపు నూనెను తగ్గించి, కొవ్వు ఉత్పత్తిని తగ్గిస్తుంది. మొటిమలు కలిగించే బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది. దీనిని రెగ్యులర్‌గా చేయడం వల్ల ముఖం కాంతివంతంగా మారుతుంది.
- ఆర్చిడ్స్ ఫేషియల్ యాంటీ ఏజింగ్ లక్షణాలకు ప్రసిద్ధి. కాలుష్యం నుంచి చర్మాన్ని కాపాడుతుంది. వేసవిలో పొడి చర్మానికి ఇది చక్కటి పరిష్కారం.
- మ్యారీగోల్డ్ ఫేషియల్.. యాంటీ ఆక్సిడెంట్స్‌తో నిండి ఉంటుంది. చర్మంపై ఫ్రీ రాడికల్ నష్టం ప్రభవాన్ని తగ్గిస్తుంది. ఇది చర్మం ఎక్స్‌ఫోలియాట్ అవడానికి సహాయపడుతుంది. మొటిమలను నివారిస్తుంది. ఎండాకాలంలో జిడ్డు చర్మానికి ఇది చక్కటి పరిష్కారం.
- చమోమిలే ఫేషియల్ ఇది ముఖ రక్తనాళాలకు ఉపయోగపడుతుంది. ఏజింగ్ లక్షణాలను దూరం చేస్తుంది.



నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 19 మార్చి 2018

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్

కోల్‌కతా ప్రధాన కేంద్రంగా 'ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్' 1914లో ఏర్పడింది. బ్రిటిష్ పాలనాకాలంలో రసాయన శాస్త్రవేత్తలైన జేఎల్ సిమన్‌సన్, పీఎస్ మెక్‌మోహన్ చొరవతో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ రూపుదిద్దుకుంది. బ్రిటిష్ అసోసియేషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్ తరహాలో భారతదేశంలోనూ ఒక సంస్థను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో సైన్స్ కాంగ్రెస్‌ను స్థాపించారు. దేశంలోని శాస్త్ర, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లోని పరిశోధనలను ప్రోత్సహించాలనేది ఈ సంస్థ ఉద్దేశం. ప్రతి ఏటా జనవరి మొదటి వారంలో దేశంలోని ఏదైనా ఒక పట్టణంలో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశాలకు ప్రముఖ వ్యక్తి లేదా శాస్త్రవేత్త అధ్యక్షత వహిస్తారు. మొదటి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ 1914లో కోల్‌కతాలో జరిగింది. దీనికి అధ్యక్షుడిగా శాస్త్రవేత్త అశుతోష్ ముఖర్జీ వ్యవహరించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1947లో ఢిల్లీలో జరిగిన 34వ సమావేశాలకు అధ్యక్షత వహించాడు. 1976లో వాల్తేర్‌లో జరిగిన సమావేశానికి ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షత వహించాడు. ప్రముఖ శాస్త్రవేత్తలైన మోక్షగుండం విశ్వేశ్వరయ్య, శాంతి స్వరూప్ భట్నాగర్, మహలనోబిస్, కస్తూరీరంగన్, ఎంజీకే మీనన్, పీసీ రాయ్ తదితర ప్రముఖులు సైన్స్ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించారు. ప్రస్తుతం 105వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశం మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో నిర్వహిస్తున్నారు. అధ్యక్షుడిగా అచ్యుత సమంత వ్యవహరిస్తున్నారు. ఈ సైన్స్ కాంగ్రెస్ ఇతివృత్తం 'శాస్త్ర, సాంకేతికత ద్వారా ఇప్పటికీ చేరుకోలేని వర్గాలను చేరుకోవడం'. దాదాపు 5వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు.



వ్యాపారం కోసం భారత్‌కు వచ్చి కుట్ర, బలప్రయోగంతో దేశాన్ని ఆక్రమించిన బ్రిటిష్ పాలకులపై భారత ప్రజలు తరుచూ తిరగబడుతూ వచ్చారని చరిత్ర చెబుతున్నది. ముఖ్యంగా మైదాన ప్రాంత ప్రజల కంటే స్వేచ్ఛాపిపాసులైన గిరిజన సమూహాలు బ్రిటిష్ దమననీతిని తీవ్రంగా వ్యతిరేకించి అనేక తిరుగుబాట్లు చేశాయి. మైదాన ప్రాంతాల నుంచి వ్యవసాయదారులు, వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, వారిని బలపరిచే బ్రిటిష్ అధికారుల దోపిడీ పెరిగిపోవటంతో గిరిజనులు అనేక హింసాయుత ఘర్షణలకు దిగారు. అసాధారణ సైనిక బలం ఉన్న బ్రిటిషర్లు ఈ తిరుగుబాట్లను ఎప్పటికప్పుడు అణచివేస్తూ వచ్చినప్పటికి తదనంతర కాలంలో స్వాతంత్రోద్యమ నాయకులకు, ప్రజలకు ఈ తిరుగుబాట్లే స్ఫూర్తిగా నిలిచాయి. బ్రిటిష్ పాలనాకాలంలో దేశంలో జరిగిన ప్రధాన తిరుగుబాట్ల వివరాలు నిపుణ పాఠకుల కోసం..



TSPSC Special

స్వేచ్ఛా గళాల గర్జన

దేశంలో 1857కు ముందు, తర్వాతి తిరుగుబాట్లు

కట్ట బొమ్మన తిరుగుబాటు (1792-99)

- **జరిగిన ప్రాంతం:** తమిళనాడులోని తిరునల్వేలి.
- **తిరుగుబాటు నాయకులు:** వీర పాండ్య కట్ట బొమ్మన (పాంచాళ కురుచ్చీ ప్రాంత నాయకుడు)
- **కారణం:** బ్రిటిష్ సార్వభౌమాధికారం అంగీకరించకపోవడం
- **ఫలితం:** కట్ట బొమ్మనను ఉరితీసి, ఆయన రాజ్యాన్ని బ్రిటిష్ వారు ఆక్రమించారు.

పైకుల తిరుగుబాటు (1804-06)

- **జరిగిన ప్రాంతం:** ఒరిస్సా
- **తిరుగుబాటు నాయకులు:** కుర్దారాజు, జగ్‌బంధు
- **కారణం:** బ్రిటిష్ రెవెన్యూ విధానానికి వ్యతిరేకంగా
- **ఫలితం:** తిరుగుబాటును అణచివేశారు.

వేలుతంబి తిరుగుబాటు (1808 - 09)

- **జరిగిన ప్రాంతం:** కేరళలోని ట్రావెన్‌కోర్
- **తిరుగుబాటు నాయకులు:** వేలుతంబి (ట్రావెన్‌కోర్ సంస్థాన దివాన్)
- **కారణం:** బ్రిటిష్ సైన్య సహకార విధానం అమలులోని లోపాలను ఒప్పుకోకపోవడం
- **ఫలితం:** వేలుతంబిని ఉరితీసి, తిరుగుబాటుని అణచివేశారు.

బారామాయి తిరుగుబాటు (1816-19):

- **జరిగిన ప్రాంతం:** కథియవార్.
- **తిరుగుబాటు నాయకులు:** రావూ బారామాయి (కచ్ పాలకుడు)
- **కారణం:** బ్రిటిష్ వారి విస్తరణను అంగీకరించకపోవడం
- **ఫలితం:** ఓడిపోయి సైన్య సహకార పద్ధతికి అంగీకరించడం

రామోసీల తిరుగుబాటు (1822-29)

- **జరిగిన ప్రాంతం:** పూనా
- **నాయకులు:** చిత్తూర్‌సింగ్, ఉమాజీ
- **కారణం:** పీష్వా రాజ్యాన్ని బ్రిటిష్ వారు ఆక్రమించడంతో నిరుద్యోగులైన పోలీసులే ఈ రామోసీలు.
- **ఫలితం:** తిరుగుబాటు అణచివేసి వారికి భూములు, పోలీసు ఉద్యోగాలు ఇచ్చారు.

కిట్టూర్ తిరుగుబాటు (1824-29):

- **జరిగిన ప్రాంతం:** కర్ణాటకలోని ధార్వార్ ప్రాంతం
- **నాయకులు:** రాణి చెన్నమ్మ, రాయప్ప
- **కారణం:** కిట్టూరు అధిపతి శివలింగ రుద్రదేశాయి మృతి చెందాక, దత్త కుమారుడిని బ్రిటిష్ వారు అంగీకరించకుండా పరిపాలన చేపట్టడం.
- **ఫలితం:** రాజు భార్య చెన్నమ్మను బ్రిటిష్ వారు జైలులో బంధించి, ఆమెను బలపరిచిన రాయప్పను చంపివేశారు.

సంబాల్‌పూర్ తిరుగుబాట్లు (1827-1910)

- **జరిగిన ప్రాంతం:** సంబాల్‌పూర్ (ఒరిస్సా)
- **నాయకులు:** సురేంద్రసాయి
- **కారణం:** వారసత్వ ఎన్నిక విషయంలో (కిట్టూరి మాధురి) బ్రిటిష్ వారు జోక్యం చేసుకోవడం
- **ఫలితం:** తిరుగుబాటుని అణచివేసి, సురేంద్ర సాయిని జీవితకాలం జైలులో బంధించారు.

శతవంది తిరుగుబాటు (1839-45)

- **జరిగిన ప్రాంతం:** మహారాష్ట్రలోని శతవంది
- **నాయకులు:** పాండూ సావంత్
- **కారణం:** బ్రిటిష్ వారు శతవంది ప్రాంతాన్ని ఆక్రమించడం
- **ఫలితం:** మార్షల్ లా ప్రకటించి అణచివేశారు.

సతార తిరుగుబాటు (1840-41)

- **జరిగిన ప్రాంతం:** మహారాష్ట్రలోని సతార
- **నాయకులు:** ధార్‌రావ్ పవార్
- **కారణం:** సతార రాజు ప్రతాప్‌సింగ్‌ను బ్రిటిష్ వారు పదవి నుంచి తొలగించడం
- **ఫలితం:** ధార్‌రావ్ నాయకత్వంలో ప్రజలు చేసిన తిరుగుబాటును బ్రిటిష్ వారు అణచివేశారు.

బుందేల తిరుగుబాటు (1842)

- **జరిగిన ప్రాంతం:** మధ్యప్రదేశ్‌లోని సాగర్ ప్రాంతం
- **నాయకులు:** మధుకర్‌షా, జవహర్‌సింగ్
- **కారణం:** బ్రిటిష్ వారి రెవెన్యూ విధానానికి వ్యతిరేకం
- **ఫలితం:** తిరుగుబాటును అణచివేసి, నాయకులను ఉరితీశారు

గడకారి తిరుగుబాటు (1840-45)

- **జరిగిన ప్రాంతం:** మహారాష్ట్రలోని కొల్హాపూర్
- **కారణం:** గడకారీలు కొల్హాపూర్ రాజు వద్ద ఉన్న భూములను తీసుకుని రాజుకు సేవచేసే ఉద్యోగులు. అయితే, బ్రిటిష్ వారు కొల్హాపూర్‌ను ఆక్రమించి పన్నులు విధించడంతో వ్యతిరేకించారు.
- **ఫలితం:** తిరుగుబాటుని అణచివేశారు

రౌజ్ తిరుగుబాటు (1827- 37)

- **జరిగిన ప్రాంతం:** విశాఖపట్నం
- **నాయకులు:** వీరభద్రరౌజ్
- **కారణం:** అతని జమీందారీ ప్రాంతాన్ని ఆక్రమించి పింఛను ఇవ్వడం.
- **ఫలితం:** అణచి వేశారు

పాలకొండ తిరుగుబాటు (1831- 32)

- **జరిగిన ప్రాంతం:** తూర్పుగోదావరి గిరిజన ప్రాంతం
- **నాయకులు:** పాలకొండ జమీందారు
- **కారణం:** పన్ను చెల్లించలేదని జమీందారీని ఆక్రమించడం
- **ఫలితం:** అణచి వేశారు

గుంసూర్ తిరుగుబాటు (1835- 37)

- **జరిగిన ప్రాంతం:** గంజాం ప్రాంతం (ఒరిస్సా)
- **నాయకులు:** ధనుంజయ భాంజ
- **కారణం:** పన్ను బకాయిలు చెల్లించలేదని బ్రిటిష్ వారు జమీందారీని ఆక్రమించడం
- **ఫలితం:** తిరుగుబాటు అణచివేత

పర్లాకిమిడి తిరుగుబాటు (1829-35)

- **జరిగిన ప్రాంతం:** పర్లాకిమిడి (ఒరిస్సా)
- **నాయకులు:** జగన్నాథ్, గణపతి నారాయణ రావ్
- **కారణం:** పన్ను బకాయిలు చెల్లించలేదని జమీందారీని ఆక్రమించడం
- **ఫలితం:** తిరుగుబాటు అణచివేత

వహాబి ఉద్యమం (1820-70)

- **జరిగిన ప్రాంతం:** ఉత్తర భారతదేశం, దక్కన్
- **నాయకులు:** సయ్యద్ అహ్మద్
- **కారణం:** బ్రిటిష్ వారిని తమ శత్రువులుగా ప్రకటించి, ముస్లిం రాజ్యాన్ని స్థాపించడం
- **ఫలితం:** 50 ఏండ్లపాటు సుదీర్ఘ పోరాటం చేశారు. అతి కష్టం మీద బ్రిటిష్‌వారు ఉద్యమాన్ని అణచివేశారు.

పాగల్‌పంతి ఉద్యమం (1823 -35)

- **జరిగిన ప్రాంతం:** షేర్‌పూర్ (తూర్పుబెంగాల్)
- **నాయకులు:** కరంషా, టిప్పు
- **కారణం:** బ్రిటిష్ వారి అణచివేతకు వ్యతిరేకంగా
- **ఫలితం:** అణచివేశారు

కుకా ఉద్యమం (1845- 72)

- **జరిగిన ప్రాంతం:** పంజాబ్
- **నాయకులు:** భగత్ జవహర్‌మల్
- **కారణం:** సిక్కు మతాన్ని, సంఘాలను బలపరుచుకోవడం, బ్రిటిష్ వారి పంజాబ్ ఆక్రమణను వ్యతిరేకించడం
- **ఫలితం:** ఉద్యమాన్ని అణచివేశారు



సాసాల మల్లికార్జున్
అసిస్టెంట్ ప్రొఫెసర్
పెద్దపల్లి డిగ్రీ కాలేజీ
9492 575 006

ముఖ్యమైన గిరిజన తిరుగుబాట్లు

సంతాలులు (1855-56)

- ప్రస్తుత జార్ఖండ్ ప్రాంతం.
- సిద్ధో, కన్హో దీనికి నాయకులు.
- 1846 – 48లో గోండులు చక్రబిషాయి నాయకత్వంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు.
- 1831–32లో హోళులు 'బుద్ధోభగత్' నాయకత్వంలో తిరుగుబాటు చేశారు.
- 1913లో గోవింద్‌గురు నాయకత్వంలో భిల్లులు, 1914–16లో జాత్రభగత్ నాయకత్వంలో ఒరాన్‌లు, 1920లో రంపా ప్రాంతంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో కోయలు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు.
- 1899–1900లో వచ్చిన 'ముండ' తిరుగుబాటు ప్రాచుర్యం పొందింది. దీనికి 'బిర్సా ముండా' నాయకత్వం వహించాడు. దీనికి మత రంగు కూడా కలిసింది. వైష్ణవ భక్తుడు అయిన బిర్సా తనను తాను మత ప్రవక్తగా ప్రకటించుకుని క్రైస్తవ మిషనరీలపై దాడులు చేశాడు. ఈ తిరుగుబాటును 'ఉల్గులాన్ తిరుగుబాటు' అంటారు.

20వ శతాబ్దంలోని రైతు ఉద్యమాలు

- **నీలిమందు విప్లవం:** బెంగాల్‌లో ప్రారంభమైంది. బ్రిటిష్ పెట్టుబడిదారులు బెంగాల్‌లోని రైతులకు కొంత అడ్వాన్సులు ఇచ్చి నీలిమందు పంటను పండించమని కోరేవారు.
- వారి లాభాల కోసం మరింత ప్రాంతంలో నీలిమందు పండించాలని ఒత్తిడి చేయడం, వారికి ఇష్టమొచ్చిన ధరకు దానిని కొనడం, తమ మాట వినని రైతులపై దౌర్జన్యాలు చేశారు.
- దీనికి వ్యతిరేకంగా బెంగాల్‌లోని నాధియా జిల్లాలోని గోవింద్‌పూర్ గ్రామం నుంచి 'దిగంబర్ బిశ్వాస్', బిష్ణు బిస్వాస్ నాయకత్వంలో రైతులు తిరుగుబాటు చేశారు.
- హిందూ పేట్రియట్ పత్రిక ఎడిటర్ హరీశ్ చంద్ర ముఖర్జీ ఈ విప్లవానికి మద్దతు పలికాడు.
- దీనబంధుమిత్రగా ప్రఖ్యాతిగాంచిన సీఎఫ్ ఆండ్రూస్ తన 'నీల్‌దర్పన్' అనే పుస్తకంలో ఆ రైతుల కన్నీళ్లను, వారి బాధలను వర్ణించాడు.

పబ్నా ఉద్యమం

- జమీందారులు పన్నులు పెంచడం, మోసపూరిత విధానాలకు వ్యతిరేకంగా బెంగాల్‌లోని పబ్నా జిల్లాలోని యూసుఫ్ జాహి తాలూకాలో 1873లో ఈ తిరుగుబాటు ప్రారంభమైంది.
- ఇషాన్ చంద్రరాయ్, శంభూపాల్ వంటి వారు దీనికి నాయకత్వం వహించారు.
- చివరకు 1885లో 'బెంగాల్ కౌలు చట్టం' ద్వారా ఈ సమస్య పరిష్కారమైంది.
- **దక్కన్ తిరుగుబాటు:** 1874లో మహారాష్ట్రలోని సిరూర్ తాలూకాలోని కార్దా గ్రామంలో వడ్డీ వ్యాపారి 'కాలూరామ్'కు వ్యతిరేకంగా ఈ ఉద్యమం ప్రారంభమైంది.
- రైతులంతా కలిసి వడ్డీ వ్యాపారులను సాంఘిక బహిష్కరణ చేశారు. గ్రామసేవకులు కూడా వారికి పనులు చేయకుండా, వారి భూములను దున్నకుండా అన్నిరకాలుగా సహాయ నిరాకరణ చేశారు.
- ఈ సాంఘిక బహిష్కరణ పూనా, అహ్మద్‌నగర్, షోలాపూర్, సతారా జిల్లాలకు వ్యాపించింది.
- అనంతరం ఈ సాంఘిక బహిష్కరణ అనేకచోట్ల వ్యవసాయదాడులుగా మారింది. వడ్డీ వ్యాపారుల ఇంటిపై దాడి చేయడం, వారి ఇండ్లను, అప్పు పత్రాలను తగులబెట్టడం వంటి హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు.
- ఈ నేపథ్యంలో ప్రభుత్వం 1879లో దక్కన్ అగ్రికల్చరల్ రిలీఫ్ యాక్ట్ చేసి వడ్డీ రేటును నియంత్రించింది.
- ఈ ఉద్యమంలో పూనా సార్వజనీక సభ స్థాపించిన 'జస్టిస్ రనడే' ప్రజలను చైతన్యం చేయడంలో ముఖ్యపాత్ర పోషించాడు.
- **ఔధ్ (అవధ్) కిసాన్ ఉద్యమం:** ఇది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లో జరిగింది.
- 1918లో ఇంద్రనారాయణ్ ద్వివేది, గౌరీశంకర్ మిశ్రాలు కలిసి ఉత్తరప్రదేశ్ కిసాన్‌సభ ఏర్పాటు చేసి ఈ ఉద్యమాన్ని చేపట్టారు.
- ఈ సమయంలోనే బాబా రామచంద్ర రైతులను చైతన్య పరచి కుర్మీక్షత్రియ సభను ఏర్పాటు చేసి, జవహర్‌లాల్ నెహ్రూను అలహాబాద్‌లో కలిసి ఉత్తరప్రదేశ్ మొత్తం ఈ ఉద్యమం చేపట్టడానికి కారణమయ్యారు.
- నెహ్రూ, గౌరీశంకర్ మిశ్రా, బాబా రామచంద్ర 1920లో 'ఔధ్ కిసాన్‌సభ'ను ఏర్పాటు చేసి, ఈ ఉద్యమాన్ని బలోపేతం చేశారు.
- 1921 'ఔధ్ రెంట్ చట్టం' ద్వారా ప్రభుత్వం ఉపశమన చర్యలు చేపట్టింది.

ఐసెట్ ప్రిపరేషన్ ప్లాన్

- తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లోగానీ, ప్రముఖ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు చేయాలంటే I CET-2018 పరీక్ష రాయాలి. I CETను కాకతీయ యూనివర్సిటీ నిర్వహిస్తుంది. ఐసెట్ పరీక్షకు ఎలా సన్నద్ధం కావాలో తెలుసుకుందాం.
- I CET ప్రశ్నపత్రం మూడు విభాగాలుగా ఉంటుంది. అవి.. ఎ, బి, సి అని సెక్షన్లవారీగా ఇంగ్లిష్/తెలుగు మీడియంలో ప్రశ్నపత్రం ఉంటుంది.
- మొత్తం 200 ప్రశ్నలు. 200 మార్కులు. కాలవ్యవధి 150 నిమిషాలు.

1) **సెక్షన్–ఎ:** అనలిటికల్ ఎబిలిటీ– 75 ప్రశ్నలు/75 మార్కులు
2) **సెక్షన్–బి:** మ్యాథమెటికల్ ఎబిలిటీ– 75 ప్రశ్నలు/75 మార్కులు
3) **సెక్షన్–సి:** కమ్యూనికేషన్ ఎబిలిటీ– 75 ప్రశ్నలు/75 మార్కులు

- నెగిటివ్ మార్కింగ్ లేదు.
- ఉత్తీర్ణత కోసం జనరల్/ఓబీసీ అభ్యర్థులు 25 శాతం (50 మార్కులు) మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు క్వాలిఫయింగ్ మార్కుల నిబంధన ఏమీ లేదు.
- గతేడాది I CET ప్రశ్నపత్రం, మెరిట్ మార్కులను పరిశీలిస్తే.. ఈసారి 130/200 పైగా మార్కులు తెచ్చుకోవాలి.

సన్నద్ధత ఇలా..

1. I CETలో అధిక ప్రాధాన్యం మ్యాథ్స్/రీజనింగ్ విభాగాలకే ఉంది. కాబట్టి ఈ సెక్షన్‌పై పట్టు సాధించాలి.
2. సెక్షన్–ఎ లో డేటా సఫిషియన్సీ నుంచి 20 మార్కులు, ప్రాబ్లమ్ సాల్వింగ్ నుంచి 55 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ఈ సెక్షన్ చాలా కీలకం. ఇందులో మంచి మార్కులు పొందే అవకాశాలు చాలా ఉన్నాయి. ఈ విభాగం ఏ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకైనా సులువుగా ఉంటుంది.

- ఈ విభాగం నుంచి 20 మార్కులకు అంకగణిత, బీజగణిత, రేఖాగణిత అంశాల నుంచి 20 ప్రశ్నలు వస్తాయి. 55 మార్కులకు కోడింగ్–డికోడింగ్, వెన్ డయాగ్రమ్స్, అనాలజీ, లెటర్ సిరీస్, నంబర్ సిరీస్, నంబర్ సిస్టమ్స్, క్లాక్స్&క్యాలెండర్స్, డేటా–ఇంటర్‌ప్రిటేషన్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటితో పాటు రీజనింగ్ నుంచి సీటింగ్ అరెంజ్‌మెంట్స్, బ్లడ్ రిలేషన్స్, ర్యాంకింగ్–డైరెక్షన్స్ తదితర అంశాలపై కూడా ప్రశ్నలు వస్తాయి.
- మంచి మార్కులు పొందాలంటే అభ్యర్థులు ముందుగా మ్యాథ్స్ క్యాలిక్యులేషన్స్ బాగా ప్రాక్టీస్ చేయాలి. ప్రతిరోజూ 5–8 గంటలు సాధన చేయాలి. డేటా ఇంటర్‌ప్రిటేషన్, రీజనింగ్ విభాగాలను బాగా అవపోసన పట్టాలి.

సెక్షన్–బి మ్యాథమెటికల్ ఎబిలిటీస్

- ఇందులో అంకగణిత/అర్థమెటిక్ విభాగం 35, బీజగణితం/రేఖాగణితం, ఆల్‌జీబ్రా, జామెట్రీ విభాగం 35, స్టాటిస్టిక్స్/సాంఖ్యక శాస్త్రం 10 మార్కులు. మొత్తం 75 మార్కులు.
- అర్థమెటిక్ నుంచి శాతాలు, లాభనష్టాలు, భాగస్వామ్యాలు, కాలం–పని, నిష్పత్తి–అనుపాతం, సఖ్యావాదం, క.సా.గు, గ.సా.భా, ఘనపరిమాణాలు, కారణాంకాలు, ఘాతాంకాలు అంశాలపై 25 మార్కుల ప్రశ్నలు వస్తాయి.
- రేఖాగణితం నుంచి సమితులు– సంబంధాలు, ప్రవచనాలు, ప్రమేయాలు, ద్విపద సిద్ధాంతం, బహుపదులు–శేష సిద్ధాంతం, వర్గ సమీకరణాలు/మాత్రికలు, శ్రేఢులు, త్రికోణమితి, రూపాంక గణితం వంటి అంశాల నుంచి 35 మార్కులకు ప్రశ్నలు వస్తాయి.
- స్టాట్స్/సాంఖ్యక శాస్త్రం నుంచి సంభావ్యతలు, ప్రాథమిక భావనలపై 10 మార్కులకు ప్రశ్నలు వస్తాయి.
- సెక్షన్–బిలో అర్థమెటిక్/ప్యూర్ మ్యాథ్స్ ప్రశ్నలు అధికంగా ఉన్నాయి. వీటికోసం 9, 10వ తగరతుల పుస్తకాలు చదవాలి.
- నాన్ మ్యాథ్స్‌తోవారికి ఈ సెక్షన్ కీలకం. కాబట్టి 9, 10వ తరగతి మ్యాథ్స్‌తోపాటు షార్ట్‌కట్ పద్ధతులు నేర్చుకోవాలి. ప్రతి అంశంపై ప్రాథమిక స్థాయి అవగాహన అలవర్చుకోవాలి. నిత్యం పై అంశాలపై ప్రాక్టీస్ చేయడం వల్ల మంచి మార్కులు పొందవచ్చు.

సెక్షన్–సి కమ్యూనికేషన్ ఎబిలిటీస్

- ఈ విభాగం నుంచి 50 మార్కుల ప్రశ్నలుంటాయి. ఇందులో ఇంగ్లిష్, కంప్యూటర్&బిజినెస్ టెర్మినాలజీపై ప్రశ్నలు వస్తాయి.
- ఇంగ్లిష్ విభాగం నుంచి వొకాబులరీ, గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ (3 ప్యాసేజ్‌లు)తో పాటు వాయిస్, నెరేషన్ టెన్సెస్, ప్రిపొజిషన్స్ అంశాల నుంచి 40 ప్రశ్నలు వస్తాయి.
- బిజినెస్ & కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించిన అంశాలపై 10 ప్రశ్నలు వస్తాయి.
- సై సెక్షన్ పూర్తిగా థియరీ పార్ట్, వీటి కోసం సాధన చేయాల్సిన అవసరం అంతగా ఉండదు. కాబట్టి ఈ విభాగాన్ని ముందుగా పూర్తిచేసుకొని మళ్లీ పరీక్ష సమయంలో రివిజన్ చేయడంవల్ల సమయం వృథా కాకుండా మిగతా సెక్షన్లపై దృష్టి సారించవచ్చు.
- సెక్షన్–సి మూడో విభాగం స్కోరింగ్‌కు ఉపయోగపడుతుంది. కాబట్టి ఈ విభాగాన్ని నిర్లక్ష్యం చేయరాదు. ఐసెట్‌లో మంచి మార్కులతో ఉత్తమ ర్యాంకు సాధించడానికి ఈ విభాగం తోడ్పడుతుంది.
- ఐ సెట్ పరీక్షకు 70 రోజుల సమయం ఉంది. డిగ్రీ చివరి ఏడాది చదువుతున్నవారు పరీక్షలు పూర్తయిన వెంటనే ఐ సెట్‌కు ప్రిపేర్ కావాలి. ఇప్పటికే ప్రిపరేషన్‌లో ఉన్నవారు ప్రాథమిక అంశాలతోపాటు కాస్త కఠిన ప్రశ్నలపై దృష్టి సారించాలి. మూడు విభాగాలను బ్యాలెన్స్‌డ్ ధోరణితో సాధన చేయాలి.

ఇలా చేయండి

- అభ్యర్థులు కచ్చితంగా సొంత స్టడీ మెటీరియల్ తయారు చేసుకోవాలి. అందులో తమ శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకుని దాన్నే అనుసరించాలి.
- నాన్‌మ్యాథ్స్ అభ్యర్థులు గణితంపై పట్టు సాధించాలంటే స్పీడ్ మ్యాథ్ టెక్నిక్‌ను నేర్చుకోవాలి. ఈ సమయంలో షార్ట్‌కట్ మెథడ్‌పై దృష్టిపెట్టాలి.
- వీరు సెక్షన్–బి కి ఎక్కువ సమయం కేటాయించాలి. ఇందులో బేసిక్ అంశాలను గుర్తించి సులభమైన ప్రశ్నలను ముందుగా పూర్తిచేయడం వల్ల ఎక్కువ మార్కులు పొందవచ్చు. ఐ సెట్ ప్రీవియస్ పేపర్లతోపాటు మాక్‌టెస్ట్‌లు రాయడం వల్ల పరీక్షపై పట్టు సాధిస్తారు.



S. MADHU KIRAN
Director
FOCUS Academy
Hyderabad. 9030496929

ప్రపంచ సంతోష సూచీ-2018

మార్చి 20న అంతర్జాతీయ సంతోష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్యసమితికి చెందిన సస్టెయినబల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ (ఎస్‌డీఎస్‌ఎన్) 'ప్రపంచ సంతోష నివేదిక-2018'ను విడుదల చేసింది. ఆదాయం, ప్రజల ఆరోగ్య జీవనం, సామాజిక సామరస్యం, స్వేచ్ఛ, నమ్మకం, ఔదార్యం, తక్కువ అవినీతి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని 156 దేశాలతో కూడిన జాబితాను రూపొందించింది. అత్యంత సంతోషకరమైన దేశంగా ఫిన్లాండ్ అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో నార్వే, డెన్మార్క్, ఐస్‌లాండ్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, స్వీడన్, ఆస్ట్రేలియా ఉన్నాయి. గతేడాది నార్వే అగ్ర స్థానంలో ఉంది. చిట్టచివరి స్థానంలో (156వ స్థానం) బురుండి నిలిచింది. ఇక భారత్ 133వ స్థానంలో నిలిచింది. గతేడాది ర్యాంకు 128. పొరుగు దేశాలైన పాకిస్థాన్ 75, చైనా 86, భూటాన్ 97, నేపాల్ 101, బంగ్లాదేశ్ 115, శ్రీలంక 116, ఆఫ్ఘనిస్థాన్ 145వ స్థానంలో ఉన్నాయి. 155వ స్థానం సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, 154వ స్థానం దక్షిణ సూడాన్, 153వ స్థానం టాంజానియా, 152వ స్థానం యెమెన్, 151వ స్థానంలో రువాండా ఉన్నాయి.





జీవావరణ కేంద్రాలు

జనాభా విస్ఫోటం, పారిశ్రామికీకరణ, నగరీకరణ, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాలవల్ల క్రమంగా అడవుల విస్తీర్ణం తగ్గి పర్యావణ సమతుల్యానికి విఘాతం కలుగుతున్నది. అడవులు తరగిపోతుండటంతో వన్యప్రాణుల జీవనానికి ముప్పు వాటిల్లుతున్నది. అనేక రకాల వృక్ష, జంతు జాతులు అంతరించిపోతున్నాయి. అందుకే భారత ప్రభుత్వం ప్రకృతిసిద్ధమైన జంతు, వృక్ష జాతుల జీవవైవిధ్యాన్ని కాపాడటం కోసం 1986 నుంచి సహజ పర్యావరణ ప్రాంతాలను బయోస్పియర్ రిజర్వులుగా (జీవావరణ పరిరక్షణ కేంద్రాలు) ప్రకటిస్తూ వస్తున్నది. ఇప్పటివరకు దేశంలో మొత్తం 18 జీవావరణ కేంద్రాలను నెలకొల్పింది. వాటిలో కొన్నింటికి సంబంధించిన వివరాలు నిపుణ పాఠకుల కోసం...

నీలగిరి బయోస్పియర్ రిజర్వ్


- దీన్ని 1986, ఆగస్టు 1న జీవావరణ పరిరక్షణ కేంద్రంగా గుర్తించారు.
- ఇది కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ర్టాల్లోని వాయనాడ్, నాగర్‌హోల్, బందీపూర్, మదుమలై, నీలంబర్, సైలెంట్ వ్యాలీ, సిరువాణీ హిల్స్ ప్రాంతాల్లో 5,520 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది.
- ఇక్కడ అంతరించిపోయే దశలో ఉన్న నీలగిరి కొండ మేకలు, సింహం తోక కోతులను సంరక్షిస్తున్నారు.
- **నీలగిరి కొండ మేకలు:** ఇవి ఆకారంలో సాధారణ మేకలవలె ఉండి, వాడియైన వెనుకకు తిరిగిన కొమ్ములతో పరిమాణంలో పెద్దవిగా ఉంటాయి. 80 నుంచి 100 కేజీల వరకు బరువు పెరుగుతాయి.
- **సింహం తోక కోతులు:** ఇవి తలపై ముదురు గోధుమ వర్ణపు జూలు, ఒంటిపై నల్లని వెంట్రుకలు, సింహం తోకను పోలిన తోకను కలిగి ఉంటాయి.

నందాదేవి జాతీయపార్కు & బయోస్పియర్ రిజర్వ్

- దీన్ని 1988, జనవరి 18న జీవావరణ పరిరక్షణ కేంద్రంగా ప్రకటించారు.
- ఇది ఉత్తరాఖండ్‌లోని పితోర్‌గఢ్, అల్మోరా జిల్లాలతోపాటు చమోలీ జిల్లాలోని కొంతభాగంలో విస్తరించి ఉంది. దీని పరిధి 5,860 చదరపు కిలోమీటర్లు.
- ఇక్కడ మంచు చిరుతలు, హిమాలయన్ నలుపు ఎలుగుబంట్లను అంతరించిపోకుండా సంరక్షిస్తున్నారు.
- **మంచు చిరుతలు:** వీటి ఒంటిపై జూలు తెలుపురంగులో ఉన్నప్పటికీ అక్కడక్కడా లేత పసుపు రంగు కనిపిస్తుంది. జూలుపై నల్లని మచ్చలుంటాయి.
- **హిమాలయన్ ఎలుగుబంట్లు:** వీటి దేహంపై దట్టమైన జూలు ఉంటుంది. ఈ జూలు ఒంటి పైభాగంలో నలుపు రంగులో, ఛాతీ భాగం లేత పసుపు లేదా గోధుమ రంగులో ఉంటుంది.

పచ్‌మర్హి బయోస్పియర్ రిజర్వ్

- దీన్ని 1999 మార్చి 3న బయోస్పియర్ రిజర్వ్‌గా గుర్తించారు. ఇది మధ్యప్రదేశ్‌లోని బేతుల్, హోషంగాబాద్, ఛింద్వారా జిల్లాల్లో 4,981 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.
- ఇక్కడి జంతుజాలంలో అంతరించిపోయే దశలో ఉన్న పెద్ద ఉడుతలు, ఎగిరే ఉడుతలను సంరక్షిస్తున్నారు.
- **పెద్ద ఉడుతలు:** ఇవి సాధారణ ఉడుతల కంటే పరిమాణంలో పెద్దగా ఉంటాయి. మూడు నుంచి మూడున్నర అడుగుల పొడవు పెరుగుతాయి. ఇందులో దేహభాగం పొడవు ఒక అడుగు నుంచి అడుగున్నర, తోక పొడవు రెండు అడుగులు. వీటి బరువు సుమారుగా రెండు కేజీలు ఉంటుంది.
- **ఎగిరే ఉడుతలు:** ఇవి పరిమాణంలో చిన్నవిగా ఉంటాయి. ఇవి గబ్బిలాలు, పక్షుల్లా ఎగరలేకపోయినా.. ఒక చెట్టు నుంచి మరో చెట్టుపైకి గరిష్ఠంగా 90 మీటర్ల దూరం వరకు దూకుతాయి. ఎగరడానికి వీలుగా వీటి నాలుగు కాళ్లను కలుపుతూ పొరలాంటి నిర్మాణం ఉంటుంది.



మానస్ బయోస్పియర్ రిజర్వ్

- దీన్ని 1989 మార్చి 14న జీవావరణ పరిరక్షణ కేంద్రంగా ప్రకటించారు.
- ఇది అసోంలోని కాక్రజార్, బొంగాయ్‌గావ్, బర్పెటా, నల్బరి, కంప్రూప్, దరంగ్ జిల్లాల పరిధిలోని ప్రాంతాల్లో 2,837 చదరపు కిలోమీటర్ల భూభాగంలో విస్తరించి ఉంది.
- ఇక్కడి జంతుజాలంలో రెడ్ పాండా, గోల్డెన్ లాంగూర్‌లను సంరక్షిస్తున్నారు.
- **గోల్డెన్ లాంగూర్‌లు:** వీటిని తెలంగాణలో కొండెంగలు అంటారు. గోల్డెన్ లాంగూర్ ఒంటిపై బంగారు వర్ణపు జూలు ఉండి, ముఖం నల్లగా ఉంటుంది. పొడవైన తోకను కలిగి ఉంటాయి.

గ్రేట్ నికోబార్ బయోస్పియర్ రిజర్వ్

- దీన్ని 1989 జనవరి 6న జీవావరణ కేంద్రంగా గుర్తించారు.
- ఇది అండమాన్ నికోబార్ దక్షిణ ప్రాంత దీవుల్లో 885 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది.
- ఈ బయోస్పియర్ రిజర్వ్‌లో ఉప్పునీటి మొసళ్లను (Salt water Crocodiles) సంరక్షిస్తున్నారు.
- **ఉప్పునీటి మొసళ్లు:** ప్రస్తుతం 14 జాతులకు చెందిన ఉప్పునీటి మొసళ్లు జీవించి ఉన్నాయి. ప్రపంచంలో జీవించి ఉన్న అత్యంత భారీ సరీసృపాలు ఇవే. మగ మొసళ్లు దాదాపు 1000 కేజీల వరకు బరువు పెరుగుతాయి.

సుందర్‌బన్స్ బయోస్పియర్ రిజర్వ్

- 1989 మార్చి 29న బయోస్పియర్ రిజర్వ్‌గా గుర్తించారు.
- ఇది పశ్చిమబెంగాల్‌లోని గంగ, బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థ డెల్టా ప్రాంతాల్లో 9,630 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది.
- ఇక్కడ రాయల్ బెంగాల్ టైగర్‌లను (పెద్ద పులులు) సంరక్షిస్తున్నారు.
- **పెద్ద పులులు:** పెద్దపులిని 1972లో జాతీయ జంతువుగా ప్రకటించారు. వీటి దేహం పై భాగం బంగారం రంగులో ఉండి, దానిపై నల్లని అడ్డుచారలుంటాయి. కడుపు కింద తెలుపు రంగు ఉంటుంది. తెల్ల పులుల దేహం పూర్తిగా తెలుపు రంగులో ఉండి, దానిపై నలుపు అడ్డుచారలుంటాయి.

సిమ్లిపాల్ బయోస్పియర్ రిజర్వ్

- 1994 జూన్ 21న బయోస్పియర్ రిజర్వ్‌గా ప్రకటించారు.
- ఇది ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాలో 4,374 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.
- ఇక్కడ రాయల్ బెంగాల్ టైగర్‌లు, ఆసియా ఏనుగులు, అడవి దున్నలు/బర్రెలను సంరక్షిస్తున్నారు.
- ఆసియా ఏనుగులు: ఆసియా ఏనుగులు ప్రస్తుతం భారత్, శ్రీలంక దేశాలతోపాటు సుమత్రా దీవుల్లో ఉన్నాయి. ఆఫ్రికా ఏనుగులతో పోల్చితే వీటి చెవులు, దేహ పరిమాణం కొంత చిన్నగా ఉంటాయి. ఆడ ఏనుగులు రెండున్నర టన్నుల వరకు, మగ ఏనుగులు ఐదున్నర టన్నుల వరకు బరువు పెరుగుతాయి.
- **అడవి దున్నలు, బర్రెలు:** వీటిని 1986లో అంతరించిపోతున్న జీవుల జాబితాలో చేర్చారు. వీటి దేహం దృఢంగా ఉంటుంది. బర్రెలు సుమారు 1000 కేజీల వరకు, దున్నలు దాదాపు 1500 కేజీల వరకు బరువు పెరుగుతాయి.



దిహంగ్-దిబంగ్ బయోస్పియర్ రిజర్వ్

- దీన్ని 1998, సెప్టెంబర్ 2న జీవావరణ పరిరక్షణ కేంద్రంగా గుర్తించారు.
- అరుణాచల్‌ప్రదేశ్‌లో ఎగువ సియాంగ్, పశ్చిమ సియాంగ్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలతోపాటు దిబంగ్ లోయలో 5,111 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.
- ఇక్కడ మస్క్ డీర్‌లు (కస్తూరి జింకలు), మిష్మిటాకిన్‌లను సంరక్షిస్తున్నారు.
- **కస్తూరి జింకలు:** ఇవి కస్తూరి అనే సుగంధ ద్రవ్యాన్ని ఉత్పత్తి చేస్తాయి. మగ జింకల నాభి భాగంలో ఉన్న అరల లాంటి నిర్మాణాల్లో ఈ సుగంధ ద్రవ్యం ఉత్పత్తి అవుతుంది.

పన్నా బయోస్పియర్ రిజర్వ్

- దీన్ని 2011 ఆగస్టు 25న బయోస్పియర్ రిజర్వ్‌గా ప్రకటించారు.
- ఇది మధ్యప్రదేశ్‌లోని పన్నా, ఛత్తర్‌పూర్ జిల్లాల పరిధిలో 2,998 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది.
- ఈ జీవావరణ కేంద్రంలో పెద్దపులులు, మచ్చల జింకలు, దుప్పిలు, సాంబార్ డీర్‌లు, స్లాత్ బేర్‌లను సంరక్షిస్తున్నారు.
- **దుప్పిలు:** ఇవి కూడా ఒక రకం జింకలు. తలపై పొడవుగా, నిటారుగా రెండు కొమ్ములు ఉంటాయి. వీటి శరీరం పైభాగం ముదురు గోధుమ లేదా ముదురు ఎరుపు లేదా బంగారు వర్ణంలో ఉంటుంది. కడుపు కింద, కాళ్ల లోపలి పక్కల్లో తెలుపు రంగు ఉంటుంది. ఈ రెండు రంగులు కలిసే చోట దేహానికి, తలకు ఇరువైపులా నల్లని చారలు ఉంటాయి.
- **సాంబార్ డీర్‌లు:** సాంబార్ డీర్‌లు కూడా జింక జాతుల్లో ఒక రకం. వీటి దేహం ముదురు గోధుమ లేదా బూడిద వర్ణంలో ఉంటుంది. పరిమాణంలో ఇవి ఇతర జింకల కంటే భారీగా ఉంటాయి. 300 నుంచి 350 కేజీల బరువు పెరుగుతాయి. వీటి చెవులు డొప్పల్లా ఉండి, ఆడ జింకలు కొమ్ములు లేకుండా, మగ జింకలు శాఖలు కలిగిన దృఢమైన కొమ్ములతో ఉంటాయి.
- **స్లాత్ బేర్‌లు:** వీటి దేహమంతటా నల్లని దట్టమైన జూలు ఉంటుంది. అడవిలో దొరికే చిన్నచిన్న జీవులను వేటాడి ఆహారంగా తీసుకుంటాయి. అప్పుడప్పుడు ఇవి చెట్ల కొమ్మలపై వెనుక కాళ్ల సాయంతో తలక్రిందులుగా వేళాడుతూ కనిపిస్తాయి.

నోక్‌రెక్ బయోస్పియర్ రిజర్వ్

- 1988 సెప్టెంబర్ 1న బయోస్పియర్ రిజర్వ్‌గా ప్రకటించారు.
- ఇది మేఘాలయాలో తూర్పు, పడమర, దక్షిణ ప్రాంతాల్లోని గారో హిల్స్ జిల్లాల్లో 820 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.
- ఇక్కడి జంతుజాలంలో అంతరించిపోయే దశలో ఉన్న రెడ్ పాండాను సంరక్షిస్తున్నారు.
- **రెడ్ పాండాలు:** ఇవి పరిమాణంలో పిల్లి కంటే కొంచెం పెద్దవిగా ఉండి శరీరంపైన ఎరుపు రంగు జూలు.. కడుపు కింద, కాళ్లకు నలుపు రంగు జూలు కలిగి ఉంటాయి. పిల్లి తోకను పోలిన తోక ఉండి, తల ఎలుగుబంటి తలలా కనిపిస్తుంది.



- **మిష్మిటాకిన్‌లు:** ఇవి కూడా ఒక రకమైన జింక జాతి జంతువులు. ఇవి చూడటానికి కొండ గొర్రెల్లా కనిపిస్తూ, పరిమాణంలో పెద్దవిగా ఉంటాయి.

గల్ఫ్ ఆఫ్ మన్నార్ బయోస్పియర్ రిజర్వ్

- దీన్ని 1989 ఫిబ్రవరి 18న జీవావరణ కేంద్రంగా ప్రకటించారు. ఇది భారత్, శ్రీలంక మధ్య సముద్ర ప్రాంతంలో కన్యాకుమారికి ఉత్తరంగా, రామేశ్వరం సమీపాన, 10,500 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.
- ఈ జీవావరణ కేంద్రంలో సముద్రపు ఆవులను (Sea Cows) సంరక్షిస్తున్నారు.
- **సముద్రపు ఆవులు:** ఇవి జలచర క్షీరదాలు. ఆవు తలను పోలిన తల కలిగి ఉండి, దేహమంతా నున్నగా చేపలా ఉంటుంది. ఇవి సముద్రంలో చిన్నచిన్న సమూహాలుగా సంచరిస్తుంటాయి. ప్రస్తుతం వీటిలో మూడు జాతులు మాత్రమే జీవించి ఉన్నాయి.

దిబ్రూ-సైఖోవా బయోస్పియర్ రిజర్వ్

- 1997 జూలై 28న బయోస్పియర్ రిజర్వ్‌గా గుర్తించారు.
- ఇది అసోంలోని దిబ్రూగఢ్, టిన్‌సుకియా జిల్లాల్లో 765 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.
- బయోస్పియర్‌లో గోల్డెన్ లాంగూర్‌లను సంరక్షస్తున్నారు.

అగస్త్యమలై బయోస్పియర్ రిజర్వ్

- 2001 నవంబర్ 12న జీవావరణ కేంద్రంగా గుర్తించారు.
- ఇది తమిళనాడులోని తిరునల్వేలి, కన్యాకుమారి జిల్లాలు, కేరళలోని తిరువనంతపురం, కొల్లామ్, పతనంతిట్ట జిల్లాల పరిధిలో 3,500 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది.
- ఈ జీవావరణ కేంద్రంలో నీలగిరి కొండ మేకలు, ఆసియా ఏనుగులను సంరక్షిస్తున్నారు.



అచానక్‌మర్ & అమర్‌కంటక్ బయోస్పియర్ రిజర్వ్

- దీన్ని 2005 మార్చి 30న జీవావరణ పరిరక్షణ కేంద్రంగా ప్రకటించారు.
- ఇది మధ్యప్రదేశ్‌లోని అనుపూర్, దిన్డోరి జిల్లాలతోపాటు ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో 3,835 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది.
- ఇక్కడ అంతరించిపోతున్న అడవి దున్నలు/బర్రెలు, చిరుత పులులు, మచ్చల జింకలను సంరక్షిస్తున్నారు.
- **చిరుత పులులు:** వీటి దేహం బంగారు, తెలుపు వర్ణంలో ఉండి, ఒళ్లంతా నల్లని మచ్చలుంటాయి. వేగంగా పరుగెత్తడం వీటి ప్రత్యేక లక్షణం. ఇవి గంటకు 60 కిలోమీటర్ల వేగంతో పరుగెత్తగలవు. మగ చిరుతలు 32 కేజీల వరకు, ఆడ చిరుతలు 27 కేజీల వరకు బరువు పెరుగుతాయి.
- **మచ్చల జింకలు:** వీటి దేహం బంగారు వర్ణంలో ఉండి, దానిపై తెల్లని మచ్చలు ఉంటాయి. తలపై శాఖలుగా చీలిన పొడవైన కొమ్ములు ఉంటాయి. అందుకే వీటిని కొమ్ముల జింకలు అని కూడా అంటారు.

... తోట నాగరాజు

పరిశోధన సంస్థలు

12వ తేదీ తరువాయి..

రెయిన్ ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

- ఇది అసోంలోని జోర్హాట్‌లో ఉంది.
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దీనిని 1988లో స్థాపించారు.

ఎస్‌ఎన్ బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్స్

- ఇది పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఉంది.
- భారత ప్రభుత్వం, సాంకేతిక పరిజ్ఞానం విభాగం కింద గణితశాస్త్రంలో ప్రాథమిక పరిశోధన చేయడానికి దీనిని 1986లో ఏర్పాటు చేశారు.
- చంచల్ కుమార్ మజుందార్.. దీనిని శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్ పేరుపై స్థాపించారు.

అగార్కర్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్

- ఇది మహారాష్ట్రలోని పుణెలో ఉంది.
- దీన్ని మొదట డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో 1946లో స్థాపించారు.
- దీని స్థాపకులు శంకర్ పురుషోత్తమ్ అగార్కర్ పేరుతో అగర్కార్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌గా 1992లో మార్చారు.
- ఇది జంతు, సూక్ష్మ, మొక్కల శాస్త్రాల్లో పరిశోధన కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ

- ఇది తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉంది.
- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రిసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దీనిని 1997లో స్థాపించారు.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్

- ఇది న్యూఢిల్లీలో ఉంది.
- దీన్ని ప్రఖ్యాత ఆర్థికవేత్త వీకేఆర్‌వీ రావు 1958లో స్థాపించారు.
- ఇది ఆర్థిక, సాంఘిక అభివృద్ధిపై పరిశోధన చేస్తుంది.
- దీనికి చైర్మన్‌గా తరుణ్ దాస్, డైరెక్టర్‌గా మనోజ్ పాండా వ్యవహరిస్తున్నారు.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ

- ఇది జార్ఖండ్‌లోని రాంచీ వద్ద ఉన్నది.
- దేశ వ్యవసాయశాఖ, వ్యవసాయ మార్కెటింగ్ అవసరాలను తీర్చడానికి, పరిశోధన చేయడానికి 2013లో దీనిని ఏర్పాటు చేశారు.
- దీనికి డైరెక్టర్‌గా టీఆర్ శర్మ వ్యవహరిస్తున్నారు.

ఓమియో కుమార్ దాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ చేంజ్ అండ్ డెవలప్‌మెంట్

- ఇది అసోంలోని గువాహటిలో ఉంది.
- కేంద్రం, అసోం రాష్ట్రం సంయుక్తంగా మొదట ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ చేంజ్ అండ్ డెవలప్‌మెంట్‌గా 1989లో ఏర్పాటు చేశారు.
- అసోం రాష్ట్ర మొదటి విద్యాశాఖ మంత్రి ఓమియో కుమార్ దాస్ పేరు మీద దీనిని ఓమియో కుమార్ దాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ చేంజ్ అండ్ డెవలప్‌మెంట్‌గా 1995లో మార్చారు.
- అసోం, ఇతర రాష్ర్టాల సామాజిక పరివర్తన, అభివృద్ధి, సమస్యలు, ప్రక్రియలపై అధ్యయనం చేస్తుంది.

వాడియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ జియాలజీ

- ఇది ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఉంది.
- దీనిని హిమాలయాల భూగర్భ శాస్త్ర అధ్యయనం కోసం 1968లో స్థాపించారు.
- దీని స్థాపకుడు దరాష నౌషెర్వాన్ వాడియా.
- దీనికి డైరెక్టర్‌గా మీరా తివారి వ్యవహరిస్తున్నారు.

సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్

- ఇది తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉంది.
- ఎకనామిక్, సోషల్ సైన్సెస్‌లో పరిశోధన కార్యకలాపాల కోసం 1980లో దీనిని స్థాపించారు.
- సీహెచ్ హనుమంతరావు దీని స్థాపకుడు.

సుడోకు

డైలీ సుడోకు 154 సమాధానం

1	9	3	5	2	7	8	6	4
2	4	5	9	6	8	7	1	3
6	7	8	1	4	3	9	2	5
7	3	4	2	8	5	1	9	6
5	6	1	3	7	9	2	4	8
8	2	9	6	1	4	3	5	7
9	5	2	8	3	6	4	7	1
3	1	7	4	5	2	6	8	9
4	8	6	7	9	1	5	3	2

డైలీ సుడోకు -155

1			2			3		6
9					7	4	2	
	7							1
					4	5		7
	1			9		6		
2	4	5			8			
	5	8	7	3	2			
	6						3	
			9					4

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
సోమవారం 19 మార్చి 2018



'భరత్ అనే నేను' చిత్రంలో మహేష్‌బాబు

విరించివర్మ దర్శకత్వంలో..!



కళ్యాణ్‌రామ్

విభిన్న కథా చిత్రాలతో కథానాయకుడిగా మంచి గుర్తింపును సొంతం చేసుకున్నారు హీరో కళ్యాణ్‌రామ్. ఆచితూచి సినిమాలు చేసే ఆయన తాజాగా స్పీడు పెంచారు. ప్రస్తుతం నూతన దర్శకుడు ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఎంఎల్‌ఏ' ఈ నెల 23న విడుదలకు సిద్ధమవుతుండగా, జయేంద్ర తెరకెక్కిస్తున్న 'నా నువ్వే' చిత్రీకరణ దశలో వుంది. ఇదిలా వుండగా కళ్యాణ్ రామ్ మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ చిత్రానికి ఉయ్యాల జంపాల, మజ్ను చిత్రాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వం వహించనున్నారు. ఆనంది ఆర్ట్స్ ప్రొడక్షన్స్ పతాకంపై జెమిని కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. 'ఉగాది రోజున కళ్యాణ్‌రామ్, విరించి వర్మలతో నిర్మించనున్న చిత్రాన్ని ప్రకటించడం ఆనందంగా వుంది. చక్కని కుటుంబ విలువల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. ఈ ఏడాది ద్వితీయార్థంలో చిత్రాన్ని ప్రారంభిస్తాం. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో తెలియజేస్తాం' అని నిర్మాత తెలిపారు.

మేలో సెట్స్‌పైకి..



అఖిల్

'హలో' చిత్రంలో చక్కటి అభినయంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు అఖిల్. ఆయన తదుపరి చిత్రం గురించి అనేక వార్తలొస్తున్నాయి. 'తొలిప్రేమ' దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో సినిమా చేయబోతున్నట్లు ఆదివారం ట్విట్టర్ ద్వారా ప్రకటించారు అఖిల్. 'ఈ ఆహ్లాదకరమైన ఆదివారం రోజున నా కొత్త సినిమా విశేషాల్ని తెలియజేయడం ఆనందంగా వుంది. వెంకీ అట్లూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. మే నెలలో చిత్రీకరణ మొదలవుతుంది. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని అఖిల్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



ఆది, మోహన్, నవీన్ ఎర్నేని, చిరంజీవి, రామ్‌చరణ్, సమంత, దేవిశ్రీప్రసాద్, సుకుమార్, చంద్రబోస్

రామ్‌చరణ్ కెరీర్‌లో తలమానికమైన సినిమా!

''రంగస్థలం' సినిమా విషయంలో అగ్రతాంబూలం దర్శకుడు సుకుమార్‌కే ఇవ్వాలి. ఇది స్వచ్ఛమైన గ్రామీణ వాతావరణంలో తీసిన సినిమా. అద్భుతమైన పల్లె వాతావరణాన్ని, అక్కడి మనుషుల మనస్తత్వాన్ని విశ్లేషిస్తూ సుకుమార్ అందంగా తెరకెక్కించాడు' అన్నారు ప్రముఖ కథానాయకుడు చిరంజీవి. రామ్‌చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రంగస్థలం'. సుకుమార్ దర్శకుడు. మైత్రీమూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్నది. సమంత కథానాయిక. ఈ నెల 30న ప్రేక్షకులముందుకు రానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరిగింది. థియేట్రికల్ ట్రైలర్‌ను చిరంజీవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''రంగస్థలం' రామ్‌చరణ్ స్టార్ స్టేటస్‌ను పెంచే సినిమా అవుతుంది. అభినయపరంగా చరణ్‌ను మరో మెట్టు ఎక్కిస్తుంది. ఈ సినిమా ద్వారా రామ్‌చరణ్‌కు సుకుమార్ గొప్ప అవకాశాన్నిచ్చాడు. ఈ సినిమాలో రామ్‌చరణ్ నటన చూసి అద్భుతంగా ఈర్ష్యపడ్డాను. తండ్రిగా గర్వంగా ఫీలయ్యాను. రామ్‌చరణ్ కెరీర్‌లో తలమానికమైన సినిమాను సుకుమార్ అందించాడు. చంద్రబోస్ తెలంగాణ బిడ్డ అయి వుండి గోదావరి జిల్లాల పల్లె పదాల్ని పాటల్లో అద్భుతంగా రాశాడు. ఆయన పెన్నుకి వెన్ను వంచి నమస్కరిస్తున్నాను. ఈ సినిమా చూసి నా సతీమణి సురేఖ కన్నీళ్లు పెట్టుకుంది. అంతటి భావోద్వేగాలు మేళవించిన చిత్రమిది' అన్నారు. సమంత మాట్లాడుతూ 'దర్శకుడు సుకుమార్ సినిమాలోని నా పాత్ర రామలక్ష్మి గురించి చెబుతున్నప్పుడు ఆయన కళ్లలో ఆ క్యారెక్టర్ మీద వున్న ప్రేమ చూశాను. చిరంజీవిగారికి 'స్వయంకృషి'లా చరణ్‌కు 'రంగస్థలం' పేరు తెస్తుంది. చిట్టిబాబు పాత్ర తరాలుగా గుర్తుండిపోతుంది' అని చెప్పింది. సినిమా చూసిన ప్రేక్షకులు ఎనభైదశకంలోకి వెళ్లిపోతారని ఆది తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఈ సినిమాలో రామ్‌చరణ్ విశ్వరూపం చూస్తారు. చిరంజీవిగారికి 'ఖైదీ' ఎలాగో, రామ్‌చరణ్‌కు 'రంగస్థలం' ఆ స్థాయి సినిమా అవుతుంది' అన్నారు. సుకుమార్ మాట్లాడుతూ 'నిజజీవితంలో రామ్‌చరణ్‌లోని ప్రతి భావోద్వేగం చాలా స్వచ్ఛంగా వుంటుంది. సినిమాలోని చిట్టిబాబు పాత్రలో కూడా ఆయన వ్యక్తిత్వం ప్రతిబింబించింది. ఈ పాత్రలో చరణ్‌ని తప్ప ఎవరినీ ఊహించలేను. సమంత ఒప్పుకుంటే జీవితాంతం ఆమెను డైరెక్ట్ చేస్తూనే వుంటాను. రామలక్ష్మి పాత్రలో సమంత పరకాయ ప్రవేశం చేసింది. కేవలం మూడున్నర రోజుల్లో దేవిశ్రీప్రసాద్ ఈ సినిమాకు సంగీతాన్నందించారు' అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'ఈ సినిమా వల్ల నాకు ఎప్పుడో చిన్నప్పుడు చూసిన పల్లెటూరు తిరిగి పరిచయమైంది. ఇన్నిరోజులు ఎందుకు సిటీలో వున్నామా అనిపించింది. పల్లెటూరి మనుషులు స్వచ్ఛంగా వుంటారు. 'రంగస్థలం' కేవలం సినిమా కాదు. ఇదొక గొప్ప అనుభవం. ఈ సినిమా వల్ల నామీద నాకే గౌరవం పెరిగింది. దర్శకుడు సుకుమార్ నన్ను నాకు కొత్తగా పరిచయం చేశాడు. మా అమ్మానాన్నలు, అభిమానులు గర్వపడే సినిమా అవుతుంది' అన్నారు. ఈ సినిమాతో గీత రచయితగా తన ప్రయాణం మరింత ఫలవంతమైందని చంద్రబోస్ చెప్పారు. దేవిశ్రీప్రసాద్ మాట్లాడుతూ 'ఈ సినిమాతో గ్రామీణ నేపథ్య సినిమా చేయాలన్న నా కోరిక తీరింది. ఒరిజినల్ జానపద కళాకారులతో పాటల్ని పాడించాం. గీత రచయిత చంద్రబోస్‌ను అభినందించడానికి మాటలు చాలడం లేదు' అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్, నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్, మోహన్, పూజా హెగ్డే తదితరులు పాల్గొన్నారు.

సుమంత్ 'సుబ్రహ్మణ్యపురం' ప్రారంభం



సుమంత్, ఈషాలపై క్లాప్‌నిస్తున్న నాగచైతన్య

సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న 25వ చిత్రం 'సుబ్రహ్మణ్యపురం' ఆదివారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. టారస్ సినీ కార్ప్ పతాకంపై ధీరజ్ బొగ్గరం, బీరం సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈషా కథానాయిక. పూజా కార్యక్రమాల అనంతరం హీరోహీరోయిన్లు సుమంత్, ఈషాపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు నాగచైతన్య క్లాప్‌నివ్వగా, దర్శకుడు ప్రశాంత్‌వర్మ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. తొలి సన్నివేశానికి చందూ మొండేటి గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర లోగోను ఏపీ ఎంపీ జె.సి. దివాకర్‌రెడ్డి, రాజశేఖర్, జీవిత సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ 'సూపర్ నేచురల్ అంశాల మేళవింపుతో సాగే మిస్టరీ థ్రిల్లర్ ఇది. ఈ జోనర్‌లో నేను సినిమా చేయడం ఇదే తొలిసారి. నాకు ఈ తరహా కథాంశాలతో సినిమాలు చేయడమంటే చాలా భయం. కానీ కథ నచ్చి ఈ సినిమాను అంగీకరించాను. కథ వింటున్నప్పుడు తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠతతో ఎదురుచూశాను. ఆ అనుభూతి ప్రేక్షకులకు కలిగిస్తుంది' అని తెలిపారు. సుమంత్‌కు తాను అభిమానిని, విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ ఆయన సినిమాలు చేస్తుంటారని, సుమంత్‌తో సినిమా చేయడం ఆనందంగా ఉందని చిత్ర కథానాయిక ఈషా చెప్పింది. ధీరజ్ బొగ్గరం మాట్లాడుతూ 'సుమంత్ నటిస్తున్న 25వ సినిమా ఇది. మాగ్నస్ సినిప్రైమ్ సహకారంతో మా సంస్థ ద్వారా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. సుధాకర్‌రెడ్డి చక్కటి తోడ్పాటును అందిస్తున్నారు. తప్పకుండా ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముంది' అని తెలిపారు. దర్శకుడు సంతోష్‌జాగర్లపూడి మాట్లాడుతూ 'దర్శకుడిగా నా తొలి సినిమా ఇది. ఇంతకుముందు మూడు లఘు చిత్రాలను రూపొందించాను. వాటికి సామాజిక మాధ్యమాల్లో ఇరవై ఆరు లక్షలవరకు వీక్షణలు లభించాయి. వాటికి వచ్చిన గుర్తింపును చూసి నిర్మాతలు ఈ సినిమాను రూపొందించే అవకాశమిచ్చారు. తొలుత సుమంత్‌కు సింపుల్‌గా కథను చెప్పాలని అనుకున్నాను. సినిమాలోని ప్రతి పాయింట్‌ను క్లియర్‌గా చెప్పాలని ఆయన సూచించారు. దాదాపు రెండున్నర గంటల పాటు కథ చెప్పగానే సినిమా చేస్తానని అంగీకరించారు. ఏప్రిల్ మూడవ వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని తెలిపారు. 'మిస్టరీ థ్రిల్లర్ నా ఫేవరెట్ జోనర్. ఈ తరహా కథాంశాల్లో సంగీతానికి ఎక్కువగా ప్రాధాన్యముంటుంది' అని శేఖర్‌చంద్ర పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీరం సుధాకర్ రెడ్డి, లక్ష్మీసింధూజ, సుమత్రిపురాన తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆర్.కె. ప్రతాప్, సంగీతం: శేఖర్‌చంద్ర, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, కళాదర్శకత్వం: లక్ష్మీసింధూజ గ్రంధి, పబ్లిసిటీ డిజైనర్: గణేష్ పి.ఎస్.ఆర్, కో డైరెక్టర్: రాధకృష్ణ, కాశీనాథ్, క్యాస్ట్యూమ్ డిజైనర్: సుమ త్రిపురాన, , నిర్మాతలు: ధీరజ్ బొగ్గరం, బీరం సుధాకర్‌రెడ్డి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సంతోష్ జాగర్లపూడి.

వినోదం '@నర్తనశాల'



నాగశౌర్యపై క్లాప్‌నిస్తున్న వంశీపైడిపల్లి

స్వీయ నిర్మాత సంస్థ ఐరా క్రియేషన్స్ తెరకెక్కించిన 'ఛలో' చిత్రంతో చక్కటి విజయాన్ని అందుకున్నారు నాగశౌర్య. ఇదే సంస్థలో ఆయన కథానాయకుడిగా నటిస్తున్న రెండో చిత్రం '@నర్తనశాల' ఉగాదిని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శ్రీనివాస్ చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఉషా ముల్పూరి నిర్మాత. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వంశీపైడిపల్లి క్లాప్‌నిచ్చారు. నాగశౌర్య మాట్లాడుతూ ' టైటిల్‌ను చూసి ఇది నృత్య నేపథ్య చిత్రమని, అలనాటి 'నర్తనశాల'కు రీమేక్ అని చాలా మంది అనుకుంటున్నారు. అవన్నీ నిజం కావు. ఆద్యంతం హాస్యప్రధానంగా సాగే చిత్రమిది. ఈ సినిమాకు కథానాయిక ఇంకా ఖరారు కాలేదు. రెండో సినిమాలో కూడా నన్నే హీరోగా తీసుకున్నందుకు చిత్ర నిర్మాత అయిన మా అమ్మకు కృతజ్ఞతలు' అన్నారు. 'ప్రేమ, వినోదం అంశాలు కలబోసిన కథాంశమిది. ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. నాగశౌర్య కెరీర్‌లో మరో మంచి చిత్రమవుతుంది' అని దర్శకుడు చెప్పారు.

నారా రోహిత్ 'శబ్దం'



పుల్లారావు, నారా రోహిత్, మంజునాథ్, నారాయణరావు తదితరులు

నారా రోహిత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'శబ్దం' ఏపీ రాజధాని అమరావతిలో ఆదివారం ప్రారంభమైంది. పి.బి.మంజునాథ్ దర్శకుడు. శ్రీవైష్ణవి క్రియేషన్స్ పతాకంపై నారాయణరావు అట్లూరి నిర్మిస్తున్నారు. 'హిజ్ సైలెన్స్ ఈజ్ హిజ్ వెపన్' ఉపశీర్షిక. ముహూర్తపు సన్నివేశానికి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు క్లాప్‌నివ్వగా, ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. నారా రోహిత్ మాట్లాడుతూ 'కథానుగుణంగానే ఈ టైటిల్ పెట్టాం. నా పాత్ర చిత్రణ కొత్త పంథాలో వుంటుంది. వాణిజ్య అంశాలు మేళవించిన వినూత్న కథా చిత్రమిది' అన్నారు. 'సినిమాకు మంచి కథ కుదిరింది. ఏప్రిల్ చివరివారంలో విశాఖపట్నం, కాకినాడ, హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం' అని దర్శకుడు చెప్పారు. నారా రోహిత్‌ను సరికొత్త పంథాలో ఆవిష్కరించే చిత్రమిదని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కథ, మాటలు: వంశీ రాజేష్, సంగీతం: వికాస్ కురిమెళ్ల, సినిమాటోగ్రఫీ: రిచర్డ్‌ప్రసాద్, సమర్పణ: డా॥సౌజన్య అట్లూరి, దర్శకత్వం: పి.బి.మంజునాథ్.

హృదయాల్ని గెలిచేలా...



కీర్తి సురేష్

అలనాటి మేటినటి సావిత్రి జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'మహానటి'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. వైజయంతీమూవీస్, స్వప్న సినిమా పతాకాలపై ప్రియాంకదత్ నిర్మిస్తున్నారు. కీర్తి సురేష్, సమంత కీలక పాత్రలను పోషిస్తున్నారు. మే 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానున్నది. 'సావిత్రి జీవితంలోని ముఖ్య ఘట్టాలను ఆవిష్కరిస్తూ రూపొందుతున్న చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. 1990 మే 9న వైజయంతీ సంస్థలో రూపొందిన 'జగదేకవీరుడు అతిలోక సుందరి' విడుదలైంది. అదే తేదీన ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉన్నది' అని తెలిపారు.

సప్త ఖండాల్లోనూ టీఆర్ఎస్ శాఖలు

- టీఆర్ఎస్ ఎన్నారై సమన్వయకర్త మహేశ్ బిగాల
- పెరూ దేశంలో టీఆర్ఎస్ ఎన్నారైశాఖ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర సమితి ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే డజన్ వరకు దేశాల్లో పార్టీ ఎన్నారై కమిటీలు ఏర్పాటు చేయగా తాజాగా దక్షిణ అమెరికా ఖండంలోని పెరూ దేశంలో టీఆర్ఎస్ ఎన్నారై శాఖను ఏర్పాటుచేశారు. అమెరికా పర్యటనలో ఉన్న టీఆర్ఎస్ ఎన్నారై సమన్వయకర్త మహేశ్ బిగాల ఈ కమిటీని ఏర్పాటుచేశారు. ప్రపంచంలోని అన్ని ఖండాలలో టీఆర్ఎస్ శాఖలు ఏర్పాటు అయ్యాయని మహేశ్ బిగాల తెలిపారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నదని మహేశ్ బిగాల అన్నారు. పెరూలో ఏర్పాటుచేసిన పార్టీ ఎన్నారైశాఖ అక్కడ నివసిస్తున్న తెలంగాణ ప్రాంతం వారికి.. టీఆర్ఎస్ ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఇతరదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రాంతం వారికి ఎలాంటి కష్టం వచ్చినా పార్టీ వారికి అండగా ఉంటుందని చెప్పారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఉన్న తెలంగాణ బిడ్డలు టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీఆర్ఎస్‌తో ముందుకు నడవాలనుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ఎన్నారైల సంక్షేమంకోసం తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు.గతంలో ఎన్నడూలేని విధంగా నిధులు కేటాయించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పెరూ తాత్కాలిక కమిటీని ఆయన ప్రకటించారు. కమిటీలో బద్దం పాండురంగారెడ్డి, ఉమా, సందీప్, జనభట్ల శ్రీనివాస్‌రావు, మాధవి, రాంరెడ్డి, అజయ్‌కుమార్‌లతో ఏర్పాటు చేశారు. పూర్తి కమిటీని అతిత్వరలో ప్రకటిస్తామని మహేశ్ పేర్కొన్నారు. ఎన్నారై టీఆర్ఎస్ పెరూశాఖ ఏర్పాటుచేయడానికి క్రియాశీలకంగా పనిచేసిన చాడ సృజన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మీరు అల్లా అతిథులు

- ఫెడరల్ ఫ్రంట్ కోసం కేసీఆర్ కృషి ఫలించాలని హజ్‌లో ప్రార్థించండి
- తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ మసీఉల్లాఖాన్





శంషీర్‌గంజ్ క్రిస్టెల్ గార్డెన్‌లో యాత్రికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అల్లా అతిథులుగా సౌదీ అరేబియాలోని మక్కా, మదీనా నగరాల్లో జరిగే హజ్‌యాత్రకు వెళ్లినప్పుడు ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేస్తున్న కృషిఫలించాలని ప్రార్థనలు చేయాలని తెలంగాణ నుంచి వెళ్లే హజ్‌యాత్రికులకు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీఉల్లాఖాన్ కోరారు. రాష్ట్ర అభివృద్ధి, కేసీఆర్ ఆరోగ్యం కోసం కూడా ప్రార్థనలు చేయాలని విజ్ఞప్తిచేశారు. హజ్ విధి, విధానాలతో త్వరలో మూడు భాషల్లో తెలంగాణ హజ్ కమిటీ తరఫున అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. యాత్రికులు ఇప్పటినుంచే రెండు కిలోమీటర్లు నడిచేలా అలవాటు చేసుకోవాలని సూచించారు. శంషీర్‌గంజ్ క్రిస్టెల్ గార్డెన్‌లో ఆదివారం హజ్ తెలంగాణ హజ్ కమిటీ ఆధ్వర్యంలో యాత్రికుల కోసం నిర్వహించిన నాలుగో శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు.

త్వరలో మూడు భాషల్లో వెబ్‌సైట్

ముఖ్యమంత్రి కేసీఆర్ అనుమతితో తెలుగు, ఉర్దూ, ఇంగ్లిష్‌లో వెబ్‌సైట్‌ను ప్రారంభించాలని నిర్ణయించినట్టు మసీఉల్లాఖాన్ చెప్పారు. హజ్ ప్రయాణం, హజ్ యాత్రచేసే విధానం పూర్తి సమాచారాన్ని పొందుపర్చి యానిమేషన్‌తో వెబ్‌సైట్‌ను రూపొందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా హజ్ కమిటీ వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. హజ్ యాత్రలో ఆచరించాల్సిన విధానాలు, పాటించాల్సిన నియమాలను ముస్లిం మత ప్రముఖులు యాత్రికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ పాలక మండలి సభ్యులు ఆరీఫ్, అబుల్ కలామ్ అబూబకర్, తెలంగాణ హజ్ కమిటీ కార్యనిర్వాహణ అధికారి ప్రొఫెసర్ ఎస్ఏ షుకూర్, సౌత్ జోన్ అదనపు పోలీసు కమిషనర్ మహ్మద్ గౌస్‌మోహియుద్దీన్, ఏసీపీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి

చెప్పు, డప్పు వృత్తుల వారికి పింఛన్ ఇవ్వాలి

- ఈ అసెంబ్లీ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలి: వంగపల్లి
- 21, 23 తేదీల్లో ధర్నాలు, దీక్షలు

ముషీరాబాద్: రాష్ట్రంలోని సబ్బండ కులాలను ఆదరించి వారి కులవృత్తుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పు, డప్పు వృత్తిదారులకు కూడా పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ కోరారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో దీనిపై నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల సీఎం కేసీఆర్ అన్ని కులాలకు ఇస్తున్నట్టుగా మాదిగలకు పెన్షన్ ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారని చెప్పారు. చెప్పు, డప్పు వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలనే ప్రధాన డిమాండ్‌తో ఈ నెల 21న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 23న కలెక్టర్ కార్యాలయాల ఎదుట దీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చినట్టు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు శ్యామ్‌రావు, ఎంఎస్ఎఫ్ నాయకులు కొంగరి శంకర్, రాజేశ్, రమేశ్, చింత వెంకన్న పాల్గొన్నారు.

మానవీయ కోణంలో తెలంగాణ బడ్జెట్

- రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం సమస్తవర్గాల అభివృద్ధి, సంక్షేమం దిశగా మానవీయ కోణంలో తెలంగాణ బడ్జెట్ ఆవిష్కృతమైందని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ప్రశంసించారు. ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించి, ప్రతిముఖంలో సంతోషం నింపారని చెప్పారు. శనివారం అంబర్‌పేట్‌లోని తెలంగాణ బీసీ జాగృతి రాష్ట్ర కార్యాలయంలో బీసీ కుల సంఘాల రాష్ట్ర ప్రతినిధుల సమావేశంలో కృష్ణమోహన్‌రావు రాష్ట్ర బడ్జెట్‌పై సమగ్రమైన విశ్లేషణ, దిశానిర్దేశం చేశారు. సామాజిక విలువల ఆధారంగా నిధులు కేటాయించి, ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం నిజం చేసిందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌ను సజీవ ఆర్థిక ప్రణాళికగా ప్రభుత్వం రూపొందించిందని, దేశంలో ఎక్కడాలేనివిధంగా రూ.కోట్లు వెచ్చిస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న నంబర్‌వన్ సంక్షేమ రాష్ట్రం మనదేనని చెప్పారు. తెలంగాణ మొదటి బడ్జెట్‌లో కేటాయించిన దానికంటే ప్రస్తుత బడ్జెట్‌లో నాలుగింతలు కేటాయించి సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నదని వకుళాభరణం పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ జాగృతి అధ్యక్షుడు కే మురళీకృష్ణ, తెలంగాణ రజక సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు భిక్షపతి, బీసీ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ బీ లింగంగౌడ్, ఉపాధ్యక్షులు రమేశ్, లవంగం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి కత్తుల సుదర్శన్‌రావు, కార్యదర్శులు వేణుగోపాల్, పాతకోట మహేశ్, మహిళా నాయకులు రమ్య, మణిమంజరి, వివిధ బీసీ కులసంఘాల నాయకులు తదితరులు ప్రసంగించారు.

తౌఫిక్ మూలాలపై రాష్ట్ర పోలీసుల ఆరా

- 11న కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి
- నేరచరిత్రను పరిశీలిస్తున్న అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఐఎస్ఐఎస్ సానుభూతిపరుడిగా పనిచేస్తూ ఇటీవల జమ్ముకశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మహ్మద్ తౌఫిక్ (26) మూలాలపై రాష్ట్ర నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. తౌఫిక్ స్వస్థలం కొత్తగూడెం జిల్లా మణుగూరు గ్రామం. రాష్ట్రంలో అతడి నేరచరిత్రను అధికారులు పరిశీలిస్తున్నారు. రాష్ట్ర పోలీసు రికార్డుల్లో అతడిపై పలు కేసులు ఉన్నట్టు తెలిసింది. అయితే వాటిల్లో కొన్నికేసుల్లో ఆధారాలు లేకపోవడంతో కోర్టుల్లో వీగిపోయినట్టు సమాచారం. డిప్లొమా వరకు చదివిన తౌఫిక్ 2007 నుంచి నేరాలబాట పట్టాడు. 2012 ఉగ్రవాద కార్యకలాపాలపై దృష్టిసారించాడని, కొందరు మిత్రులతో కలిసి కశ్మీర్ వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. అక్కడి పర్యాటకులు, ట్యాక్సీ డ్రైవర్ల సహాయంతో కశ్మీర్‌లో ఉంటున్న ఉగ్రవాదుల సమాచారం సేకరించాడని, ఆ తర్వాత ఇక్కడికొచ్చి సామాజిక మాధ్యమం ద్వారా దేశద్రోహులతో స్నేహం చేశాడని, తిరిగి కశ్మీర్ వెళ్లి అక్కడ ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొన్నాడని పోలీసులు చెప్తున్నారు. తౌఫిక్‌ను ఉగ్రవాదం వైపు ఎవరు మళ్లించారు? అతను కశ్మీర్‌కు ఎలా వెళ్లాడు! అక్కడ అతనికి సహకరించిందెవరు? సోషల్ మీడియా ద్వారా ఎవరెవరితో సంబంధాలు కొనసాగించాడనే అనే అంశాలపై నిఘావర్గాలు ఆరా తీస్తున్నాయి. కొత్తగూడెం పోలీసులు కూడా స్థానికంగా తౌఫిక్‌పై ఏవైనా కేసులు ఉన్నాయా అని పరిశీలిస్తున్నారు. ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి కశ్మీర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు మృతిచెందగా, వారిలో ఇద్దరిది కశ్మీర్ కాగా, మూడో వ్యక్తిని మహ్మద్ తౌఫిక్‌గా గుర్తించారు.

బతుకమ్మ చీరెల తయారీ రాష్ట్రంలోనే

ఈ ఏడాది సిరిసిల్ల మరమగ్గాలపైనే తయారుచేయించాలని నిర్ణయం

20 వేలమందికి ఆరునెలలపాటు ఉపాధి అవకాశం ● చేనేత, జౌళిశాఖకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం

ఏప్రిల్ మొదటివారం నుంచి ఉత్పత్తి.. సెప్టెంబరు చివరికల్లా జిల్లాలకు చేరవేత

మరింత ఆకట్టుకొనేలా డిజైన్ల రూపకల్పన ● మహిళా ఎమ్మెల్యేల సూచనలతో తుదిరూపు

ఈ సంవత్సరం చీరెకు జరీ.. రిచ్‌లుక్ వచ్చేలా ఏర్పాట్లు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా సంబురంగా జరుపుకొనే బతుకమ్మ పండుగ కోసం ఆడబిడ్డలకు కానుకగా ఇచ్చే చీరెలపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. తీరొక్క పూలతో నిర్వహించుకొనే ఉత్సవాల సందర్భంగా చూడచక్కనైన డిజైన్లతో కూడిన చీరెలను ఈ ఏడాది రాష్ట్రంలోనే తయారుచేయించాలని నిర్ణయించింది. 18 ఏండ్లు నిండిన ప్రతి ఆడపడుచుకు చీరెలను అందించేందుకు సిద్ధమవుతున్నది. సిరిసిల్లలోని 25 వేల మరమగ్గాల ద్వారా వీటిని తయారు చేయించనుంది. దీనిద్వారా దాదాపు ఆరునెలలపాటు 20 వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనుంది. ఈ మేరకు చీరెల తయారీ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం చేనేత, జౌళిశాఖకు అప్పగించింది. గత ఏడాది మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రాష్ట్రంలోని తెల్లకార్డు ఉన్న మహిళలందరికీ చీరెలను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. దాదాపు కోటి చీరెల వరకు తయారుచేయించాలని లక్ష్యంగా నిర్ణయించి, ప్రణాళికను సిద్ధంచేశారు. సిరిసిల్లలోని మరమగ్గాల ద్వారా చీరెలను తయారుచేయించేందుకు పవర్‌లూం ఆసాములు, కార్మికులతో ఏర్పాట్లు చేయిస్తున్నారు. చీరెల తయారీలో కీలకమైన నూలు (యార్న్) ఉపయోగానికి సంబంధించి మార్గదర్శకాలు కూడా జారీచేశారు. ఏప్రిల్ మొదటివారం నుంచి చీరెల ఉత్పత్తిని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. అక్టోబర్ రెండోవారంలో బతుకమ్మ పండుగను నిర్వహించనున్నందున, సెప్టెంబర్ చివరివారం కల్లా ప్రతిజిల్లాకు చీరెలు చేరవేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఆరునెలల సమయం ఉండటంతో కోటి చీరెలను తయారుచేయడం సులువేనని చేనేత, జౌళిశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఆకర్షణీయంగా చీరెలు

బతుకమ్మ కానుక చీరెలను ఈ ఏడాది మరింత ఆకర్షణీయంగా తయారుచేయించనున్నారు. శాంపిళ్లుగా పలు డిజైన్లలో చీరెలను తయారుచేయించి.. వాటిని మహిళా ఎమ్మెల్యేలకు చూపించనున్నారు. వారి సూచనలు, సలహాలకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసి తుది డిజైన్లను ఖరారుచేస్తారు. ఈ సంవత్సరం చీరెకు 'జరీ' వచ్చేలా తయారుచేయనున్నారు. రెండువైపులా గోల్డ్ (బంగారు) కలర్ బోర్డర్లు ఉండేలా అధికారులు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు. చీరె కట్టుకోగానే ఖరీదైన లుక్ వచ్చేలా డిజైన్లను రూపొందిస్తున్నారు. తయారీకి సంబంధించిన నాణ్యత, సాంకేతికపరమైన వివరాలు ముందుగానే వెల్లడించాలని చేనేత, జౌళిశాఖ అధికారులు భావిస్తున్నారు. దీనిద్వారా ప్రజలకు స్పష్టత రావడంతోపాటు పారదర్శకతకు పెద్దపీట వేసినట్టు అవుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. చీరెల ప్రాసెసింగ్, జిల్లాలకు చేర్చే బాధ్యతను గత సంవత్సరం మాదిరిగానే టెస్కోకు అప్పగించారు. ఈ ఏడాది అర్హులైన వారిసంఖ్య పెరిగే అవకాశముంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కార్చిచ్చుపై అటవీశాఖ యుద్ధం

- ప్రమాదాల నివారణకు 2,600 మందితో రక్షణ బృందం
- ముగ్గురు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ
- శాటిలైట్ నిఘాతో అనుక్షణం అప్రమత్తం
- సున్నితప్రాంతాలుగా 9,784 కంపార్ట్‌మెంట్లు



ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

ఎండాకాలం మొదలైందంటే అడవుల్లో ఆకస్మిక మంటలు రగులుకుంటాయి. రకరకాల కారణాల వల్ల వేల ఎకరాల్లో అడవులు అగ్నికి ఆహుతవుతాయి. తమిళనాడులోని థేని జిల్లా పశ్చిమ కనుమల అడవుల్లో చెలరేగిన కార్చిచ్చు దాదాపు పదిమందిని బలిగొన్న నేపథ్యంలో రాష్ట్ర అటవీశాఖ మరింత అప్రమత్తమైంది. అడవులను దహించే కార్చిచ్చును ఎప్పటికప్పుడు ఆర్పడానికి ముందస్తు ప్రణాళికను సిద్ధంచేసింది. శాటిలైట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ ద్వారా అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని గుర్తించిన వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. 2018 సంవత్సరాన్ని అటవీశాఖ 'జీరో ఫారెస్ట్ ఫైర్ ఇయర్'గా ప్రకటించింది. ఈ దిశలో అవసరమైన చర్యలను తీసుకోవడానికి అటవీశాఖకు చెందిన ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని నియమించింది. అధికారులను అడవులను సున్నిత, అతి సున్నిత, సమస్యాత్మక ప్రాంతాలుగా విభజించారు. రాష్ట్రంలోని అటవీప్రాంతాల్లో 9,784 కంపార్ట్‌మెంట్లను సున్నితమైనవిగా, 431ప్రాంతాలను అత్యంత సమస్యాత్మకంగా, 14 ఏండ్లుగా పదేపదే అగ్నిప్రమాదాలు జరిగే ప్రాంతాలను సున్నితప్రాంతాలుగా గుర్తించారు.

మానవతప్పిదాలు.. అడవులకు శాపాలు

ప్రతి ఎండాకాలంలో ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాల్లో అడవుల్లో అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. తెలంగాణలో 2014 నుంచి అటవీ ప్రాంతాల్లో 12,537 అగ్నిప్రమాదాలు సంభవించాయి. మానవ తప్పిదాల కారణంగా ఎక్కువ ప్రమాదాలు జరుగగా, అడవుల్లో కొమ్మలు రాజుకుని కార్చిచ్చు రేగడం చాలా తరుచూ జరుగుతుంది. అగ్నిప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్తలతోపాటు సంభవించిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై ప్రివెన్షన్, డిటెన్షన్, సప్రెషన్, పోస్ట్ ఫైర్ మేనేజ్‌మెంట్ విధానాలపై రాష్ట్ర అటవీశాఖ అధికారులు, సిబ్బందికి నిర్దిష్టమైన సూచనలు చేశారు. ప్రతి అటవీ డివిజన్‌లో ప్రమాదం సమాచారం రాగానే మంటలనార్పేందుకు ర్యాపిడ్‌యాక్షన్ ఫోర్స్‌ను ఏర్పాటుచేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా రిస్క్ జోన్ మ్యాప్‌లను రూపొందించారు. శాటిలైట్ చిత్రాల ద్వారా సంఘటనా స్థలాన్ని గుర్తించి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ ద్వారా క్షణాల్లో అక్కడికి చేరడానికి అవసరమైన ఏర్పాట్లుచేశారు. అగ్నిప్రమాదాన్ని గుర్తించిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,600 మంది రక్షణ సభ్యులకు ఎస్ఎంఎస్ అలర్ట్ వెళ్తుంది. దగ్గరలో ఉన్న సిబ్బంది జీపీఎస్ ద్వారా ఘటనా స్థలానికి చేరుకుంటారు. రిస్క్‌జోన్‌లలో ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. రాష్ట్రంలో అటవీప్రాంతాలకు 500 మీటర్లలోపు 132 గ్రామాలున్నాయి. కొందరు అడవులను విచ్చలవిడిగా వాడటం వల్ల అగ్నిప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఇండియన్ ఫారెస్ట్‌యాక్ట్ 1927, టీఎస్ ఫారెస్ట్ యాక్ట్ 1967 ప్రకారం అగ్నిప్రమాదాలకు కారణమైన వారికి ఆరునెలల జైలు శిక్షతోపాటు జరిమానా విధించే వీలుంది.



నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న టీఆర్ఎస్ నేత మందా జగన్నాథం

మాజీ ఎంపీ మందా జగన్నాథంకు స్వల్ప గాయం

- ప్రగతిభవన్‌లో పంచాంగ శ్రవణం విని వస్తుండగా ఘటన

ఖైరతాబాద్: నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ, టీఆర్ఎస్ నేత మందా జగన్నాథం ఆదివారం స్వల్పంగా గాయపడ్డారు. ఉగాది సందర్భంగా ఆదివారం ప్రగతిభవన్‌లో పంచాంగ శ్రవణం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తిరిగివస్తూ ప్రగతిభవన్‌లోని మెట్లు దిగుతుండగా కాలుజారి కింద పడిపోయారు. దీంతో ఆయన నుదుటికి గాయమైంది. అక్కడే ఉన్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి మందా జగన్నాథంను నిమ్స్‌కు తరలించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను మంత్రి ఆదేశించారు. నిమ్స్ మెట్టు రంగారెడ్డి బ్లాక్ 12వ రూంలో జగన్నాథం చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నదని వైద్యులు తెలిపారు.

బీజేపీ ఎవరిపై యుద్ధం చేస్తుంది..?

- ఏపీ సీఎం చంద్రబాబు

హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూసి భరించలేకపోయానని, నమ్మితే నట్టేటా ముంచారని ఏపీ సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఆదివారం విజయవాడలో జరిగిన ఉగాది వేడుకల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ యుద్ధం చేస్తుందట? ఎవరిపై యుద్ధం చేస్తుంది? నాలుగేండ్లు సహనం వహించిన తెలుగు ప్రజలపైనా? అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కేంద్రాన్ని కోరాం అయినా స్పందించలేదని, చివరకు మిత్రబంధాన్ని తెంచుకున్నామన్నారు. ఇక ప్రజాపక్షంగానే కేంద్రంపై పోరాటం చేస్తామని చెప్పారు. తమిళనాడు తరహాలో ఇక్కడ రాజకీయాలు చేస్తే సాగనివ్వమని ఆయన హెచ్చరించారు.

టీడీపీపై దూకుడు పెంచిన బీజేపీ

- అమిత్‌షాతో ఏపీ బీజేపీ నేతల భేటీ
- రాంమాధవ్‌కు ఏపీ బీజేపీ వ్యవహారాలు
- కొత్త అధ్యక్షుడి ఎంపికపై సమాలోచనలు

హైదరాబాద్ / అమరావతి, నమస్తే తెలంగాణ: ఎన్డీఏ కూటమి నుంచి వైదొలగడంతోపాటు, కేంద్రంపై అవిశ్వాసతీర్మానం పెట్టాలని టీడీపీ నిర్ణయించిన నేపథ్యంలో ఏపీలో ఆ పార్టీపై దూకుడు పెంచాలని బీజేపీ జాతీయనాయకత్వం నిర్ణయించింది. ఏపీలో నాయకత్వమార్పుతోపాటు, పార్టీ రాష్ట్ర వ్యవహారాలను జాతీయ కార్యదర్శి రాంమాధవ్‌కు అప్పగిస్తూ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా నిర్ణయం తీసుకున్నారు. ఏపీ బీజేపీ నేతలు శనివారం ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో జరిగిన భేటీలో రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై చర్చించారు. ఏపీలో బీజేపీ అనుసరించాల్సిన వ్యూహం, టీడీపీని ఎలాఎదుర్కోవాలి..? కేంద్రంపై విమర్శలు చేస్తున్న ఇతర పార్టీలపై ఎలాంటి వైఖరి అనుసరించాలనే దానిపై చర్చించారు. ఏపీలో చంద్రబాబు సర్కార్ అవినీతి అక్రమాలను ఎండగట్టాలని అమిత్‌షా సూచించారు. ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్న సీఎం చంద్రబాబు ఇప్పుడు మాటమార్చి కేంద్రంపై ఎలా దుష్ప్రచారం చేస్తున్నారో ప్రజలకు సమగ్రంగా వివరించాలని చెప్పారు. ఏపీకి నిధులివ్వడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ సెంటిమెంట్ పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్న తీరును ఎండగడుతూ ఒక రాజకీయ తీర్మానాన్ని కూడా ప్రకటించనున్నారు. ఎన్డీఏపై బుదరజల్లేలా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరుపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఏపీ బీజేపీ నేతలకు అమిత్‌షా చెప్పినట్టు తెలిసింది. కేంద్రంపై అవిశ్వాసం పెట్టడం ద్వారా టీడీపీ తాను తీసుకున్న గొయ్యిలో తానే పడుతుందని చెప్పినట్టు సమాచారం.

బీజేపీ నేతల భేటీలో ప్రశాంత్‌కిశోర్

ఏపీ బీజేపీ నేతలతో అమిత్‌షా జరిపిన భేటీలో వైసీపీ రాజకీయవ్యూహకర్త ప్రశాంత్‌కిశోర్ హాజరుకావడం చర్చనీయాంశంగా మారింది. ప్రశాంత్‌కిశోర్ గతంలో బీజేపీ తరఫున పనిచేసిన వ్యక్తి అయినప్పటికీ ప్రస్తుతం ఏపీలో వైసీపీకి రాజకీయవ్యూహకర్తగా వ్యవహరిస్తున్నారు. ఏపీలో వైసీపీతో బీజేపీ జతకట్టవచ్చనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో అమిత్‌షాతో భేటీలో ప్రశాంత్‌కిశోర్ పాల్గొనడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

అమరావతిలో కుల గొడవలు ఎక్కువ

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

హైదరాబాద్/అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీ రాజధాని అమరావతిలో కుల గొడవలు ఎక్కువగా ఉన్నాయని, విశ్వనగరం నిర్మించాలంటే అందుకు విశాలమైన మనసులు కావాలని, అప్పుడే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. రాజధాని రైతుల సమస్యలపై ఉన్నతస్థాయి విచారణ కమిటీ, జ్యుడీషియల్ విచారణ జరుగాలని కోరారు. ఆదివారం పవన్ రాజధానిలోని ఉద్దండరాయునిపాలెం రైతులను కలిసి ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఒక రాష్ట్ర రాజధాని నిర్మాణం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని, అందుకు రెండు దశాబ్దాలకు పైగానే సమయం పట్టొచ్చని ఆయన మీడియాతో చెప్పారు. అన్ని పార్టీలు ఈ అంశంపై సమావేశమై మాట్లాడాలని, అమరావతి కోసం ప్రభుత్వం చూపిస్తున్న మాస్టర్ ప్లాన్ ఫైనల్ కాదన్నారు.

మిత్ర భేదం!

- యూపీ రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి కొత్త తలనొప్పి

లక్నో, మార్చి 18: ఇటీవలి ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఉపఎన్నికల్లో ఘోర పరాభవం చవిచూసిన కమలం పార్టీకి రాజ్యసభ ఎన్నికల్లో మిత్రపక్షాల నుంచి కొత్త తలనొప్పులు ఎదురయ్యేలా కనిపిస్తున్నాయి. ఈ నెల 23న ఉత్తరప్రదేశ్ నుంచి పది రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతు ఇచ్చేదీ లేనిదీ చెప్పకుండా మిత్రపక్షం సుహల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్బీఎస్పీ) దోబూచులాడుతున్నది. మొత్తం పది సీట్లకు ఎనిమిది స్థానాలను గెలుచుకునే బలం స్వయంగా బీజేపీకి ఉన్నది. తొమ్మిదో అభ్యర్థికి మిత్రపక్షాల అవసరం ఏర్పడుతున్నది. 403 మంది ఎమ్మెల్యేలు కలిగిన యూపీ అసెంబ్లీలో ఎస్బీఎస్పీ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. బీజేపీ తొమ్మిదో అభ్యర్థికి వీరి మద్దతు అవసరం. కాగా ఇటీవల మిత్రపక్షాలుగా మారిన ఎస్పీ, బీఎస్పీలు ఉమ్మడిగా రెండు సీట్లను గెల్చుకుంటామని ధీమా వ్యక్తంచేస్తున్నాయి. 'రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి లేదా వేరే పార్టీకి ఓటు వేస్తామా లేదా అనే విషయాన్ని ఇప్పటికిప్పుడు ఎలా చెప్పగలం? మేం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. బీజేపీ వారి అభ్యర్థులను నిలిపే ముందు మమ్మల్ని సంప్రదించలేదు. ఇప్పటికీ మేం బీజేపీ కూటమిలోనే ఉన్నాం. కానీ వారు మిత్రధర్మాన్ని పాటించలేదు' అని ఎస్బీఎస్పీ అధినేత ఓంప్రకాశ్ రాజ్‌బర్ పేర్కొన్నారు. కాగా యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఎనిమిది మంది అభ్యర్థులను గెలిపించుకున్న తర్వాత కూడా తమకు 28 ఓట్లు అదనంగా ఉండటంతో తొమ్మిదో అభ్యర్థిని నిలిపామని పేర్కొన్నారు. 'మా అభ్యర్థి గెలుపునకు కావాల్సిన ఇంకా తొమ్మిది ఓట్లు ఎలా వస్తాయో మీరే చూస్తారు' అని ఆయన తెలిపారు. బీజేపీ మరో మిత్రపక్షం అప్నాదళ్ మాత్రం తాము బీజేపీకే మద్దతిస్తామని స్పష్టంచేసింది.

ఆయిల్ ఇంజిన్లకు రాంరాం

24 గంటల విద్యుత్‌తో పక్కకు పడేసిన రైతులు ■ 2014కు ముందు మార్కెట్‌లో జోరుగా కొనుగోళ్లు

ప్రస్తుతం కానరాని వైనం ■ భూగర్భజలాలు పెరుగడంతో పూడికతీతకు బ్రేక్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆయిల్ ఇంజిన్లకు తెలంగాణ రైతులు రాంరాం చెప్పారు. ఉమ్మడి పాలనలో కరంట్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఆయిల్ ఇంజిన్లను ఆశ్రయించిన రైతులు ప్రస్తుతం నిరంతరాయంగా విద్యుత్‌సరఫరా జరుగుతుండటంతో వాటిని పక్కకు పడేశారు. 2010 నుంచి 2013 వరకు చైనాకు చెందిన ఆయిల్ ఇంజిన్లు మార్కెట్‌ను శాసించాయి. 2010 నుంచి 2013 వరకు రాష్ట్రంలో మొత్తం రూ. 2,600 కోట్ల వ్యాపారం ఆయిల్ ఇంజిన్ల కొనుగోళ్లలోనే జరిగిందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. ప్రధానంగా వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం ప్రాంతాల్లో రైతుల పంటపొలాల్లో ఆయిల్ ఇంజిన్లు దర్శనమిచ్చాయి. రైతులు రూ. 7 వేల నుంచి రూ. 13 వేల వరకు వెచ్చించి వీటిని కొనుగోలు చేసేవారు. వరంగల్ మార్కెట్‌కు ప్రత్యేక వ్యాగన్ల ద్వారా ఆయిల్‌ఇంజిన్లను రప్పించారంటే వ్యాపారం ఏస్థాయిలో సాగిందో అంచనా వేయవచ్చు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో డీలర్లను నియమించి కంపెనీలు వ్యాపారం సాగించాయి. కానీ 2014లో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దశలవారీగా సక్రమమైన విద్యుత్‌ను సరఫరా చేస్తుండటంతో వీటి కొనుగోళ్లు తగ్గాయి. ప్రస్తుతం అవి రైతుల వద్ద నిరుపయోగంగా పడిఉన్నాయి.

కరంట్ 'కోత'లను తట్టుకోలేక..

ఉమ్మడి పాలనలో... ప్రధానంగా 2009 నుంచి రాష్ట్రంలో రైతులకు కరంట్ కష్టాలు తీవ్రమయ్యాయి. 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకూ విద్యుత్ పరిస్థితి అధ్వాన్నంగానే సాగింది. ఏడు గంటలు ఇస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటనలు చేసినప్పటికీ... కనీసం రెండు నుంచి మూడు గంటలు కూడా వ్యవసాయానికి సరఫరా చేయలేదు. దీంతో రాత్రిపూట మొత్తం రైతులంతా వ్యవసాయబావుల దగ్గరే జాగారం చేసేవారు. ఈ నేపథ్యంలో రైతులు మార్కెట్‌లోకి వచ్చిన ఆయిల్ ఇంజిన్లను వేలకు వేలు అప్పుచేసి కొనుగోలు చేయడంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ పెరిగింది. పంటలను కాపాడుకునేందుకు రైతులు ఆయిల్ ఇంజిన్లతో బావుల్లోని కొద్దోగోప్పో నీటిని పంట కాల్వలకు మళ్లించుకున్నారు. ప్రస్తుతం విద్యుత్ నిరంతరాయంగా సరఫరా అవుతుండటంతో వాటిని పక్కకు పడేశారు. సీఎం కేసీఆర్ విద్యుత్ విషయంలో తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకంగా మారింది. సాగుకు తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేశారు. నిర్దేశిత సమయాలకనుగుణంగా కరంట్ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ఈ పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు అప్పటి వరకు వేలకు వేలు పెట్టి కొన్న ఆయిల్ ఇంజిన్లను దాచి పెట్టారు. మళ్లీ కరంట్ కష్టాలు వస్తే అవసరముంటాయనుకున్న రైతులకు వాటి అవసరమే రాలేదు. మొదట్లో వాటిని భద్రంగా దాచిన రైతులు... ఆ తర్వాత వాటితో అవసరం లేదని తేలాక పెంట కుప్పల్లో పడేశారు. ప్రస్తుతం వ్యవసాయంతోపాటు అన్ని వర్గాలకు నిరంతర విద్యుత్ సరఫరా విజయవంతంగా సాగుతున్నది. నిరంతర విద్యుత్ సరఫరాకు ఇటీవల 100 రోజులు దాటాయి. దీంతో ఆయిల్ ఇంజిన్ల అవసరం లేకుండా పోయింది. బావుల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు రైతులు క్రేన్లను కూడా కొనుగోలు చేశారు. పాలమూరు, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల నుంచి కూలీలు బావుల పనులకు వచ్చారు. బావుల్లో నీరు లోతుకు పడిపోతున్నకొద్దీ బావులను తవ్వారు. మిషన్‌కాకతీయ విజయవంతం అవడంతోపాటు వరుణుడు కూడా కరుణిస్తుండటంతో భూగర్భ జలాలు పెరిగాయి. ఒకప్పుడు బావుల్లో ఊట కోసం పూడిక తీయించిన రైతులు ఇప్పుడు నిండుగా ఉన్న బావులను చూసి సంబురపడుతున్నారు. దాదాపు ఈ నాలుగేండ్ల కాలం నుంచి బావుల్లో పూడికతీత అవసరం లేకుండా పోయింది. ఫలితంగా క్రేన్లను కూడా పక్కకు పడేశారు.

ఎండాకాలంలో మంచు దుప్పటి



ఎండాకాలంలోనూ మంచు దుప్పటి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌వాసులను ఆశ్చర్యానికి గురిచేసింది. చలికాలాన్ని తలపించేలా వాతావరణం ఒక్కసారిగా మారిపోవడంతో స్థానికులు సంతోషం వ్యక్తంచేశారు. అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణం మూడు రోజులుగా చల్లబడింది. దీంతో ఆదివారం ఉదయం 7 గంటల వరకు పొగ మంచు షాద్‌నగర్ బైపాస్ రోడ్డును పూర్తిగా కప్పేసింది. దీంతో వాహనదారులు కొంత ఇబ్బందిపడ్డారు.

- షాద్‌నగర్, నమస్తే తెలంగాణ

భారతీయ సంస్కృతికి ఉగాది ప్రతీక

సీఎం కేసీఆర్ గొప్ప తెలుగుభాషాభిమాని

ఉగాది ఉత్సవాల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు

శంషాబాద్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఉగాది ఉత్సవాలు ప్రతీక.. దేశప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు.. శ్రీవిళంబి నామ సంవత్సరంలో దేశ ప్రజలు సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఆకాంక్షించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ పరిధిలోని స్వర్ణభారత్ ట్రస్ట్ హైదరాబాద్ చాప్టర్‌లో ఉగాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథులుగా ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణశాఖల సహాయ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి, కేంద్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి నరేంద్ర సింగ్ తోమర్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కిషన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాట్లాడుతూ మన పూర్వీకులు అందించిన గొప్ప సంప్రదాయ పండుగ ఉగాది అని వివరించారు. సీఎం కేసీఆర్‌కు తెలుగు భాషపై అమితమైన మక్కువ, పట్టు ఉన్నదని ప్రశంసించారు. సీఎం కేసీఆర్ అందజేసిన 'తీయనైన తెలుగు-తెలంగాణ వెలుగు' అనే పుస్తకాన్ని సభికులకు చూపించి అందులోని వివిధ భాగాలను చదివి వినిపించారు. సీఎం కేసీఆర్ తెలుగు భాషాభివృద్ధికి విశిష్ట కృషి చేస్తున్నారని కొనియాడారు.



ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్ హైదరాబాద్ చాప్టర్‌లో ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్న ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రులు హర్దీప్‌సింగ్ పూరి, నరేంద్రసింగ్ తోమర్, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి తదితరులు. (ఇన్‌సెట్) సీఎం కేసీఆర్ అందజేసిన 'తీయనైన తెలుగు-తెలంగాణ వెలుగు' పుస్తకాన్ని చూపుతున్న ఉప రాష్ట్రపతి



స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి

- పరీక్షకు ఆర్టీవో కార్యాలయానికి వాహనం రావాల్సిందే
- తప్పుడు సర్టిఫికెట్లు ఇవ్వకుండా హైదరాబాద్ నగర శివారు కార్యాలయాలపై ఉన్నతాధికారుల నిఘా

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వాహనాల ఫిట్‌నెస్‌లో ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పక్కాగా అమలుచేయాలని రవాణాశాఖ నిర్ణయించింది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ దఫా ప్రతి బస్సును సునిశితంగా పరిశీలించాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఫిట్‌నెస్ విషయంలో వస్తున్న విమర్శలు, పెరిగిపోతున్న ఆరోపణల నేపథ్యంలో వీటికి ఫుల్‌స్టాప్ పెట్టాలనే లక్ష్యంతో అధికారులు ముందునుంచే ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కార్యాలయాలకు వాహనాలు రాకుండానే అధికారులు వాహనాన్ని పరీక్షించకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీచేస్తున్నారనే తీవ్ర విమర్శల నేపథ్యంలో కట్టుదిట్టం చేయాలని నిర్ణయించారు. ఫిట్‌నెస్ విషయంలో హైదరాబాద్ నగరంలోని కొన్ని కార్యాలయాలపై అనేక ఫిర్యాదులు అందుతుండడంతో అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇటీవల రవాణాశాఖలో బయటపడుతున్న వరుస అక్రమాల నేపథ్యంలో పకడ్బందీగా నిర్వహించాలని ఆలోచిస్తున్నారు. వాహనదారుల ప్రలోభాలకు లొంగి నిబంధనలు ఉల్లంఘించిన ఇన్‌స్పెక్టర్లపై కొద్దిరోజుల కిందట బదిలీవేటు పడింది. ఫిట్‌నెస్ లేని వాహనాలకు కూడా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తున్నారనే ఆరోపిస్తూ ప్రభుత్వానికి గతంలో ఫిర్యాదులు అందిన నేపథ్యంలో కట్టుదిట్టం చేయాలని ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నారు.

శివారు కార్యాలయాలపై నజర్

జూన్ నుంచి విద్యా సంవత్సరం ప్రారంభంకానున్న క్రమంలో పాఠశాలలు, కళాశాలల బస్సులపై రవాణాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న శివారు కార్యాలయాల్లో ఈ తప్పుడు సర్టిఫికెట్ల దందా ఎక్కువగా జరుగుతున్నదని తెలిసి వీటిపైనే నిఘా ఉంచారు. నగరంలో రిజిస్టరైన వాహనాలు ఎన్ని ఉన్నాయి? వాటి పరిస్థితి ఏంటనే విషయంపై సమాచారం తెప్పించుకున్నారు. నగరంలో ఉన్న విద్యా సంస్థల బస్సులు ఎన్ని ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయనే అంశం ఆధారంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని భావిస్తున్నారు. గత సంవత్సరంలో విద్యా సంస్థలకు సంబంధించిన చాలా బస్సులు, ఇతర వాహనాలు ఫిట్‌నెస్ పరీక్షలు లేకుండానే సర్టిఫికెట్లు పొందాయి. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులైతే ఇక అంతే. పరీక్ష చేయకుండానే సర్టిఫికెట్లు అందాయి. ఈ దఫా అటువంటి వాటికి ఆస్కారం ఇవ్వొద్దనే ఆలోచనతో అధికారులు ఉన్నారు. ఫిట్‌నెస్ కాలపరిమితి ముగిసిన ప్రతి వాహనం రవాణాశాఖ కార్యాలయానికి వచ్చి పరీక్ష చేసిన తర్వాతే సర్టిఫికెట్ అందచేయాలని భావిస్తున్నారు. గ్రేటర్ పరిధిలోని మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో సుమారు 10 వేల బస్సులు విద్యా సంస్థలకు చెందినవి ఉన్నట్టు గత సంవత్సరం ఫిట్‌నెస్ సందర్భంగా తెలిసింది. ఇప్పటికే శివారు ప్రాంత ఆర్టీవో కార్యాలయాలపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో అధికారులు తప్పు చేస్తే కఠినంగా శిక్షించాలని నిర్ణయించారు.

పోలీస్ నియామక మండలి అధ్యక్షుడిగా వీవీ శ్రీనివాస్‌రావు బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పోలీస్ నియామక మండలి అధ్యక్షుడిగా వీవీ శ్రీనివాసరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ సిటీ పోలీస్ ఇంచార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసరావును ఇటీవల జరిగిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో పోలీస్ నియామక మండలి అధ్యక్షుడిగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఆయన ఆదివారం డీజీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.



నుజ్జునుజ్జయిన కారు, మృతుడు చిరంజీవి(ఫైల్)

మద్యంమత్తులో యువతి బీభత్సం

బైక్‌ను ఢీకొట్టిన కారు.. యువకుడి మృతి, మరొకరి పరిస్థితి విషమం

50 అడుగుల దూరం ఎగిరిపడ్డ యువకులు, పల్టీలు కొట్టిన కారు

హైదరాబాద్ రాయదుర్గం టీ-హబ్ రెండో ఫేజ్ వద్ద ప్రమాదం

హైదరాబాద్ సిటీబ్యూరో/గచ్చిబౌలి, నమస్తే తెలంగాణ: పొట్టకూటి కోసం ఫుడ్ డెలివరీ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్న ఆ యువకుడిని ఓ యువతి మద్యంమత్తు కబళించింది. విధుల్లో భాగంగా ఫుడ్ డెలివరీ ఇచ్చేందుకు వెళ్తుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో మృతిచెందగా, అతని స్నేహితుడు తీవ్రగాయాలతో దవాఖానలో చికిత్సపొందుతున్నాడు. హైదరాబాద్ బోరబండకు చెందిన చిరంజీవి(20), అతని స్నేహితుడు సాయికుమార్(20) జుమాటో ఫుడ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం కూడా రాయదుర్గం ఐటీ కారిడార్ టీ-హబ్ రెండో ఫేజ్ వద్దకు యాక్టివా వాహనంపై వెళ్లగా, మద్యం మత్తులో జోగుతున్న జెన్ని జాకబ్(26) తన కారుతో వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో చిరంజీవి, సాయికుమార్ 50 అడుగుల దూరంలో ఎగిరిపడ్డారు. జెన్ని కారు కూడా మూడు పల్టీలు కొట్టిందని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. తీవ్రంగా గాయపడిన చిరంజీవి, సాయికుమార్‌ను సమీపంలోని దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి చిరంజీవి ఆదివారం మృతిచెందాడు. ఢిల్లీకి చెందిన జెన్ని జాకబ్ నాలుగురోజుల కింద స్నేహితురాలు లిజాతో కలిసి కోకాపేట గ్రీన్‌బ్లాసమ్ అపార్టుమెంట్‌లో ఉంటున్న స్నేహితుడు రౌనిత్‌కుమార్ వద్దకు వచ్చారు. కారును అద్దెకు తీసుకొని సొంతంగా డ్రైవింగ్ చేస్తున్నారు. జెన్ని మద్యం సేవించిందని, బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్ష చేస్తే మీటర్ రీడింగ్ 51 వచ్చిందని రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపారు. జెన్నిపై 304ఏ, 338, 185 మోటార్ వెహికిల్ యాక్ట్ కింద కేసునమోదుచేసినట్టు వెల్లడించారు. మద్యంమత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన మహిళ ఒకరి మృతికి కారణమైన ఘటన హైదరాబాద్‌లో ఇదే ప్రథమమని తెలిసింది.

బాలికల భవితకు భరోసా

- బాల్యవివాహాలపై రాచకొండ పోలీసుల విస్తృత అవగాహన
- ఏడాదిలో రెండు వేలకుపైగా చైతన్య కార్యక్రమాలు
- 31 బాల్య వివాహాలను అడ్డుకున్న షీటీమ్స్
- విముక్తి కల్పించిన బాలికలపై నిరంతర పర్యవేక్షణ



అండర్-19 క్రికెట్‌లో జాతీయస్థాయి క్రీడాకారిణి అనూషకు నగదు బహుమతి అందజేస్తున్న సీపీ మహేశ్‌భగవత్ (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: బాల్యవివాహం.. ఓ మూఢాచారం.. పేదరికం, అపోహ, అభద్రత, అనుమానం, భారమని భావించడం.. ఇలా కారణం ఏదైనా కొందరు తల్లిదండ్రులు తమ బిడ్డలను చదువుకోవాల్సిన వయసులోనే పెండ్లి పీటలు ఎక్కిస్తున్నారు. ఫలితంగా ఆ బాలికలు మానసిక, శారీరక సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇంతటి ఆధునిక సమాజంలోనూ.. రాజధానికి సమీపంలోని గ్రామాల్లో ఇలాంటి దురాచారం ఇంకా కొనసాగుతుండటం రాచకొండ పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో షీటీమ్స్ రంగంలోకి దిగి కొన్నాళ్లుగా చేస్తున్న కృషితో ఈ దురాచారానికి అడ్డుకట్ట పడుతున్నది. ఏడాదిలో 31 బాల్య వివాహాలు ఆగిపోవడమే ఇందుకు నిదర్శనం. బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏడాది కిందట రాచకొండ సీపీ మహేశ్‌భగవత్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, షీ టీమ్స్‌ను రంగంలోకి దింపారు. వారు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, చట్టరీత్యా ఏలాంటి చర్యలు ఉంటాయనే విషయాలపై పాఠశాలల్లో, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. ఇప్పటివరకు రెండువేలకు పైగా కార్యక్రమాలను నిర్వహించారు. దీనికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, బాలికల నుంచి మంచి స్పందన వచ్చింది. బాల్యవివాహాలపై సమాచారం ఇచ్చారు. వలిగొండ, మోత్కూరు, మహేశ్వరం, తుర్కపల్లి, సరూర్‌నగర్, పోచంపల్లి, రామన్నపేట, యాదగిరిగుట్ట, అడ్డగూడురు, రాజపేట, బీబీనగర్, బొమ్మలరామారం, మాడ్గుల, నారాయణపూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు 31 బాల్య వివాహాలపై సమాచారం అందింది. వెంటనే షీ టీమ్స్ రంగంలోకి దిగి వాటిని అడ్డుకున్నాయి. ఈ దురాచారం నుంచి బాలికలకు విముక్తి కలిగించాయి.

ప్రత్యేక డేటాబేస్

తాము అడ్డుకున్న బాల్యవివాహాలకు సంబంధించి రాచకొండ పోలీసులు ప్రత్యేకంగా డెటాబేస్‌ను ఏర్పాటు చేసుకున్నారు. విముక్తి కల్పించిన బాలికల చిరునామా, తల్లిదండ్రుల వివరాలు, ఆ గ్రామ, తండా పెద్దల వివరాలు, ఫోన్ నంబర్లను నమోదు చేసుకున్నారు. తాము కాపాడిన బాలికల తాజా స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. బాలికలతో నేరుగా మాట్లాడుతూ ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయేమో ఆరా తీస్తున్నారు. ఎవరైనా భయపెడితే డయల్ 100 లేదా రాచకొండ వాట్సప్ నంబర్ 9490617111కు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. వివరాలను కూడా సేకరించుకొని పోలీసులు నిత్యం వారి నుంచి సమాచారం సేకరిస్తూ బాలిక బాగుగోలు గురించి తెలుసుకుంటున్నారు.

బాలికలే ముందుకొస్తున్నారు

షీ టీమ్స్ గురించి గ్రామీణ ప్రాంతాల్లో సైతం తెలుస్తుండటంతో బాలికలే ముందుకొచ్చి సమాచారం ఇస్తున్నారు. రెండు రోజుల కిందట ఓ బాలిక నేరుగా సమాచారం ఇవ్వడంతో బాలల హక్కుల సంఘం, రాచకొండ పోలీసులు కలిసి బాల్య వివాహాన్ని అడ్డుకున్నాయి. గతంలో ఓ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తుండగా ఓ బాలిక తన స్నేహితురాలికి బలవంతంగా పెండ్లి చేస్తున్నారని సమాచారం ఇచ్చింది. దీంతో షీ టీమ్స్ అక్కడికి చేరుకొని ఆ బాలికను కాపాడాయి. నల్లగొండ జిల్లాకు చెందిన అనూషను రాచకొండ పోలీసులు, బాలల హక్కుల సంఘం వారు రక్షించారు. తర్వాత ఆమె అండర్ - 19 క్రికెట్‌లో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. దీంతో ఆమెకు ప్రోత్సాహకంగా సీపీ మహేశ్‌భగవత్ రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. షీటీమ్స్ ఇచ్చిన భరోసాతో ఇలాంటి ఘటనలు ఎన్నో చోటుచేసుకుంటున్నాయి. బాల్యవివాహాలను అడ్డుకునే సమయంలో షీ టీమ్స్ సభ్యులు బాలిక తల్లిదండ్రులకు, కుల పెద్దలకు, గ్రామ పెద్దలకు కౌనెన్సిలింగ్ ఇస్తున్నారు.

ప్రజల్లో చైతన్యం వస్తున్నది

బాల్యవివాహాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలు, తండాల నుంచే ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి. మేం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో కొంత చైతన్యం వచ్చింది. వారు ఇచ్చిన సమాచారంతో ఏడాదిలో 31 బాల్య వివాహాలను అడ్డుకున్నాం. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చిన తర్వాత మార్పు కనిపిస్తున్నది.

– సలీమా, అదనపు డీసీపీ, రాచకొండ షీ టీమ్స్

24 గంటలు అందుబాటులో..

బాల్యవివాహాలతో బాలికల భవిష్యత్ నాశనం కావడంతోపాటు, వారికి, వారికి పుట్టబోయే బిడ్డకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. బాల్యవివాహాలను ప్రోత్సహించేవారికి రెండేండ్ల జైలు, రూ.లక్ష వరకు జరిమానా పడే అవకాశం ఉంటుంది. ఈ విషయాలపై మరింత అవగాహన కల్పిస్తాం. మహిళల భద్రత, బాల్యవివాహాలను అడ్డుకునేందుకు 24 గంటలపాటు అందుబాటులో ఉంటాం.

– మహేశ్‌భగవత్, రాచకొండ పోలీస్ కమిషనర్

ఐదుగురి ప్రాణంతీసిన చేపల వేట

- చెరువులో మునిగి దుర్మరణం
- మృతుల్లో ముగ్గురు చిన్నారులు
- మెదక్ జిల్లా కన్నారంలో విషాదం



హుదాకరీన, అహ్మద్‌అలీ, ఇసాక్‌అలీ, ఖాజా ఇంతియాజ్ అలీ, మహ్మద్ ఆసీన్ మృతదేహాలు

కౌడిపల్లి: చేపల వేట ఆ కుటుంబంలో తీరని దుఃఖాన్ని మిగిల్చింది. మూడు రోజుల కిందట హైదరాబాద్ నుంచి గ్రామానికి వచ్చిన ఖాజా ఇంతియాజ్ అలీ(41), అతని కొడుకులు ఇసాక్ అలీ(11), అహ్మద్‌అలీ(8), బావమరిది మహ్మద్ ఆసీన్(28), మరుదలు కుమార్తె హుదాకరీన(16) తిరిగిరాని లోకాలకు వెళ్లడం విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కన్నారం గ్రామానికి చెందిన ఖాజా ఇంతియాజ్ అలీ, అతని బావమరిది మహ్మద్ ఆసీన్ హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ జియాగూడలో ఉంటున్నారు. మూడు రోజుల కిందట వీరు గ్రామానికి వచ్చారు. ఆదివారం ఇంతియాజ్ అలీ తన కొడుకులు ఇసాక్, అహ్మద్, బావమరిది ఆసీన్, మరుదలు కుమార్తె హుదాకరీనతో పాటు మరో ముగ్గురుతో కలిసి మధ్యాహ్నం గ్రామ సమీపంలోని కన్నారం పెద్ద చెరువుకు చేపల వేట కోసం క్వాలీస్ వాహనంలో వచ్చారు. ఒకపక్క ఇంతియాజ్, ఆసీన్ చేపలు పడుతుండగా, ఇసాక్, అహ్మద్, హుదాకరీన చెరువులో స్నానానికి దిగారు. ముగ్గురు నీటిలో మునిగిపోతుండగా ఇంతియాజ్ గమనించి వారిని కాపాడేందుకు నీటిలోకి దిగి అతను కూడా మునిగిపోయాడు. వీరందరినీ కాపాడేందుకు ఆసీన్ నీటిలోకి దిగగా, అతను కూడా మునిగిపోయాడు. ఒకరి తర్వాత మరొకరు నీటిలో మునుగుతుండడంతో ఒడ్డుపైన ఉన్న మరో ఇద్దరు యువకులు మనాల్, మరియం కూడా నీటిలోకి దిగే ప్రయత్నం చేయగా, అక్క డే ఉన్న కారు డ్రైవర్ సుభాన్ వీరిని నీటిలోంచి బయటికి తెచ్చాడు. సుభాన్ పరుగెత్తుకుంటూ వెళ్లి గ్రామస్తులకు విషయం చెప్పాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను వెలికితీశారు. మెదక్ డీఎస్పీ వీ వెంకటేశ్వర్లు, తూప్రాన్ సీఐ లింగేశ్వర్‌రావు, ఎస్‌ఐలు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు వెళ్లి మృతదేహాలను చూసి సంతాపం వ్యక్తంచేశారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. హుదాకరీన ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నది. కేసు దర్యాప్తులో ఉన్నది.

లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి గాంధీ అరెస్ట్

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో

మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చిన ఏసీబీ అధికారులు

కొద్దిసేపటికే ఛాతిలో నొప్పి.. దవాఖానకు తరలింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో లేబర్ కోర్టు ప్రిసైడింగ్ అధికారి (జిల్లా జడ్జి హోదా) మల్లంపాటి గాంధీని శనివారం రాత్రి ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆ కొద్దిసేపటికే ఛాతిలో నొప్పి రావడంతో ఆయనకు పోలీసులు వైద్య పరీక్షలు చేయించారు. గతంలో ఆయన గుండెకు సంబంధించిన చికిత్స కూడా చేసుకున్నట్టు తెలిసింది. ఆదివారం మెజిస్ట్రేట్ ఎదుట గాంధీని హాజరుపరుచగా, 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు. మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు మరోసారి వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం రాత్రి ఏడున్నర గంటల సమయంలో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలిచారు. జైలు వైద్యుల సూచన మేరకు మళ్లీ గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్టు సమాచారం రావడంతో పక్కా ఆధారాలు సేకరించిన ఏసీబీ అధికారులు శుక్రవారం మల్లంపాటి గాంధీపై కేసు నమోదు చేసి, శనివారం ఏకకాలంలో తెలంగాణ, ఏపీలో ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. సోదాల్లో రూ.3.57 కోట్ల విలువచేసే ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ గుర్తించింది. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్టు నిర్ధారణ కావడంతో ఆయనను అరెస్ట్ చేశారు. నిబంధనల ప్రకారం అరెస్ట్ చేసిన ప్రతివ్యక్తికి దవాఖానలో వైద్య పరీక్షలు చేయించాల్సి ఉంటుందని ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ సమయంలో గాంధీకి ఛాతిలో నొప్పి వచ్చిందని, దవాఖానకు తరలించి వైద్య పరీక్షలు చేయించామని పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మెజిస్ట్రేట్ ఇంట్లో హాజరు పరిచామని తెలిపారు. గాంధీ ఆరోగ్య నివేదికను కూడా మెజిస్ట్రేట్‌కు అందజేసినట్టు పేర్కొన్నారు. తొలుత చంచల్‌గూడ జైలుకు తరలించాలని మెజిస్ట్రేట్ ఆదేశించారని, వైద్యం అవసరమైతే గాంధీ దవాఖానకు తీసుకెళ్లాలని కూడా జైలు అధికారులను ఆదేశించారని వారు వివరించారు. దీంతో ఆదివారం రాత్రి ఏడున్నర సమయంలో గాంధీని చంచల్‌గూడ జైలులోకి పంపించారు. కారాగారంలో ఉన్న దవాఖాన వైద్యులు పరిశీలించి గాంధీ దవాఖానకు రిఫర్ చేశారు. దీంతో ఆయనను రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో మళ్లీ గాంధీకి తరలించారు.

శిలాచిత్రాల స్థావరం వీరన్నపేట

రాష్ట్రంలోనే పెద్దదిగా గుర్తింపు • క్రీ.పూ ఐదువేల ఏండ్ల కిందటే మానవుల ఆవాసం

వెలుగులోకి తెచ్చిన పురావస్తు పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి

చేర్యాల, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోనే అతిపెద్ద శిలా చిత్రాల స్థావరం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వీరన్నపేటలో బయటపడింది. చేర్యాలకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని వీరన్నపేట గ్రామ శివార్లలో పొడువాటి ఏనె (గుట్ట) తోపాటు దానికి అనుకుని మిథునమ్మ చెరువు కేంద్రంగా క్రీ.పూ ఐదువేల ఏండ్ల కిందటే ఆదిమ మానవులు ఆవాసం ఏర్పాటుచేసుకున్నట్టు పురావస్తు పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి పరిశోధించి వెలుగులోకి తెచ్చారు. రాతిగొడ్డళ్లను నూరుకోగా ఏర్పడిన అనేక గుర్తులతోపాటు ఈ కాలంలో వేసిన పెట్రోగ్లిప్స్‌ను ఆయన గుర్తించారు. పెట్రో అనగా రాయి, గ్లిప్ అనగా కళాఖండం రాతి ఉపరితలంపై రాతితో లేదా పదునైన లోహ పరికరంతో వేసే బొమ్మలను పెట్రోగ్లిప్స్ అంటారు. వీరన్నపేట 'ఇస్త్రీ పెట్టె బండ' దాటుకొని ముందుకెళ్తే అనేక పెట్రోగ్లిప్స్ శిలలున్నాయి. ఇవి సుమారుగా 30 సెంటీమీటర్ల ఎత్తులో ఉన్నాయి. విడివిడిగా ఉన్న రాళ్ల మధ్య బొమ్మలు కనబడకుండా ముళ్లపొదలు, తంగేడుచెట్లు దట్టంగా పెరిగాయి. జనగామ, సిద్దిపేట జిల్లాల్లో 25 కిలోమీటర్ల పొడవునా విస్తరించిన ఈ ఏనేపై కట్కూర్ (జనగామ జిల్లా) గ్రామంలో కొన్ని, వీరన్నపేట (సిద్దిపేట జిల్లా)లో ఎక్కువసంఖ్యలో పెట్రోగ్లిప్స్ ఉన్నాయి. మిథునమ్మ చెరువుకు ఆవలివైపు శిలాచిత్రాల స్థావరం ఉన్నది.

ఎన్నో చిత్రాల నెలవు

త్రిశూలాలు, పీరీలను పోలిన చిత్రాలు, తిశ్రూలాన్ని వాటిని ఎత్తుకున్న మనిషి, విల్లును వంచుతున్న మనిషి, ఎలుగుబండి ముఖంతో, త్రిభుజాకృతి గల శరీరంతో ఉన్న మనిషి, విడిగా మనిషిని చెక్కిన శిలలు, చుట్టూ చిత్రాలున్న శిలలు, జత గూడుతున్న నెమళ్లు, శివలింగం, గడుల వలె ఉన్న గ్రాఫిటీ గీతలు, వాటి పక్కనే త్రిశూలం, లోహ పరికరంతో గీసిన గీతలు, బండపై ఏర్పరచిన కప్ మార్క్స్ ఉన్నాయి. ఆధునిక కాలానికి తీసిపోని విధంగా హనుమంతుని చిత్రం ఉన్నది. బృహత్ శిలాయుగపు ఆరాధన స్థలంగా ఈ చిత్రాలు ఉన్నాయి. ఏనెకు రెండువైపులా సర్వే నంబర్ 829, 831 లలో మృణ్మయ పాత్రలు, రాతి పనిముట్లు లభించాయి.



చిత్రాన్ని చూపుతున్న పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి

కప్‌మార్క్‌ల బండ

శిలా చిత్రాలతోపాటు సంగీతం వినిపించే కప్‌మార్క్‌ల బండ ఇక్కడ ప్రధానంగా ఆకర్షిస్తున్నది. 10 నుంచి 12 అడుగులున్న ఈ శిలపై సుమారుగా 50 నుంచి 60 కప్‌మార్క్‌లు ఉన్నాయి. వీటి పరిమాణం, లోతును బట్టి ఎక్కువగా వాడుకలో ఉన్నాయని తెలుస్తున్నది. ఈ శిలకింద ఒక గుహ ఉన్నది. ఏనె పొడువునా అనేక గుహలు ఉండటంతో మానవులకు ఆవాసంగా మారాయి.



హనుమంతుడి రూపం

నవీన శిలాయుగపు పెట్రోగ్లిప్స్

క్రీ.పూ. ఐదువేల ఏండ్ల కిందటి నవీన శిలాయుగపు చిత్రాలు వీరన్నపేటలోని 'తోకల ఏనె'పై ఉన్నాయి. 'ఎద్దుల గుండు' అని పిలిచే ఎనిమిది అడుగుల శిలపై మూడుఎద్దుల చిత్రాలున్నాయి. వూపురం, జననాంగాలు తీర్చిదిద్దారు. చిత్రాలు బండలో ఒరిపిడి చేసి గీయడంతో చిత్రాల గీత మందంగా ఉన్నది. ఇక్కడ తెగలకు ఆరాధ్య చిహ్నం ఎద్దు అని తెలుస్తున్నది. ఇటువంటి చిత్రాలను టోటెం అంటారు. ఏనె పై మధ్యలో ఎద్దుల చిత్రాలు దూరం నుంచే కనబడే విధంగా ఉన్నాయి. ఏనె వెంట మరికొంత దూరంగా వెళ్తే సహజ సిద్ధంగా ఏర్పడిన డైనోసర్‌ను పోలిన శిల ఆకర్షిస్తుంది. ఈ చిత్రాలు దట్టమైన పొదల్లో ఉండటం వల్ల ఏప్రిల్, మే నెలలో మాత్రమే చూడటానికి వీలుగా ఉంటుంది. అతిపెద్ద శిలా చిత్రాల స్థావరమూ, అరుదైన చిత్రాలు కావడం వల్ల పురావస్తుశాఖ ఈ స్థావరాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉన్నది. ఏనెకు రెండువైపులా తవ్వకాలు జరిపితే ఆనాటి చరిత్ర మరింత వెలుగులోకి వస్తుంది.

ప్రపంచ వాణిజ్యంపై సమాలోచనలు

■ నేటి నుంచి డబ్ల్యుటీవో మంత్రివర్గ సమావేశాలు

న్యూఢిల్లీ, మార్చి 18: రెండు రోజులపాటు ఇక్కడ జరిగే ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటీవో) మంత్రివర్గ సమావేశంలో ప్రపంచ వాణిజ్యంపై 50 దేశాల ప్రతినిధులు విస్తృతస్థాయి చర్చలు జరుపనున్నారు. సోమ, మంగళ వారాల్లో జరిగే ఈ సమావేశంలో వివిధ సమస్యల పరిష్కార మార్గాలను అన్వేషించనున్నారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో వెలిబుచ్చింది. డిసెంబర్‌లో బ్యూనస్ ఎయిర్స్‌లో జరిగిన చర్చలు విఫలమైన నేపథ్యంలో ఈ చర్చలు విజయవంతంగా ముగియగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

గెయిల్‌లో ఐవోసీ, బీపీసీఎల్‌కు వాటాలు?

న్యూఢిల్లీ, మార్చి 18: ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్)లు గెయిల్ ఇండియా లిమిటెడ్‌లో 26 శాతం చొప్పున వాటాలను కొనుగోలు చేసే అవకాశాలున్నాయి. గత నెల ప్రకటించిన బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రతిపాదించిన చమురు సంస్థల ఏకీకరణలో భాగంగానే.. దేశంలో అతిపెద్ద గ్యాస్ మార్కెటింగ్, రవాణా సంస్థ అయిన గెయిల్‌లో 54.89 శాతం ప్రభుత్వ వాటాను కొనుగోలు చేయడానికి ఐవోసీ, బీపీసీఎల్‌లు వేర్వేరుగా ప్రతిపాదనల్ని సమర్పించాయి. ఈ వాటాల అమ్మకంతో ప్రభుత్వానికి రూ.40,000 కోట్ల నిధులు దక్కనున్నాయి.

ఇటుకల్లా.. రద్దైన నోట్లు!



న్యూఢిల్లీ, మార్చి 18: పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో పాత రూ.500, 1,000 నోట్లను చీలికలుగా చేసి, ఇటుకల్లా మార్చుతున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తెలిపింది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఓ పీటీఐ ప్రతినిధి దాఖలు చేసిన పిటిషన్‌కు ఆర్బీఐ ఈ మేరకు వెల్లడించింది. ఈ నోట్ల పరిశీలన, ప్రామాణికత, లెక్కింపు తదితర సేవల కోసం దేశవ్యాప్తంగా వివిధ ఆర్బీఐ కార్యాలయాల్లో 59 కరెన్సీ వెరిఫికేషన్ ప్రాసెసింగ్ సిస్టమ్ (సీవీపీఎస్) మెషీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ నోట్లను రీసైక్లింగ్ చేయడం లేదని స్పష్టం చేసిన ఆర్బీఐ.. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెషీన్ల ద్వారా చిన్నచిన్న ముక్కలుగా కత్తిరించి, ముద్దలు చేసి ఇటుకల్లా మార్చుతున్నట్లు వివరించింది. రద్దు సమయంలో ఉన్న కరెన్సీలో 99 శాతం ఈ పెద్ద నోట్లే ఉండగా, వీటి విలువ రూ.15.44 లక్షల కోట్లుగా ఉందని, నిరుడు జూన్ 30 నాటికి డిపాజిట్ల రూపంలో రూ.15.28 లక్షల కోట్లు వచ్చాయన్నది.

16 శాతమే సరిపోయాయి

■ జూలై-డిసెంబర్ జీఎస్టీ రిటర్నుల్లో భారీ తేడా

న్యూఢిల్లీ, మార్చి 18: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రిటర్నుల్లో 16 శాతం మాత్రమే తుది రిటర్నులతో సరిపోయాయి. దీంతో ఖంగుతిన్న రెవిన్యూ శాఖ.. ఏదైనా పన్ను ఎగవేతలకు ఆస్కారం ఉందా? అన్న కోణంలో ఇప్పుడు పరిశీలిస్తున్నది. జీఎస్టీ రిటర్నుల గణాంకాల ప్రకారం నిరుడు జూలై-డిసెంబర్ మధ్య కాలంలో దాఖలైన ఇనీషియల్ జీఎస్టీ రిటర్నుల్లో కేవలం 16 శాతమే ఫైనల్ రిటర్నులతో మ్యాచ్ అవుతున్నట్లు రెవిన్యూ శాఖ చెబుతున్నది. జీఎస్టీఆర్-3బీ రిటర్నుల దాఖలులో జూలై-డిసెంబర్ మధ్య 34 శాతం వ్యాపారులు రూ.34,400 కోట్లు తక్కువగా పన్ను చెల్లింపులు జరిపారు. జీఎస్టీఆర్-3బీ ఫైలింగ్ ద్వారా ఖజానాకు ఈ 34 శాతం వ్యాపారులు రూ.8.16 లక్షల కోట్లు మాత్రమే చెల్లించారని, నిజానికి వారి జీఎస్టీఆర్-1 డేటా ప్రకారం రూ.8.50 లక్షల కోట్లు రావాల్సి ఉందని రెవిన్యూ శాఖ చెప్పింది.

కార్పొరేట్ డైరెక్టర్లపై నిఘా

న్యూఢిల్లీ, మార్చి 18: పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం నేపథ్యంలో కార్పొరేట్ కంపెనీల్లో బోర్డు డైరెక్టర్లుగా పనిచేసేందుకు అనుమతి పొందిన వ్యక్తుల పాస్‌పోర్టు వివరాలను తెప్పించుకోవాలన్న ప్రతిపాదనను కార్పొరేట్ వ్యవహారాల శాఖ పరిశీలిస్తున్నది. డైరెక్టర్ గుర్తింపు నెంబర్ (డీఐఎన్)ను కలిగివున్న వ్యక్తికి ఒకవేళ పాస్‌పోర్టు లేకపోతే ఆ విషయమై అతని నుంచి ధృవీకరణ పత్రాన్ని పొందాలని ఆ శాఖ యోచిస్తున్నది. డీఐఎన్‌ను పొందాలనుకునేవారు తమ పాస్‌పోర్టు వివరాలను సమర్పించడం తప్పనిసరి చేయాలని, ఇందుకు అనుగుణంగా డీఐఎన్ దరఖాస్తు పత్రాన్ని సవరించాలని కార్పొరేట్ వ్యవహారాల శాఖ యోచిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రూ.50 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ రుణాలను పొందిన ప్రతి ఒక్కరి పాస్‌పోర్టు వివరాలను 45 రోజుల్లోగా సేకరించాలని కేంద్ర ఆర్థిక శాఖ బ్యాంకులను ఆదేశించింది.

బ్యాంకుల్లో అన్‌క్లెయిమ్డ్ సొమ్ము | 11,302 కోట్లు



బెంగళూరు, మార్చి 18: దేశంలోని 64 బ్యాంకులకు చెందిన 3 కోట్లకు పైగా ఖాతాల్లో రూ.11,302 కోట్ల అన్‌క్లెయిమ్డ్ (ఎవరూ తమదని ప్రకటించని) సొమ్ము పడి ఉన్నది. రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అతిపెద్దదైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో అత్యధికంగా రూ.1,262 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)లో రూ.1,250 కోట్లు, ఇతర అన్ని జాతీయ బ్యాంకుల్లో రూ.7,040 కోట్ల అన్‌క్లెయిమ్డ్ సొమ్ము మూలుగుతున్నది. అలాగే ప్రైవేటు రంగంలోని 19 బ్యాంకుల్లో మొత్తం రూ.1,416 కోట్ల అన్‌క్లెయిమ్డ్ సొమ్ము పడి ఉన్నదని, వీటిలో ఐసీఐసీఐ (రూ.476 కోట్లు), కోటక్ మహీంద్రా (రూ.151 కోట్లు) అగ్రస్థానంలో నిలువగా, 25 విదేశీ బ్యాంకుల్లో రూ.332 కోట్ల అన్‌క్లెయిమ్డ్ సొమ్ము మూలుగుతున్నదని, వీటిలో ఒక్క హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకులోనే రూ.105 కోట్ల అన్‌క్లెయిమ్డ్ సొమ్ము ఉన్నదని రిజర్వు బ్యాంకు వివరించింది. అయితే దేశంలోని అన్ని బ్యాంకుల్లో గల రూ.100 లక్షల కోట్లకు పైగా డిపాజిట్లతో పోలిస్తే ఈ అన్‌క్లెయిమ్డ్ సొమ్ము చాలా చిన్న మొత్తమే. ఈ డిపాజిట్లలో ఎక్కువ మొత్తం సొమ్ము మృతిచెందిన ఖాతాదారులకు లేదా అనేక బ్యాంకు ఖాతాలు కలిగివున్న వ్యక్తులకు సంబంధించినది అయి ఉంటుందని, ఇందులో ఎక్కువ భాగం బినామీ సొమ్ము గానీ, అప్రకటిత సొమ్ము గానీ కాకపోవచ్చని ఐఐఎం-బీలో ఆర్బీఐ చైర్ ప్రొఫెసర్‌గా పనిచేసిన చరణ్ సింగ్ అంటున్నారు. బ్యాంకింగ్ నియంత్రణా చట్టం-1949వొరి సెక్షన్ 26 ప్రకారం దేశంలో పదేళ్ల నుంచి లావాదేవీలు జరగని అన్ని ఖాతాల వివరాలను బ్యాంకులు ప్రతి క్యాలెండర్ సంవత్సరం ముగిసిన 30 రోజుల వ్యవధిలోగా ఆర్బీఐకి సమర్పించాల్సి ఉంటుంది. అయితే పదేళ్ల గడువు ముగిసిన తర్వాత డిపాజిట్ సొమ్మును క్లెయిమ్ చేసుకోకుండా లేదా బ్యాంకు ఖాతాను నిర్వహించుకోకుండా ఏ డిపాజిట్‌దారుడినీ నిరోధించేందుకు వీల్లేదని, ఆ సొమ్మును తిరిగి చెల్లించాల్సిన బాధ్యత బ్యాంకింగ్ సంస్థదేనని సెక్షన్ 26ఏ స్పష్టం చేస్తున్నది. పనిచేయని ఖాతాల్లోని అన్‌క్లెయిమ్డ్ సొమ్మును డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌లో ఉంచుతారు. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం-2012లోని నిబంధనల కింద ఈ ఫండ్ ఏర్పాటైంది.

కీలక వ్యాపార భాగస్వాములతో
ద్వైపాక్షిక చర్చలు జరుపాలి

■ కేంద్రానికి అసోచామ్ సూచన

న్యూఢిల్లీ, మార్చి 18: ప్రపంచ దేశాల మధ్య వాణిజ్య యుద్ధం ఉద్ధృతమైనట్లయితే కీలకమైన వ్యాపార భాగస్వాములతో భారత్ ద్వైపాక్షిక చర్చలు జరుపాల్సిన అవసరం ఉన్నదని అసోచామ్ స్పష్టం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య యుద్ధం ముదిరినప్పటికీ అందుకు అనుగుణంగా ప్రతీకార చర్యలు చేపట్టే అవకాశం భారత్‌కు లేదని, దేశ ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటం, వీటిలో అత్యధిక దిగుమతులు అనివార్యమైనవి కావడమే ఇందుకు కారణమని అసోచామ్ అభిప్రాయపడింది. వాణిజ్య యుద్ధంలో భారత్ ఏదో ఒక కూటమి వైపు అతిగా మొగ్గు చూపకుండా ప్రధాన వ్యాపార భాగస్వాములతో ఎప్పటికప్పుడు ద్వైపాక్షిక చర్చలు జరుపడం, మన ఎగుమతులకు నష్టం వాటిల్లినప్పుడు నిబంధనల వారీగా ప్రపంచ వాణిజ్య సంస్థను ఉపయోగించుకోవడం ఉత్తమమని అసోచామ్ ఓ ప్రకటనలో పేర్కొన్నది.

అంతర్జాతీయ పరిణామాలు కీలకం

■ దేశ రాజకీయ పరిస్థితులూ ముఖ్యమే
■ ఈ వారం మార్కెట్ తీరుపై నిపుణుల అంచనా



న్యూఢిల్లీ, మార్చి 18: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం అంతర్జాతీయ పరిణామాల ఆధారంగా ట్రేడ్ అవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. భారతీయ బ్యాంకింగ్ రంగాన్ని హడలెత్తిస్తున్న మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) అంశం కూడా మదుపరుల పెట్టుబడులను ప్రభావితం చేసే వీలుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ పేర్కొన్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్యసమీక్ష కూడా ఇదే వారం ఉండటంతో సహజంగానే దీని ప్రభావం దేశీయ ఈక్విటీ మార్కెట్లపై ఉంటుందని రిలయన్స్ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు వికాస్ జైన్ అభిప్రాయపడ్డారు. ఇక అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సృష్టించిన వాణిజ్య యుద్ధం సైతం భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేస్తుందన్న అంచనాలు మార్కెట్ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి. కాగా, దేశీయంగా రాజకీయ ఆందోళనలు చెలరేగడంతో గతవారం మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలిన విషయం తెలిసిందే. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి తెలుగుదేశం పార్టీ గుడ్‌బై చెప్పడం మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగానే ప్రభావితం చేసింది. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా జాతీయ రాజకీయాలపై దృష్టి సారించడం.. బీజేపీ సర్కారుపై మదుపరులలో విశ్వాసం సన్నగిల్లింది. ప్రాంతీయ పార్టీలన్నీ థర్డ్ ఫ్రంట్ దిశగా అడుగులేస్తుండటంతో మోదీ హవాకు బ్రేకులు పడ్డట్లేనన్న సంకేతాలు స్టాక్ మార్కెట్ల వ్యాప్తంగా విస్తరించాయి. ఈ క్రమంలోనే శుక్రవారం ఒక్కరోజే సెన్సెక్స్ 509.54 పాయింట్లు పడిపోగా, నిఫ్టీ 232.40 పాయింట్లు దిగజారింది. దీంతో అంతకుముందు సూచీలు అందుకున్న లాభాలు ఆవిరైపోయాయి. చివరకు గత వారం మొత్తంగా సెన్సెక్స్ 131.14 పాయింట్లు, నిఫ్టీ 31.70 పాయింట్లు కోల్పోవాల్సి వచ్చింది. ఇదిలావుంటే ఎప్పట్లాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ, గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు దేశీయ మార్కెట్ల ట్రేడింగ్‌ను శాసించనున్నాయి.

రూ.52,000 కోట్లు ఆవిరి

స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిసిన నేపథ్యంలో గత వారం సెన్సెక్స్ టాప్-10 సంస్థల్లో ఆరింటి మార్కెట్ విలువ రూ.52,000 కోట్లకుపైగా ఆవిరైపోయింది. ఐటీ దిగ్గజం టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్), హెచ్‌డీఎఫ్‌సీ, హిందుస్థాన్ యునీలివర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్), ఓఎన్‌జీసీ, ఎస్‌బీఐలు నష్టపోయాయి. అయితే ఇన్ఫోసిస్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి సుజుకీ షేర్ల విలువ సుమారు రూ.5,500 కోట్ల వరకు ఎగబాకింది. మార్కెట్ విలువ ప్రకారం ప్రస్తుతం ఆర్ఐఎల్ రూ.5,70,435.32 కోట్లతో ముందుండగా, టీసీఎస్ రూ.5,40,881.96 కోట్లతో రెండో స్థానంలో ఉన్నది.

రూ.6,400 కోట్లు తెచ్చారు

దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి గత నెల పెట్టుబడులను వెనుకకు తీసుకున్న విదేశీ మదుపరులు.. ఈ నెలలో మాత్రం రూ.6,400 కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం, కార్పొరేట్ సంస్థల త్రైమాసిక లాభాలు పుంజుకుంటాయన్న అంచనాల మధ్య పెట్టుబడులకు ఆసక్తి కనబరిచారు. అయితే రుణ మార్కెట్ల నుంచి రూ.10,600 కోట్లకు పైగా పెట్టుబడులను తీసేసుకున్నారు.

తరిగిపోయిన మ్యూచువల్ ఫండ్స్ ఆస్తులు

దేశంలోని టాప్ 10 మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) ప్రామాణిక ఆస్తులు.. గత నెల ఫిబ్రవరిలో రూ.8,900 కోట్ల మేర తరిగిపోయాయి. రిటైల్, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ నుంచి పెట్టుబడుల రాక బాగా తగ్గిపోయింది. ఈ క్రమంలోనే ఈ మ్యూచువల్ ఫండ్స్ సంస్థల నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.18,68,404 కోట్లకు పడిపోయింది. జనవరిలో ఇది రూ.18,77,303 కోట్లుగా ఉన్నదని భారతీయ మ్యూచువల్ ఫండ్స్ సంఘం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

'డీఆర్‌డీవో' ఎంటెక్ ప్రోగ్రామ్స్

రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (డీఐఏటీ) ఒక డీమ్డ్ యూనివర్సిటీ. న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు కలిగి ఉంది. రక్షణశాఖ కోసం నిష్ణాతులైన మానవ వనరులను రూపొందించడానికి ఈ కాలేజీని డీఆర్‌డీవో పుణెలో స్థాపించింది. 2018 విద్యాసంవత్సరానికి ఈ ప్రవేశాలు.

- బీఈ/బీటెక్ అభ్యర్థులు అర్హులు
- కోర్సు చదివే సమయంలో ఆర్థిక సహకారం
- రక్షణ రంగంలో స్థిరపడాలనుకునే వారికి సువర్ణావకాశం

డీఆర్‌డీవో పరిధిలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (డీఐఏటీ) ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



కోర్సులు - వివరాలు:

- కోర్సు: మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ (ఎంటెక్) ప్రోగ్రామ్స్
- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో కింది స్పెషలైజేషన్లు ఉన్నాయి..
- ఏరోస్పేస్ ఇంజినీరింగ్, మోడలింగ్ అండ్ సిమ్యులేషన్, కంప్యూటర్ సైన్స్ & ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, టెక్నాలజీ మేనేజ్‌మెంట్, మెటీరియల్స్ ఇంజినీరింగ్, కరోషన్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజినీరింగ్, సెన్సార్ టెక్నాలజీ (ఎస్‌టీ), లేజర్ & ఎలక్ట్రో - ఆప్టిక్స్ (ఎల్‌ఈవోసీ), మెటీరియల్ సైన్స్ & కెమికల్ టెక్నాలజీ, ఆప్టో ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ సిస్టమ్స్.
- **నోట్:** ఎంటెక్‌లో రోబోటిక్స్ అనేది మల్టీడిసిప్లీనరీ స్పెషలైజేషన్. ఎంటెక్ డిగ్రీని అభ్యర్థి అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీని బట్టి ప్రదానం చేస్తారు. ఉదా. ఎంటెక్ ఇన్ ఈఈ/ఎంఈ లేదా ఏఈ తదితరాలు.
- స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ అభ్యర్థులకు మాత్రమే అవకాశం
- కాలికట్‌లోని ఎన్ఐఈఐఎల్‌టీ సహకారంతో ఈ కోర్సులను డీఐఏటీ నిర్వహిస్తుంది.

ఎమ్మెస్సీ ప్రోగ్రామ్స్:

- ఎమ్మెస్సీలో ఫుడ్ టెక్నాలజీ (స్పాన్సర్డ్ విద్యార్థులకు మాత్రమే)
- **పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ప్రోగ్రామ్స్:**
- పీజీ డిప్లొమా ఇన్ ఫైర్ ఇంజినీరింగ్ & ఇంటిగ్రేటెడ్ సేఫ్టీ (స్పాన్సర్డ్ అభ్యర్థులకు మాత్రమే)
- **మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్):** ఈ ప్రోగ్రామ్ డీఆర్‌డీవో స్పాన్సర్డ్ అభ్యర్థులకు మాత్రమే.
- **అర్హతలు:**
- ఎంటెక్ ప్రోగ్రామ్‌కు - బీఈ/బీటెక్ లేదా మాస్టర్ డిగ్రీ ఇన్ సైన్స్‌లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. వ్యాలిడ్ గేట్ స్కోర్ కలిగి ఉండాలి.
- **వయస్సు:** 2018, జూలై 1 నాటికి 26 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక:** గేట్ స్కోర్ ఆధారంగా ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.
- **గమనిక:** అభ్యర్థులు గేట్‌లో అర్హత సాధించిన బ్రాంచీ స్పెషలైజేషన్‌కు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి స్పెషలైజేషన్‌కు వేర్వేరు దరఖాస్తులను దాఖలు చేయాలి.
- స్పాన్సర్డ్ కోటాలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునేవారు సంబంధిత శాఖ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తారు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్:

- అర్హులైన అభ్యర్థులకు డీబీటీ స్కీం కింద నెలకు రూ. 12,400/- ఇస్తారు.
- **వసతి, భోజనం:** భోజనానికి మెస్ సౌకర్యం ఉంది. పరిమిత సంఖ్యలో అభ్యర్థులకు పేమెంట్ ప్రాతిపదికన వసతి సౌకర్యం కల్పిస్తారు.

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ. 500/-
- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ , మహిళా అభ్యర్థులకు రూ. 250/-
- దరఖాస్తులు ప్రారంభం: మార్చి 20
- **దరఖాస్తు దాఖలుకు చివరితేదీ:** ఏప్రిల్ 13
- **స్పీడ్ పోస్టు ద్వారా హార్డ్‌కాపీని పంపడానికి చివరితేదీ:** ఏప్రిల్ 20
- **కోర్సుకు ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా ఫలితాలు విడుదల:** జూన్ మొదటి లేదా రెండో వారంలో ప్రకటిస్తారు.
- **కోర్సు ప్రారంభం:** జూలై మొదటి వారం
- **వెబ్‌సైట్:** www.diat.ac.in

ప్రాజెక్ట్ ఇంజినీర్లు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రాజెక్టు ఇంజినీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లోని ఇంటర్నేషనల్ షిప్ రిపేర్ ఫెసిలిటీ ప్రాజెక్టులో భాగంగా ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఈ ఖాళీలు ఉన్నాయి.

పోస్టులు - ఖాళీలు:

- ప్రాజెక్టు ఇంజినీర్ (పీఈ - సివిల్)- 6
- సీనియర్ ప్రాజెక్ట్ ఇంజినీర్ (ఎస్‌పీఈ)- 5
- చీఫ్ ప్రాజెక్ట్ ఇంజినీర్- 1
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా. ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టుకు ఏప్రిల్ 11 - 13 వరకు, సీనియర్ ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టుకు - ఏప్రిల్ 9, 13 వరకు. చీఫ్ ప్రాజెక్టు ఇంజినీర్ పోస్టుకు ఏప్రిల్ 18న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- అర్హతలు, వయస్సు, అనుభవం, జీతభత్యాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** www.cochinshipyard.com



కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో

భారత ప్రభుత్వ సంస్థ కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో డ్రాఫ్ట్స్‌మ్యాన్ ట్రెయినీల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- **పోస్టు:** డ్రాఫ్ట్స్‌మ్యాన్ ట్రెయినీలు
- **విభాగాలవారీగా ఖాళీలు:** మెకానికల్- 1 (ఎస్టీ) ఎలక్ట్రికల్- 7 (జనరల్- 5, ఎస్సీ- 1, ఎస్టీ- 1) సీట్లు ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** www.cochinshipyard.com

'కాస్ట్ అకౌంటెంట్స్'లో 33 పోస్టులు

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియాలో (ఐసీఏఎంఐ) కింది ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.



వివరాలు:

- **మొత్తం పోస్టులు:** 33
- పోస్టుల వారీగా ఖాళీలు..
- డైరెక్టర్- 2
- డిప్యూటీ డైరెక్టర్- 3
- అసిస్టెంట్ డైరెక్టర్- 1
- సీనియర్ ఆఫీసర్- 7
- ఆఫీసర్- 20
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 4
- **గమనిక:** దరఖాస్తు, అర్హత, పేస్కేల్ తదితర వివరాలకు కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** http://www.icami.in

మద్రాస్ ఐఐటీలో

చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- **పోస్టులు:** ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- పై పోస్టులకు 7వ సెంట్రల్ పే కమిషన్ (సీపీసీ) ప్రకారం వేతనాలు చెల్లిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 13
- **వెబ్‌సైట్:** https://facapp.iitm.ac.in

బీహెచ్‌ఈఎల్‌లో లా ఆఫీసర్లు

భారత ప్రభుత్వరంగ సంస్థ బీహెచ్‌ఈఎల్ లా ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది.



- **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
- **పోస్టు పేరు:** గ్రేడ్ (ఈ1) లా ఆఫీసర్
- **పేస్కేల్:** రూ. 24,900 - రూ. 50,500
- **విద్యార్హతలు:** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన కాలేజీ నుంచి రెగ్యులర్ విధానంలో లా కోర్సులో ఫుల్‌టైం బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిస్టెన్స్ లేదా కరస్పాండెన్స్ విధానంలో చదివినవారు ఈ పోస్టులకు అర్హులు కాదు. 'లా'లో పోస్టు గ్రాడ్యుయేషన్ లేదా డిప్లొమా ఇన్ కమర్షియల్/లేబర్/ట్యాక్సేషన్ లా పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది.
- **అనుభవం:** పై పోస్టులకు దరఖాస్తు చేసే అభ్యర్థులు ఎగ్జిక్యూటివ్ లేదా ఆఫీసర్ ఇన్ లీగల్ సెటప్ ఆఫ్ ది గవర్నమెంట్ లేదా సెమీ గవర్నమెంట్ లేదా పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్/నేషనలైజ్డ్ బ్యాంకులు లేదా లిస్టెడ్ కంపెనీస్ ఆన్ NSE/BSE (Group A&B) లలో తప్పనిసరిగా ఏడాది పనిచేసి ఉండాలి.
- **వయస్సు:** 1 మార్చి, 2018 నాటికి 30 ఏండ్లు మించరాదు.
- కేంద్రప్రభుత్వ నిబంధనలను అనుసరించి రిజర్వేషన్లు అమలు చేస్తారు.
- ఎంపికైన అభ్యర్థులు బెంగళూరు, భోపాల్, హరిద్వార్, రాణిపేట్, ఝాన్సీ, ఢిల్లీ/ఎన్‌సీఆర్ లలోని బీహెచ్‌ఈఎల్ యూనిట్లతోపాటు కోల్‌కతా, చెన్నై, నాగపూర్‌లలోని బీహెచ్‌ఈఎల్ పవర్ సెక్టార్ రీజియన్లలో పనిచేయాల్సి ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులు ప్రారంభం:** ఏప్రిల్ 2
- **చివరితేదీ:** మే 2
- **వెబ్‌సైట్:** http://carees.bhel.in

యూఎస్ కాన్సులేట్‌లో

హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్‌లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

- ఫిజీషియన్, హెచ్‌ఆర్ క్లర్క్
- అర్హతలు, జీతభత్యాలు తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **చివరితేదీ:** మార్చి 28
- **వెబ్‌సైట్:** http://in.usembassy.gov

భద్రాద్రిలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

భద్రాచలం, నమస్తే తెలంగాణ: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహిస్తున్న వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు ఆదివారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. ఉగాదిని పురస్కరించుకొని భక్తులకు పచ్చడి పంపిణీ చేశారు. సాయంత్రం వేళ భద్రాద్రి రామయ్యకు పంచాంగ శ్రవణం చేశారు. శ్రీవిళంబినామ సంవత్సరంలో భద్రాద్రి రామయ్యకు ఆదాయం ఎనిమిది, వ్యయం రెండుగా, సీతమ్మ వారికి ఆదాయం నాలుగు, వ్యయం రెండుగా ఉందని దేవస్థానం ఆస్థాన పురోహితులు చెన్నావజ్జుల వెంకటేశ్వర అవధాని తెలిపారు. సీతారామచంద్రస్వామిని నిత్య కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకువచ్చి సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం నిర్వహించి పంచాంగాలను స్వామి వారి పాదాల వద్ద ఉంచి పూజలు చేశారు.


భద్రాద్రి ఆలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న పండితులు

మొదలైన శ్రీరామనవమి ఉత్సవాలు

ఐదు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి సన్నిధిలో ఐదు రోజులపాటు నిర్వహించనున్న శ్రీరామ నవమి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారి అద్దాల మండపంలో ఆలయ ఈవో దూస రాజేశ్వర్ అర్చకులకు వర్ణి ఇచ్చి ఉత్సవాలను ప్రారంభించారు. 11 మంది రుత్వికులతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు, అద్దాల మండపంలోని ఉత్సవమూర్తులకు, శ్రీసీతారామచంద్రస్వామివారి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నమిలకొండ ఉమేశ్, అప్పాల భీమశంకర్, చంద్రగిరి శరత్, నమిలకొండ వేణు, మామిడిపెల్లి శరత్, ఆడెపు రాజన్న, ఒజ్జల ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

- వేములవాడ కల్చరల్


సీతారామచంద్రస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు


వనపర్తి జిల్లా వెల్టూరులో గొర్రెలను పంపిణీ చేస్తున్న మంత్రి జూపల్లి

పనుల్లో నాణ్యత లోపించొద్దు

మంత్రి జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల/చిన్నంబావి: సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపించొద్దని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామంలో రూ.80 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టి అభివృద్ధికి బాటలు వేయనున్నట్టు చెప్పారు. అనంతరం మంత్రి స్వగ్రామం చిన్నంబావి మండలం పెద్దదగడ తిరుమలనాథుడిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్థులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని పెద్దమారూర్, చిన్నమారూర్, వెల్టూరు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. వెల్టూరులో సబ్సిడీ గొర్రెలను పంపిణీ చేశారు.


వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నిరంజన్‌రెడ్డి

వివేకానందుడు ఆదర్శనీయుడు

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

పెద్దమందడి : వివేకానందుడు ఆదర్శనీయుడనీ, ఆయన బోధనలు అందరికీ స్ఫూర్తిదాయకమనీ, యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. ఆదివారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని జంగమాయిపల్లి, బలిజపల్లి జంట గ్రామాల్లో హిందువాహినీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివేకానంద విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సమాజానికి బాట చూపించాలంటే బందీగా ఉండకూడదని యుక్త వయస్సులోనే సన్యాసం స్వీకరించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. ఆయన దేశ విదేశాలు తిరిగి పలువురి మన్ననలు పొంది భారతదేశ ఖ్యాతిని పెంచిన వ్యక్తి అని గుర్తుచేశారు.


భద్రాద్రి రామాలయంలో కెప్టెన్ లక్ష్మీకాంతారావు

సీఎం కేసీఆర్ సేవలు దేశానికి అవసరం

ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు

భద్రాచలం, నమస్తే తెలంగాణ : తెలంగాణ సీఎం కే చంద్రశేఖరరావు సేవలు దేశానికి ఎంతో అవసరమని రాజ్యసభ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. భద్రాచలం రాములోరిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఏర్పాటు చేస్తున్నది థర్డ్ ఫ్రంట్ కాదని, తొలి ఫ్రంటేనని చెప్పారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఆసరా పెన్షన్ పథకాలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలిచాయన్నారు. అలాగే రైతులకు పెట్టుబడి పథకం రైతు సంక్షేమానికి ప్రభుత్వ చిత్తశుద్ధి తెలుస్తున్నదన్నారు.

విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి

కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్



న్యూశాయంపేట(వరంగల్): విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ పిలుపునిచ్చారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ హంటర్ రోడ్డులోని వ్యాస ఆవాసంలో ఆదివారం సులక్ష్యా సేవా సమితి ఐదో వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. సమాజ అభ్యున్నతికి నిస్వార్థంగా సేవ చేస్తున్న సులక్ష్యా సేవా సమితి సభ్యులను అభినందించారు. ఉన్నత వర్గాల వారు, సామాజిక వేత్తలు, సేవాతత్పరత కలిగిన వ్యక్తులు పాఠశాలలను, గ్రంథాలయాలను నెలకొల్పి పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులకు విద్యాదానం చేయాలని కోరారు. ఉన్నతంగా అభివృద్ధి చెందిన దేవాలయాలు, ట్రస్టులు విద్యావ్యాప్తికి పాటుపడాలని సూచించారు.

విషపు నీళ్లు తాగిన చిన్నారులు

ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

మక్తల్, నమస్తేతెలంగాణ : మహబూబ్‌నగర్ జిల్లా మాగనూర్ మండల కేంద్రంలో క్రిమిసంహారక మందు డబ్బాతో నీళ్లు తాగి చెల్లి మదీనా(4) మృతి చెందగా, అక్క తమ్రీన్(6) పరిస్థితి విషమంగా ఉంది. ఆదివారం సాయంత్రం తండ్రి రఫీతో కలిసి మదీనా, తమ్రీన్ పొలానికి వెళ్లారు. రఫీ పశువులకు మేత వేయడానికి వెళ్లగా, చిన్నారులు పొలం గట్టుపై ఉన్న క్రిమిసంహారక మందు డబ్బాతో నీటితొట్టిలో నీళ్లు తీసుకొని తాగి అస్వస్థతకు గురయ్యారు. గమనించిన రఫీ వెంటనే వారిని మాగనూర్‌కు తీసుకెళ్తుండగా, మదీనా మృతి చెందింది. తమ్రీన్‌ను మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించారు.


మదీనా(ఫైల్)

కన్నెపల్లి పంప్‌హౌస్ రికార్డు


జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి వద్ద నిర్మిస్తున్న అతిపెద్ద పంప్‌హౌస్

(వీ రాజేశ్వర్‌రావు/జయశంకర్ జిల్లాప్రతినిధి-నమస్తే తెలంగాణ):

దేశంలోనే అతిపెద్దది

- కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో ఇదే కీలకం
- 311 మీటర్ల వెడల్పు, 58 మీటర్ల పొడవుతో పంపుహౌస్
- 40 మెగావాట్ల పంపులు 17 అమర్చేలా పనులు

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో కాళేశ్వరం ఎత్తిపోతల రికార్డు సృష్టిస్తున్నది. ఇందులో కన్నెపల్లి దేశంలోనే అతి పెద్ద పంపుహౌస్‌గా చరిత్ర సృష్టించనున్నది. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను ఎగువ ప్రాంతాలకు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కన్నెపల్లి వద్ద పంపుహౌస్ నిర్మిస్తున్నది. 311 మీటర్ల వెడల్పు, 58 మీటర్ల పొడవుతో ఈ పంపుహౌస్ సిద్ధమవుతున్నది. 40 మెగావాట్ల సామర్థ్యం గల 17 పంపులు పనిచేసేలా సాగునీటి శాఖ ఇంజినీర్లు ఈ పంపుహౌస్‌ను డిజైన్ చేశారు. ఎక్కువ పంపులుగల పంపుహౌస్‌గా దేశంలో నంబర్‌వన్ స్థానంలో నిలువనున్నది కన్నెపల్లి. అంతేకాదు వెడల్పు, పొడవులోనూ ఇదే పెద్దది కానుండటం మరో ప్రత్యేకత. రూ.80లక్షల కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తున్నది. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు నుంచి కొత్తగా సుమారు 18.50 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వనుంది. మరో 18.50 లక్షల ఎకరాల పాత ఆయకట్టును స్థిరీకరించనున్నది. వచ్చే వానకాలం నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు.

సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ..

సీసీ కెమెరాల పర్యవేక్షణలో పనులు జరుగుతున్న సాగునీటి ప్రాజెక్టు ప్రపంచంలో ఇదే మొదటిది. జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో నిర్మిస్తున్న మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, పంపుహౌస్‌ల వద్ద సీసీ కెమెరాలు అమర్చి హైదరాబాద్‌లోని జలసౌధ, ప్రగతిభవన్‌కు అనుసంధానం చేశారు. ప్రగతిభవన్ నుంచి సీఎం కేసీఆర్, జలసౌధ నుంచి భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, సాగునీటి శాఖ ఉన్నతాధికారులు పనులను పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయిలోని ఇంజినీర్లు, ఏజెన్సీల ప్రతినిధులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. పనుల్లో మరింత వేగం పెంచేందుకు ఇటీవల సీఎం కేసీఆర్ క్షేత్రస్థాయిలో రెండు రోజులు పర్యటించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, పంపుహౌస్‌లు సందర్శించారు. మంత్రి హరీశ్‌రావు రెండు నెలల నుంచి నాలుగుసార్లు ఇంజినీర్లతో కలిసి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును సందర్శించారు. జూన్‌లోగా పనులు పూర్తిచేయాలని సాగునీటి ఇంజినీర్లు, ఏజెన్సీలను ఆదేశించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా మొదటి లింక్‌లో గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద ప్రభుత్వం బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు నిర్మిస్తున్నది. మూడు బరాజుల్లో మేడిగడ్డ బరాజ్ అత్యంత కీలకమైంది. ఈ బరాజ్ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోతల ద్వారా అన్నారం బరాజ్‌కు తరలించేందుకు కాళేశ్వరం సమీపంలో ఉన్న కన్నెపల్లి వద్ద పంప్‌హౌస్ నిర్మాణం జరుగుతున్నది.


కన్నెపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న పంప్‌హౌస్


కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద నిర్మాణంలో విద్యుత్ సబ్‌స్టేషన్

ఆస్ట్రియా నుంచి పంపులు

ఎత్తిపోతల ప్రాజెక్టులో దేశంలోనే తెలంగాణ అడ్వాన్స్ స్టేజీలో ఉంది. ఇప్పటివరకు తెలంగాణలోని జే చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌లో దేశంలో పెద్దది. ఈ ప్రాజెక్టులోనే అతిపెద్ద పంప్‌హౌస్‌లు, ఎక్కువ సామర్థ్యం కలిగిన పంపులు ఉన్నాయి. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుతో 'దేవాదుల' రికార్డును తెలంగాణ ప్రభుత్వం తిరగరాస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి, అన్నారం పంప్‌హౌస్‌ల్లో అమర్చే పంపులను రాష్ట్ర ప్రభుత్వం ఆస్ట్రియా నుంచి తెప్పిస్తున్నది. ఇప్పటికే సాగునీటి శాఖ ఇంజినీర్లు ఆస్ట్రియా వెళ్లి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ కోసం తేవాల్సిన పంపులను పరిశీలించి వచ్చారు. కొత్త టెక్నాలజీతో కూడిన మెటాలిక్ ఒల్యూట్ పంపులను ఆస్ట్రియా నుంచి షిప్పింగ్ ద్వారా విడుతల వారీగా తెచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. వీటన్నింటిని కూడా జూన్‌లోగా పంపుహౌస్‌ల్లో అమర్చుతారు. ఏప్రిల్ నుంచి ఈ పంప్‌హౌస్‌లో దశల వారీగా పంప్‌లను అమర్చే పనులు ప్రారంభం కానున్నాయి.

ఉద్యమంలా చెరువుల పునరుద్ధరణ

- రిజర్వాయర్లతో బీడు భూములు సస్యశ్యామలం
- భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేట జిల్లా గట్లమల్యాలలో ఎంకే-4 పనులు ప్రారంభం

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సమైక్య రాష్ట్రంలో ఆనవాళ్లు కోల్పోయిన చెరువులకు స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో మిషన్ కాకతీయ ద్వారా పూర్వ వైభవం తీసుకువచ్చామని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఇందుకుగాను చెరువుల పునరుద్ధరణను ఓ ఉద్యమంలా చేపట్టినట్టు తెలిపారు. మూడు విడుతలను పూర్తిచేసుకొని నాల్గో విడుతకు సంబంధించి ఆయా జిల్లాలకు నిధులు మంజూరు చేశామన్నారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాలలో ఎంకే-4 కింద రూ.1.72 కోట్లతో చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. అంతకుముందు ఎన్సాన్‌పల్లి నుంచి కోమటి చెరువులోకి వచ్చే కట్టు కాల్వ, మిట్టపల్లి వద్ద రాజగోపాల్‌పేట ఫీడర్ చానల్ సీసీ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కరువుతో అల్లాడుతున్న సిద్దిపేట జిల్లాకు ఓవైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు, మరో వైపు గౌరవెల్లి, గండిపెల్లి రిజర్వాయర్ నుంచి నీళ్లు వస్తాయని దీంతో నంగునూరు మండలం సస్యశ్యామలం కానున్నదన్నారు.

నాడు కేసీఆర్ శ్రమదానం చేసిన రోడ్డు ఇది..

కేసీఆర్ సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నెలరోజులపాటు గట్లమల్యాలలోనే ఉండి శ్రమదానం చేసి రోడ్డు నిర్మాణం చేపట్టారని మంత్రి హరీశ్‌రావు గుర్తుచేశారు. సీఎం కేసీఆర్‌కు గట్లమల్యాల అంటే అమితమైన ప్రేమ అని.. లక్ష్మిగల గ్రామం గట్లమల్యాల అని కొనియాడారు. తాను కూడా ప్రతి పండుగకు ఈ గ్రామానికి వస్తున్నానని చెప్పారు. సిద్దిపేట జిల్లాను పారిశ్రామిక రంగంలో అభివృద్ధి పరచడానికి ప్రత్యేక చొరువ తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. మిట్టపల్లి, మందపల్లి శివారుల్లో 300 ఎకరాల్లో వ్యవసాయాధారిత పరిశ్రమలు నెలకొల్పనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కలెక్టరేట్ పక్కనే ఐటీ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు.


సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాలలో చిన్న చెరువు, పెద్ద చెరువు పనుల ప్రారంభోత్సవానికి ట్రాక్టర్ నడుపుకుంటూ వెళుతున్న మంత్రి హరీశ్‌రావు

4 కి.మీ. ట్రాక్టర్ నడిపిన మంత్రి

మిషన్ కాకతీయ ఫేజ్-4 పనులను ప్రారంభించడానికి గట్లమల్యాల గ్రామానికి వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. హరీశ్‌రావును చెరువు వద్దకు తీసుకెళ్లేందుకు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. దీంతో మంత్రి స్వయంగా నాలుగు కిలోమీటర్లు ట్రాక్టర్ నడుపుతూ చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి కట్ట పొడవునా కిలో మీటరు మేర నడిచి వెళ్లి కట్టమైసమ్మకు పూజలు చేసి చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా సాగునీటి పారుదల శాఖ ఎస్‌ఈ పద్మారావు, ఈఈ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సదగోడులో గ్రామస్థుల సమక్షంలో పంచాంగ పఠనం చేస్తున్న మహ్మద్ జైనుల్లా

మహ్మద్ జైనుల్లా పంచాంగ పఠనం

నాగర్‌కర్నూల్ జిల్లా సదగోడులో 16ఏండ్లుగా..

ఉప్పునుంతల: నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం సదగోడు గ్రామానికి చెందిన 96ఏండ్ల ముస్లిం మహ్మద్ జైనుల్లా 16ఏండ్లుగా పంచాంగ పఠనం చేస్తున్నారు. ఏటా ఉగాది రోజు గ్రామస్థుల సమక్షంలో పంచాంగం చదువుతున్నారు. తెలుగు, సంస్కృతం, హిందీ, అరబీ, ఉర్దూ భాషల్లో అనర్గళంగా మాట్లాడే ఆయన, మతాలు వేరైనా దైవ సారాంశం ఒక్కటేనని హితబోధ చేస్తున్నారు. ఉగాది సందర్భంగా ఆదివారం గ్రామస్థులు అతని వద్ద పంచాంగం చూపించుకున్నారు. అనంతరం అతడిని సత్కరించారు.

ఎడ్లబండ్ల ప్రదర్శనలో అపశ్రుతి

ఒకరి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు

దోమకొండ: కామారెడ్డి జిల్లా దోమకొండలో ఉగాదిని పురస్కరించుకొని నిర్వహించిన ఎడ్లబండ్ల ప్రదర్శనలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఓ ఎడ్లబండి ప్రజలపైకి దూసుకు రావడంతో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. దోమకొండలోని శివరాంమందిర్ వద్ద ఆదివారం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఓ ఎడ్లబండి అదుపుతప్పి ప్రజలపైకి దూసుకురాగా, బోరెడ్డి బాల్‌రెడ్డి(46) కిందపడిపోవడంతో తలపై నుంచి బండి చక్రం వెళ్లింది. వెంటనే దవాఖానకు తరలించగా మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఇదే ఘటనలో నర్రాగుల భూపతి, నర్రాగుల అనోజల చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. పోచయ్య నడుముపై నుంచి చక్రాలు పోవడంతో పరిస్థితి విషమంగా ఉంది. వీరిని కామారెడ్డి దవాఖానకు తరలించారు.

న్యూడెమోక్రసీ అజ్ఞాత దళసభ్యుడి అరెస్ట్

కొత్తగూడెం క్రైం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో శనివారం సాయంత్రం జరిగిన ఎదురుకాల్పుల ఘటనలో న్యూడెమోక్రసీ అజ్ఞాత దళసభ్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం ఎస్పీ అంబర్ కిషోర్‌ఝా వెల్లడించిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం ఉల్వనూరు అటవీ ప్రాంతంలో సాయుధ దళ సభ్యులు సంచరిస్తున్నట్టు సమాచారం అందగా పాల్వంచ టౌన్ ఎస్సై ముత్యం రమేశ్ స్పెషల్ పార్టీ సిబ్బందితో వెళ్లి చిరుతనపాడులో కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో ఆరుగురు కనిపించగా లొంగిపోవాలని కోరగా, కాల్పులు జరిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు ఎదురుకాల్పులకు దిగారు. పారిపోయేందుకు యత్నించగా పోలీసులు వెంబడించి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఇతడిని విచారించి అశ్వాపురం మండలం గోందిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసి మడివి భీమగా గుర్తించారు. అతని వద్ద నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు.

పాలేరు నవోదయలో ఘర్షణ

12 మంది తెలుగు విద్యార్థులపై తాత్కాలిక చర్యలు

కూసుమంచి, నమస్తే తెలంగాణ: ఖమ్మం జిల్లా పాలేరు జవహర్ నవోదయ విద్యాలయంలో బీహార్, తెలుగు విద్యార్థులకు మధ్య రెండు రోజులుగా ఘర్షణ జరుగుతుండగా, శనివారం పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఆదివారం తెలుగు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి తాత్కాలికంగా 12మందిని ఇంటికి పంపిస్తామని చెప్పడంతో ఉద్రిక్తత పెరిగింది. తెలుగు విద్యార్థులకు మద్దతుగా 100మంది విద్యార్థులు తాము బయటకు వెళ్తామని పట్టుబట్టగా, ప్రిన్సిపాల్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ ఘటనకు నిరసనగా బీహార్ విద్యార్థులు భోజనాలు మానేయగా, ఎస్సై రఘు తెలుగు విద్యార్థుల తల్లిదండ్రులను తాత్కాలిక చర్యలకు ఒప్పించారు. తెలుగు విద్యార్థులను ఇండ్లకు పంపినట్లు చెప్పగా, బీహార్ విద్యార్థులు శాంతించారు.


మెదక్‌లో ఆదివారం టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి


నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

గులాబీ పార్టీలోకి వలసలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లో పలు పార్టీల నుంచి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఆదివారం నిజామాబాద్ జిల్లా వర్ని మండలం గోవూర్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 50మంది బాన్సువాడలోని మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. మెదక్ జిల్లా మెదక్ మండలం బొగడ భూపతిపూర్, శాలిపేట గ్రామాలకు చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు 200 మంది బైక్ ర్యాలీగా మెదక్‌కు వచ్చి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామాభివృద్ధి కమిటీ(వీడీసీ) సభ్యులు 50మంది నిజామాబాద్‌లో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం నామాలపాడు, చర్లపల్లి, బండ్లకుంట గ్రామాలకు చెందిన సుమారు 500మంది గిరిజనులు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరగా, ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఫైనల్లో ఫెదరర్



ఇండియన్ వేల్స్: ప్రపంచ నంబర్ వన్ టెన్నిస్ ఆటగాడు రోజర్ ఫెదరర్.. ఇండియన్ వేల్స్ మాస్టర్స్ టోర్నీలో ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నాడు. శనివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ సెమీస్‌లో టాప్‌సీడ్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) 5-7, 6-4, 6-4తో బోర్నా కోరిక్ (క్రొయేషియా)పై గెలిచాడు. దీంతో ఈ సీజన్‌లో 17వ విజయాన్ని ఖాతాలో వేసుకుని కెరీర్ బెస్ట్ నమోదు చేశాడు. 2006లో సాధించిన 16 విజయాల రికార్డును అధిగమించాడు. సెమీస్ వరకు కనీసం ఒక్క సెట్ కూడా (8-0) కోల్పోని ఫెదరర్.. ఈ మ్యాచ్‌లో మాత్రం తొలిసెట్ చేజార్చుకున్నాడు. రెండో సెట్‌లోనూ 2-4తో వెనుకబడ్డాడు. అయినప్పటికీ పట్టువదలకుండా పోరాడుతూ బలమైన సర్వీస్‌లతో ప్రత్యర్థిని అడ్డుకుని మ్యాచ్‌లో నిలిచాడు. నిర్ణయాత్మక మూడోసెట్‌లోనూ మళ్లీ 4-3తో వెనుకబడ్డా వరుసగా 11 పాయింట్లు నెగ్గి సెట్‌ను మ్యాచ్‌ను చేజిక్కించుకున్నాడు. చివరి పాయింట్ వద్ద కోరిక్ కొట్టిన షాట్ వైడ్‌గా వెళ్లడంతో చిరస్మరణీయ విజయం సొంతమైంది. మరో సెమీస్‌లో డెల్‌పోట్రో (అర్జెంటీనా) 6-2, 6-3తో మిలోస్ రావోనిక్ (కెనడా)పై నెగ్గి.. ఫెదరర్‌తో టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు.

ఏ+ క్యాటగిరీ సృష్టికర్తలు
ధోనీ, విరాట్: రాయ్



న్యూఢిల్లీ: సెంట్రల్ కాంట్రాక్ట్‌లో ఏ+ క్యాటగిరీని మాజీ, ప్రస్తుత కెప్టెన్లు ధోనీ, విరాట్ కోహ్లీయే ప్రతిపాదించారని బీసీసీఐ పరిపాలన కమిటీ (సీవోఏ) చీఫ్ వినోద్ రాయ్ తెలిపారు. ఇందులో ఎవరి చోటు సుస్థిరం కాదని, అత్యుత్తమ ప్రదర్శన చూపిన వారికి కచ్చితంగా స్థానం ఉంటుందన్నారు. 'ఆటగాళ్లే ఈ క్యాటగిరీని ప్రతిపాదించారు. దీని గురించి ధోనీ, కోహ్లీతో మాట్లాడాం. ప్రపంచస్థాయి నైపుణ్యంతో పాటు మూడు ఫార్మాట్లలో ఆడే వారికి సముచిత గౌరవం ఇవ్వాలని వారు కోరారు. ఇది స్థిరమైన క్యాటగిరీ కాదు. ఇందులోకి ఎవరైనా రావొచ్చు, పోవచ్చు. ఓ రకంగా చెప్పాలంటే మంచి నైపుణ్యం చూపేవారికి ఇది రివార్డులాంటిది' అని రాయ్ పేర్కొన్నారు. విరాట్, ధోనీ మధ్య అద్భుతమైన సమన్వయం, పరస్పర గౌరవం ఉందన్నారు. 'ఇప్పటికిప్పుడు ధోనీ స్థానాన్ని భర్తీ చేసే కీపర్ లేడని కోహ్లీ అభిప్రాయం. దీనికితోడు మహీకి ఉన్న అనుభవం వెలకట్టలేనిది. జట్టుకు ఇది గొప్ప ఆస్థిలాంటిది. ఎంఎస్ ఇంకెన్నాళ్లు క్రికెట్ ఆడుతాడో కాలం, అతని ప్రదర్శన నిర్ణయిస్తుంది. ఇక దేశవాళీ క్రికెటర్లకు పెద్ద మొత్తంలో లాభం చేకూరుతున్నది. కొత్త విధానం ప్రకారం ఏడాదికి రూ. 20, 22 లక్షలు అందుకుంటారు. అదనంగా మరికొన్ని ప్రయోజనాలు ఉంటాయి. ఇతర ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా కేవలం ఈ వేతనాలతోనే ఆటపై బాగా దృష్టిపెట్టేందుకు దోహదపడుతుంది' అని రాయ్ వెల్లడించారు. సెంట్రల్ కాంట్రాక్ట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్నీ ఆఫీస్ బేరర్ల ముందు ఉంచామని స్పష్టం చేశారు. అందరి ఆమోదం మేరకు తుది నిర్ణయం తీసుకున్నామన్నారు.

వందశాతం సత్తా చాటినా..
ఆల్ ఇంగ్లండ్ ఓటమిపై సింధు



బర్మింగ్‌హామ్: ఆల్‌ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ సెమీస్‌లో వందశాతం సత్తా చాటినా ఫలితం వ్యతిరేకంగా వచ్చిందని భారత స్టార్ షట్లర్ పీవీ సింధు వెల్లడించింది. రాబోయే రోజుల్లో మరింత బలంగా తిరిగొస్తానని ఆశాభావం వ్యక్తం చేసింది. 'ఈ రోజు నాది కాదు. నేను వంద శాతం కష్టపడ్డా. గెలుపోటముల్లో ఎత్తుపల్లాలు అనేది చాలా సహజం. సుదీర్ఘమైన ర్యాలీలు ఆడాం. అంతకుమించి యమగుచి బాగా పోరాడింది. మూడు గేమ్‌లు ఆడటమంటే మాటలు కాదు. రెండు మూడు పాయింట్లే మ్యాచ్ చివర్లో చాలా పెద్ద తేడాను తీసుకొస్తాయి. ఎవరి గేమ్‌లోనైనా ఇది జరుగుతుంది. ఈ టోర్నీ నుంచి నేను చాలా విషయాలు నేర్చుకోవాల్సి ఉంది. ఓడినా గెలిచినా ఇది నాకు పెద్ద గుణపాఠం. దీని నుంచి మరింత నేర్చుకుని బలంగా తయారవుతా' అని సింధు పేర్కొంది. దూకుడుగా ఆడటం వల్లే తనకు విజయం లభించిందని జపాన్ అమ్మాయి అకానే యమగుచి తెలిపింది.



ఆల్ ఇంగ్లండ్ చాంపియన్ తైజు

ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ మహిళల టైటిల్‌ను ప్రపంచ నంబర్‌వన్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్‌సీడ్ తై జు 22-20, 21-13తో రెండోసీడ్ అకానే యమగుచి (జపాన్)పై గెలిచింది. పురుషుల విభాగంలో ఏడోసీడ్ షీ యుకీ (చైనా) 21-19, 16-21, 21-9తో లిన్ డాన్ (చైనా)పై గెలిచాడు.



దినేశ్ ధమాకా

ఆఖరి బంతికి సిక్స్ కొట్టి గెలిపించిన కార్తీక్
ఫైనల్‌లో బంగ్లాపై భారత్ గెలుపు



దినేశ్ (29*)

నరాలు తెగే ఉత్కంఠ..ఒకప్పుడు భారత్, పాకిస్థాన్ ఆడుతుంటే ఏ స్థాయిలో టెన్షన్ ఉండేదో..బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అంతకు మించిన ఉత్కంఠ. భారత్ విజయానికి ఆఖరి బంతికి ఐదు పరుగులు సాధించాలి. సిక్సర్ కొడితేనే గెలుపు..ఈ సమయంలో స్ట్రైకింగ్‌లో ఉన్న దినేశ్ కార్తీక్ పైనే అందరి కండ్లు. బంగ్లా బౌలర్ సౌమ్య సర్కార్ కాసింత నమ్మకంతోనే కనిపించాడు. బంతిని సంధించాడో లేదో దినేశ్ కొట్టిన షాట్‌కు బంతి ఫీల్డర్ల మీదుగా వెళ్లి బౌండరీ అవతల పడింది. బంగ్లా ఆటగాళ్లకు మాత్రం ఏం జరిగిందో తెలియని స్థితిలోనే ఉండిపోయారు. భారత డ్రెస్సింగ్‌రూమ్‌లో కేరింతలతో స్టేడియం దద్దరిల్లిపోయింది..భారత క్రికెటర్లు గ్రౌండ్‌లోకి దూసుకొచ్చి దినేశ్‌కు తమదైన స్టైల్లో అభినందనలు తెలిపారు. ఆఖరి బంతికి సిక్సర్ బాదిన దినేశ్ కార్తీక్ టోర్నీకే హీరోగా నిలిచాడు.

కొలంబో: ధనాధన్ ఆటలో తమకు తిరుగులేదని నిరూపిస్తూ రోహిత్‌సేన నిదహస్ ట్రోఫీని గెలుచుకున్నది. ముక్కోణపు టోర్నీలో భాగంగా బంగ్లాదేశ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో విజయభేరి మోగించింది. బంగ్లాదేశ్ విసిరిన 167 పరుగుల లక్ష్యాన్ని ఉత్కంఠ నడుమ చివరి బంతికి ఛేదించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దినేశ్ కార్తీక్ (29 నాటౌట్; 8 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపులు, కెప్టెన్ రోహిత్‌శర్మ (56) అర్ధసెంచరీతో భారత విజయంలో కీలకపాత్ర పోషించారు.టోర్నీలో 8 వికెట్లు పడగొట్టిన వాషింగ్టన్ సుందర్‌కు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డు దక్కింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్‌ను భారత స్పిన్నర్లు చహల్ (3/18), సుందర్ (1/20) ఆదిలోనే కోలుకోలేని దెబ్బతీయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. టాపార్డర్ విఫలమైనప్పటికీ సబ్బీర్ (77) దూకుడుగా ఆడగా, మహ్మదుల్లా (21) ఫరవాలేదనిపించాడు.

ఆఖర్లో హైడ్రామా

భారత్ విజయానికి 3 ఓవర్లలో 35 పరుగులు అవసరం. ముస్తఫిజుర్ బౌలింగ్ వేయగా స్ట్రైకింగ్‌లో ఉన్న విజయ్‌శంకర్ వరుసగా నాలుగు బంతులు బీట్ అయ్యాడు. ఐదో బంతికి లెగ్ బై రూపంలో సింగిల్ తీసి మనీశ్‌కు స్ట్రైకింగ్ అప్పగించాడు. అయితే అప్పటికే ఒత్తిడి ఎక్కువవడంతో మనీశ్ భారీ షాట్‌కు ప్రయత్నించి అవుట్ అయ్యాడు. దీంతో భారత్ విజయ సమీకరణం 12 బంతుల్లో 34 పరుగులుగా మారింది.

దినేశ్ ద హీరో

మనీశ్ పెవిలియన్ చేరడంతో క్రీజులోకి వచ్చిన దినేశ్ కార్తీక్ మ్యాచ్‌ను భారత్ వశం చేశాడు. 8 బంతుల్లో 29 పరుగులు సాధించి దుమ్మురేపాడు. 19వ ఓవర్‌లో ఎదుర్కొన్న తొలి బంతికే సిక్సర్, ఆ మరుసటి బంతికే ఫోర్, ఆ తర్వాతి బాల్‌కు సిక్సర్ బాది భారత శిబిరంలో ఉత్సాహం నింపాడు. ఇదే ఓవర్ చివరి బంతికీ ఫోర్ కొట్టి భారత్‌ను లక్ష్యానికి మరింత చేరువ చేశాడు. ఆఖరి ఓవర్‌లో విజయానికి 12 పరుగులు సర్కార్ తొలి బంతిని వైడ్‌గా వేశాడు. ఆ తర్వాత రెండు బంతులకు రెండు పరుగులే వచ్చాయి. దీంతో విజయ సమీకరణం 4 బంతుల్లో 10కి మారింది. దినేశ్ సింగిల్ తీయడంతో శంకర్ స్ట్రైకింగ్‌కు వచ్చాడు. అప్పటికే వరుసగా బంతులు బీట్ అయిన శంకర్‌పై ఎవరికీ నమ్మకం లేదు.మ్యాచ్‌లో ఓటమి ఖాయమే అనుకున్నారు. కానీ శంకర్ ఫోర్ కొట్టి మళ్లీ ఆశలు రేకెత్తించాడు. ఆ తర్వాతి బంతికే ఇతడు అవుటవడంతో మళ్లీ మ్యాచ్ బంగ్లాదేశ్ వైపు మళ్లింది..ఒక్క బంతికి ఐదు పరుగులు సాధించాల్సిన సమయంలో దినేశ్ కార్తీక్ సిక్సర్ బాది మ్యాచ్‌ను గెలిపించాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో రుబెల్‌కు 2 వికెట్లు దక్కాయి.

కెప్టెన్ ఇన్నింగ్స్



రోహిత్ (56)

167 పరుగుల లక్ష్య ఛేదనలో భారత కెప్టెన్ రోహిత్‌శర్మ స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్ ఆడాడు. ఫాంలో ఉన్న ధవన్ విఫలమైనప్పటికీ స్కోరు బోర్డును ముందుకు నడిపాడు. బంగ్లా కెప్టెన్ షకిబ్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ వేయగా..రోహిత్ బౌండరీతో స్వాగతం పలికాడు. అదే జోరుతో మిరాజ్ వేసిన రెండో ఓవర్‌లో వరుస మూడు బంతుల్లో 6 4 6 బాది అతడి లెక్క సరిచేశాడు. ఈ ఓవర్‌లో భారత్ 17 పరుగులు పిండుకున్నది.మరో ఎండ్‌లో ధవన్ (10) షకిబ్ బౌలింగ్‌లో అవుటవడంతో భారత్ 32 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత రైనా డకౌట్ అయ్యాడు. రోహిత్‌కు రాహుల్ జత కలిశాడు. నజ్ముల్ వేసిన ఇన్నింగ్స్ ఐదో ఓవర్‌లో రోహిత్ ఫోర్, సిక్సర్ బాది దూకుడు కొనసాగించాడు. ఒక దశలో 16 బంతుల్లో 32 పరుగులు చేసిన ఈ ముంబైకర్, రాహుల్ (24)కూడా అవుటవడంతో నెమ్మదించాడు. ఈ క్రమంలోనే 35 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టీ20ల్లో రోహిత్‌కు ఇది 14వ హాఫ్ సెంచరీ, కాగా బంగ్లాదేశ్‌పై నాలుగోది. అయితే తన హాఫ్ సెంచరీకి మరో 6 పరుగులు జోడించిన రోహిత్ నజ్ముల్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగ్ ఆన్‌లో మహ్మదుల్లా చేతికి చిక్కాడు.

చహల్ దెబ్బ

ఓపెనర్లు తమీమ్, లిట్టన్ దాస్ ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించినా..చహల్ తన స్పిన్ మ్యాజిక్‌తో టాపార్డర్‌ను కూల్చాడు. బంగ్లాదేశ్ తొలి పవర్ ప్లేలో మూడు వికెట్లు కోల్పోయి 40 పరగులు చేసింది. జైదేవ్‌లో బౌలింగ్‌లో తమీమ్ ఒక ఫోర్, దాస్ ఒక సిక్సర్ బాది కుదురుకునే ప్రయత్నం చేశారు. మూడు ఓవర్లలో తొలి వికెట్‌కు 26 పరుగులు జోడించిన అనంతరం దాస్ (11)ను వాషింగ్టన్ సుందర్ అవుట్ చేయగా..చహల్ ఒకే ఓవర్‌లో తమీమ్ (15), సర్కార్ (1)ను ఔట్ చేసి బంగ్లాను ఘోరంగా దెబ్బతీశాడు. చహల్ బౌలింగ్‌లో తమీమ్ భారీ షాట్ కొట్టగా బౌండరీలైన్ దగ్గర శార్దూల్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో ఔట్ అయ్యాడు. సర్కార్ అనవసర షాట్‌కు ప్రయత్నించి ధవన్ చేతికి చిక్కాడు. ఆ తర్వాత షబ్బీర్, ముష్ఫికర్ కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ఈ క్రమంలో యువ పేసర్ విజయ్‌శంకర్ వేసిన ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో షబ్బీర్ వరుసగా సిక్స్, ఫోర్ కొట్టి స్కోరు వేగాన్ని పెంచాడు. ఈ ఓవర్‌లో బంగ్లా 14 పరుగులు పిండుకున్నది.

సబ్బీర్ దూకుడు

ఒకవైపు వికెట్లు పడుతున్నా సబ్బీర్ రహ్మాన్ మాత్రం దూకుడు కొనసాగిస్తూ బంగ్లాదేశ్ స్కోర్ బోర్డును ముందుకు నడిపాడు. సుందర్ వేసిన ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో భారీ సిక్సర్, ఒక సింగిల్‌తో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. సబ్బీర్‌కు టీ20ల్లో ఇది నాలుగో హాఫ్ సెంచరీ. మరో ఎండ్‌లో మహ్మదుల్లా, షకిబ్ (7) స్వల్ప వ్యవధిలో రనౌట్లు అయినప్పటికీ సబ్బీర్ మాత్రం బౌండరీలతో విరుచుకుపడ్డాడు. శంకర్ బౌలింగ్‌లో రెండు భారీ సిక్సర్లు, ఆ తర్వాత శార్దూల్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు బాది స్కోరు వేగాన్ని పెంచాడు. జైదేవ్ ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో స్లో బాల్‌తో సబ్బీర్‌ను క్లీన్‌బౌల్డ్ చేశాడు.మెహిదీ హసన్ మిరాజ్ (19 నాటౌట్; 7 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్) మెరుపులు మెరిపించడంతో సముచిత స్కోరు సాధించింది. భారత బౌలర్లలో చహల్‌కు 3 వికెట్లు పడగొట్టగా, జైదేవ్‌కు 2, సుందర్‌కు ఒక వికెట్ దక్కింది.

స్కోర్ బోర్డు

బంగ్లాదేశ్: తమిమ్ (సి) శార్దూల్ (బి) చహల్ 15, దాస్ (సి) రైనా (బి) సుందర్ 11, సబ్బీర్ (బి) జైదేవ్ 77, సర్కార్ (సి) ధవన్ (బి) చహల్ 1, ముష్ఫికర్ (సి) శంకర్ (బి) చహల్ 9, మహ్మదుల్లా రనౌట్ 21, షకిబ్ రనౌట్ 7, మిరాజ్ నాటౌట్ 19, రుబెల్ (బి) జైదేవ్ 0, ముస్తఫిజుర్ నాటౌట్ 0, **ఎక్స్‌ట్రాలు:** 6, **మొత్తం** 20 ఓవర్లలో 166/8. **వికెట్లు:** 1-27, 2-27, 3-33, 4-68, 5-104, 6-133, 7-147, 8-148. **బౌలింగ్:** జైదేవ్ 4-0-33-2, సుందర్ 4-0-20-1, చహల్ 4-0-18-3, శార్దూల్ 4-0-45-0, శంకర్ 4-0-48-0.

భారత్: రోహిత్ (సి) మహ్మదుల్లా (బి) నజ్ముల్ 56, ధవన్ (సి) సబ్(అరిఫుల్) (బి) షకిబ్ 10, రైనా (సి) ముష్ఫికర్ (బి) రుబెల్ 0, రాహుల్ (సి) సబ్బీర్ (బి) రుబెల్ 24, మనీశ్ (సి) సబ్బీర్ (బి) ముస్తఫిజుర్ 28, శంకర్ (సి) మిరాజ్ (బి) సర్కార్, దినేశ్ నాటౌట్ 29, సుందర్ 0 నాటౌట్. **ఎక్స్‌ట్రాలు:** 4 **మొత్తం** 20 ఓవర్లలో 168/6. **వికెట్లు:** 1-32, 2-32, 3-83, 4-98, 5-133, 6-162. **బౌలింగ్:** షకిబ్ 4-0-28-1, మిరాజ్ 1-0-17-0, రుబెల్ 4-0-35-2, నజ్ముల్ 4-0-32-1, ముస్తఫిజుర్ 4-1-21-1, సర్కార్ 3-0-33-1.

ఇరానీ కప్ విజేత విదర్భ



నాగ్‌పూర్: విదర్భ జట్టు ఖాతాలో మరో టైటిల్ చేరింది. ఈ సీజన్‌లో సమిష్టి ప్రదర్శనతో అదురగొడుతున్న ఫయాజ్ ఫజల్ కెప్టెన్సీలోని విదర్భ తాజాగా ఇరానీకప్‌లో విజేతగా నిలిచింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం(404) ఆధారంగా విదర్భను టైటిల్ వరించింది. 236/6 ఓవర్‌నైట్ స్కోరుతో ఆఖరి రోజు ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన రెస్టాఫ్ ఇండియా(ఆర్‌వోఏ) 390 పరుగులకు ఆలౌటైంది. హనుమ విహారీ(327 బంతుల్లో 183, 23ఫోర్లు, 3సిక్స్‌లు) సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. సహచరులు విఫలమైన చోట విదర్భ పాలిట సింహస్వప్నంలా నిలుస్తూ పరుగులు కొల్లగొట్టాడు. తన ఇన్నింగ్స్‌లో 23 ఫోర్లు, 3 సిక్స్‌లతో అలరించిన విహారీ..ఏడో వికెట్‌కు జయంత్ యాదవ్(96)తో కలిసి 216 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఈ జోడీని విడగొట్టేందుకు విదర్భ కెప్టెన్ ప్రయత్నించినా లాభం లేకపోయింది. ఆఖరికి ఆదిత్య సర్వతే(3/97)బౌలింగ్‌లో స్టంప్‌ఔట్‌గా వెనుదిరిగాడు. ఇక్కణ్నుంచి ఏ ఒక్కరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. రజ్‌నీశ్ గుర్బానీ(4/70) నాలుగు వికెట్లతో రాణించాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌కు దిగిన విదర్భ వికెట్ నష్టపోకుండా 79 పరుగులు చేసింది. అక్షయ్ వాడ్కర్(50 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. డబుల్ సెంచరీతో విదర్భకు రికార్డు స్కోరు కట్టబెట్టిన వసీం జాఫర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

బెంగళూరు కంపెనీపై ద్రవిడ్ కేసు



బెంగళూరు: తాను రూ.4 కోట్ల మేర మోసపోయానంటూ బెంగళూరుకు చెందిన విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీపై భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ కేసు వేశాడు. రెండు రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ద్రవిడ్ ఫిర్యాదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ నవీన్ ఆదివారం పేర్కొన్నాడు. వివరాల్లోకెళితే 2014లో కంపెనీ తీసుకొచ్చిన పోంజీ పథకంలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ కంపెనీ ప్రముఖ క్రీడాకారులతో పాటు సెలెబ్రెటీలను మోసం చేసింది. ఇందులో రూ.20 కోట్లు పెట్టుబడి పెడితే ఇప్పటి వరకు 16 కోట్లు తిరిగి రాగా, 4 కోట్లు ఎగ్గొట్టిందని ద్రవిడ్ తాజాగా పోలీసులను ఆశ్రయించాడు. కంపెనీ యాజమాని రాఘవేంద్ర శ్రీనాథ్, సురేశ్, నరసింహమూర్తి, నాగరాజ్, ప్రహ్లాద్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. పోంజీలో పెట్టుబడి పెటి మోసపోయిన వారిలో ద్రవిడ్‌తో పాటు సైనా నెహ్వాల్, ప్రకాశ్ పదుకోన్ ఉన్నారు.

మిథాలీసేనకు మరో ఓటమి
3-0తో సిరీస్ ఆసీస్ కైవసం

వడోదర: మూడు వన్డేల సిరీస్‌లో మిథాలీసేన హ్యాట్రిక్ పరాజయం ఎదుర్కొంది. ఆదివారం ఆస్ట్రేలియాతో ఆఖరి వన్డేలో టీమ్‌ఇండియా 97 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. కంగారూలు నిర్దేశించిన 333 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ 44.4 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు స్మృతి మందన(52), జెమీమా రోడ్రిగెజ్(42) భారత్‌కు మెరుగైన శుభారంభం అందించారు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. లక్ష్యం వైపు సాఫీగా సాగుతున్న టీమ్‌ఇండియాను గార్డ్నర్(3/39)కు తోడు ఎలీస్ పెర్రీ(2/40), మేగన్ స్కట్(2/54) దెబ్బతీశారు. ఆఖర్లో సుష్మా వర్మ(30) పోరాడినా లాభం లేకపోయింది. తొలుత అలీస్సా హీలీ(133) సూపర్ సెంచరీతో ఆసీస్ నిర్ణీత 50 ఓవర్లలో 332/7 స్కోరు చేసింది. తన ఇన్నింగ్స్‌లో 17ఫోర్లు, 2సిక్స్‌లతో రాణించిన హీలీ మెరుగైన భాగస్వామ్యాలతో జట్టు భారీ స్కోరులో కీలకమైంది. హర్మన్‌ప్రీత్‌కౌర్(2/51) రెండు వికెట్లు తీసింది. సెంచరీతో రాణించిన హీలీకి 'వుమన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.



సఫారీ జట్టులో మోరిస్, ఒలివర్

కేప్‌టౌన్: ఆస్ట్రేలియాతో గురువారం నుంచి జరిగే మూడో టెస్టు కోసం 17 మంది కూడిన దక్షిణాఫ్రికా జట్టును ప్రకటించారు. ముందు జాగ్రత్త చర్యగా నిషేధం ఎదుర్కొంటున్న పేసర్ కగిసో రబాడతో పాటు క్రిస్ మోరిస్, డున్నె ఒలివర్‌ను జట్టులోకి తీసుకున్నారు. రెండు మ్యాచ్‌ల నిషేధం ఎదుర్కొంటున్న రబాడపై న్యూజిలాండ్ జ్యూడిషియల్ కమిషనర్ మైకెల్ హెరాన్ సోమవారం విచారణ జరుపనున్నారు. 48 గంటల్లో తుది నివేదిక ఇవ్వనున్న నేపథ్యంలో ఒకవేళ రబాడపై నిషేధం కొనసాగితే మోరిస్, ఒలివర్‌లలో ఒకరు తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది.

మొహాలీలో మూడు, ఇండోర్‌లో నాలుగు

న్యూఢిల్లీ: ఐపీఎల్-11లో సొంతగడ్డపై కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఆడే మ్యాచ్‌ల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. మరమ్మత్తుల కారణంగా మే 12 నుంచి 31 వరకు చండీగఢ్ విమానాశ్రయం మూసివేస్తున్న సందర్భంగా హోమ్ మ్యాచ్‌లను ఇతర వేదికలకు కేటాయించారు. దీంతో పంజాబ్ తన హోమ్ మ్యాచ్‌ల్లో మూడింటిని మొహాలీ (ఏప్రిల్ 15, 19, 23)లో, నాలుగు ఇండోర్ (మే 4, 6, 12, 14)లో ఆడుతుందని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ తెలిపింది.



ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు శాలువా కప్పి సత్కరిస్తున్న టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు

భారత్-అమెరికా ద్వైపాక్షిక చర్చలు వాయిదా

- టిల్లర్‌సన్ తొలిగింపుతో కుంటుపడిన చర్చలు
- గత జూలై నుంచి వాయిదా పడుతున్న చర్చలు

న్యూఢిల్లీ: భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక చర్చలు వాయిదా పడ్డాయి. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియరాలేదు. ఒకే సారి విదేశాంగ, రక్షణ శాఖ మంత్రులతో చర్చలు జరిపేందుకు ఇరు దేశాలు నిర్ణయించాయి. అయితే రక్షణమంత్రి పదవి నుంచి రెక్స్ టిల్లర్‌సన్‌ను తొలిగించి మైక్ పోంపియోను నియమించిన తర్వాత చర్చలపై ప్రతిష్ఠంభన నెలకొన్నది. గత ఏడాది అమెరికా పర్యటనలో డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమైనప్పుడు ఇరు దేశాల విదేశీ, రక్షణ మంత్రుల ద్వైపాక్షిక చర్చలు ఏప్రిల్18, 19 తేదీల్లో జరుపాలని నిర్ణయానికి వచ్చారు. అయితే అమెరికా రక్షణ మంత్రిగా ఇటీవలే నియమితులైన మైక్ పోంపియోకు సెనెట్ నుంచి ఆమోదం లభించకపోవడం వల్ల చర్చలను వాయిదా వేసినట్టు తెలుస్తున్నది. ద్వైపాక్షిక చర్చల్లో తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఇదివరకే అమెరికా విదేశీ, రక్షణశాఖ ఉన్నతాధికారులతో భారత అధికారులు ఒక దఫా చర్చలు జరిపారు. భారత అధికారులు అమెరికా చేరుకున్న సమయానికి టిల్లర్‌సన్ తొలిగింపు, పోంపియో నియామకం చకచకా జరిగిపోయాయి. అయినప్పటికీ అమెరికా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికారులు, పెంటగాన్ అధికారులతో భారత్ చర్చలు జరిపింది. కాగా, ఇదివరకు ఒకసారి జూలైలో ద్వైపాక్షిక చర్చలు వాయిదా వేసిన దరిమిలా నవంబర్, డిసెంబర్‌లో కూర్చోవాలనుకున్నారు. అందుకు కూడా సమయం కలిసి రాలేదు. మోదీ తన పర్యటనలో ఈ ఏడాది ఏప్రిల్‌లో చర్చలు జరిపేందుకు మార్గం సుగమం చేసినప్పటికీ, అమెరికా అంతర్గత అంశాల కారణంగా చర్చలు మరోసారి వాయిదా పడ్డాయి.

వ్యవసాయ ఆవిష్కరణలకు ప్రోత్సాహం

- అంతర్జాతీయ సంస్థతో కలిసి టీ-హబ్ పోటీల నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలు చేసిన టీ-హబ్ తాజాగా వ్యవసాయ ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించేందుకు సిద్ధమయింది. ఇందుకోసం నూతన టెక్నాలజీ బ్లాక్‌చైన్ ఆధారంగా అంతర్జాతీయంగా పేరొందిన స్టాన్లీ బ్లాకర్ అండ్ డెకర్ సంస్థతో కలిసి స్టార్టప్‌ల కోసం పోటీలను నిర్వహిస్తున్నది. ఈ నెల 12వ తేదీ నుంచి మొదలైన దరఖాస్తుల స్వీకరణ ఏప్రిల్ 15వ తేదీతో ముగియనున్నది. మే 15న విజేతలను ప్రకటిస్తారు. డిజిటల్ ఫార్మింగ్, ఆఫ్ గ్రిడ్ ఎనర్జీ, మైక్రో ఇరిగేషన్, గ్రిడ్ టైడ్ సోలార్, డిస్ట్రిబ్యూటెడ్ సోలార్ కోల్డ్ స్టోరేజ్, రైతులకు మైక్రో పేమెంట్లు వంటి ఆరు ప్రధాన అంశాల్లో స్టార్టప్‌లకు పోటీలు నిర్వహిస్తారు. సౌరశక్తిని ఉత్తమంగా ఉపయోగించుకోవడం, అధిక వ్యవసాయ ఉత్పత్తి, రైతులకు మెరుగైన ఆదాయం, అత్యుత్తమ జీవనవిధానం కల్పించడం ప్రధాన లక్ష్యంగా ఈ పోటీలు జరుగుతాయి. స్థానిక స్టార్టప్‌లతోపాటు అంతరాతీయంగా ఉన్న స్టార్టప్‌లు కూడా ఈ పోటీకి అర్హులని టీ-హబ్ తెలిపింది. పోటీలో విజేతలకు నగదు బహుమతితోపాటు స్టాన్లీ బ్లాక్ అండ్ డెకర్ సంస్థతో ఒప్పందం, టీ హబ్ మెంటర్లు, పరిశ్రమ నిపుణులు, పెట్టుబడిదారులతో అనుసంధానమయ్యే అవకాశం లభిస్తుంది.

ఆరుకాలమ్‌లతో పాస్‌బుక్‌లు

నాలుగు కంపెనీలకు లెటర్ ఆఫ్ ఇండెంట్ ఇచ్చిన అధికారులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



అత్యంత భద్రతతో కూడిన పట్టాదార్ పాస్‌పుస్తకాలను ఎలాంటి గందరగోళానికి ఆస్కారం లేకుండా భూ యజమానుల హక్కులకు భంగం వాటిల్లకుండా ముద్రించనున్నారు. ఈ మేరకు పట్టాదార్ పాస్‌పుస్తకంలో క్రమసంఖ్యతోపాటు తహసీల్దార్ సంతకం వరకు మొత్తం ఆరుకాలమ్‌లు మాత్రమే ఉండాలని నిర్ణయించారు. పట్టాదార్‌పాస్ పుస్తకం ముద్రణ సమయంలో కేవలం ఐదుకాలమ్‌లు మాత్రమే పూరిస్తారు. ఇందులో క్రమసంఖ్య, భూమి సర్వేనంబర్, ఎంత భూమి ఉందో తెలియజేసే కాలమ్, ఏవిధంగా సంక్రమించిందో తెలియజేసేకాలంతోపాటు భూమి స్వభావం (వ్యవసాయ యోగ్యమైనదా లేదా అని తెలిపే కాలమ్) తహసీల్దార్ డిజిటల్ సంతకం మాత్రమే ముద్రితమవుతాయి. రిమార్కుల కాలమ్ ఉన్నా అందులో ఏ వివరాలను నమోదు చేయరు. పట్టాదార్ పాస్ పుస్తకం జారీ అయిన తర్వాత జరిగే క్రయవిక్రయాలను ఈ రిమార్కుల కాలమ్‌లో ఎంట్రీచేస్తారు. కొత్తగా వస్తున్న ఈ పుస్తకం భూ యాజమాన్య హక్కు పత్రంతోపాటు పట్టాదార్ పాస్‌పుస్తకంగా ముద్రితమవుతున్నది. కోర్ బ్యాంకింగ్ విధానంలో లావాదేవీలు జరుపుకొనే విధంగా ఈ పుస్తకాన్ని రూపొందిస్తున్నారు. గతంలో ఉన్న పట్టాదార్ పాస్ పుస్తకాలకు భిన్నంగా ఈ పాస్‌పుస్తకాలు రానున్నాయి. ముఖ్యంగా గతంలో భూవివాదాలకు కేంద్ర బిందువుగా మారిన అనుభవదారు కాలమ్‌ను కొత్త పుస్తకంలో తీసేశారు. అలాగే గతంలో భూమి శిస్తు వసూలు ఉండటంతో పాస్‌పుస్తకంలో పన్ను కాలమ్ కూడా ఉన్నది. తాజాగా ప్రభుత్వమే రైతులకు పెట్టుబడి పథకం కింద ఎకరానికి ఒక్క పంటకు రూ. నాలుగు వేలు ఇస్తున్నది. ఈ నేపథ్యంలో పన్నుల కాలమ్‌ను కూడా తొలిగించారు. పట్టాదార్ పాస్ పుస్తకాల ముద్రణకు సంబంధించిన టెండర్లను అధికారులు ఫైనల్ చేసినప్పటికీ.. కొన్ని సాంకేతిక కారణాల వల్ల లెటర్ ఆఫ్ ఇండెంట్ ఇవ్వడంలో ఆలస్యం జరిగింది. శనివారం నాలుగు కంపెనీలకు లెటర్ ఆఫ్ ఇండెండ్ ఇచ్చారు. ప్రస్తుతం దాదాపు 50 లక్షల మంది రైతుల సమాచారం అంతా ముద్రణకు సిద్ధంగా ఉన్నదని.. ఈ నాలుగు కంపెనీలకు ముద్రణ పనిని పంచినట్టు తెలిసింది. అర్హత సాధించని కంపెనీల్లో ఇతర రాష్ట్రాలు బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన కంపెనీలు ఉన్నాయని, అందుకే వాటిని తిరస్కరించినట్టు సమాచారం. వర్క్ ఆర్డర్ తీసుకున్న కంపెనీలకు మోడల్ పుస్తకాలను ముద్రించి ఇవ్వాలని అధికారులు ఆదేశించినట్టు సమాచారం.



సుందిళ్ల బరాజ్ పనులను శనివారం రాత్రి 11.15 గంటలకు పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు



బరాజ్‌కు బిగించే గేట్ల తయారీని ఆదివారం ఉదయం పరిశీలిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మే 31కల్లా 'సుందిళ్ల' గేట్లు బిగించాలి

జూన్ చివరినాటికి నీరందించాలి ■ 75 రోజులే డెడ్‌లైన్
నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాలు ■ అర్ధరాత్రి ఆకస్మిక పర్యటన

మంథని, నమస్తే తెలంగాణ/ మంథని రూరల్:

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా సాగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మంథని మండలం సిరిపురంలోని సుందిళ్ల బరాజ్‌ను నీటిపారుదల మంత్రి హరీశ్‌రావు శనివారం అర్ధరాత్రి వేళ ఆకస్మికంగా సందర్శించారు. ఎలాంటి హంగూ.. ఆర్భాటాలు లేకుండా.. ఎవరికీ సమాచారం ఇవ్వకుండానే నేరుగా పని ప్రదేశానికి వెళ్లారు. సుందిళ్ల బరాజ్ వద్దకు చేరుకొని నిర్మాణ పనులను పరిశీలించి, పనుల ప్రగతిపై ఇంజినీర్లను ఆరాతీశారు. తెలంగాణ రైతులకు తిరుగులేని కానుక ఇవ్వాలన్నదే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు లక్ష్యమని, ఈ ప్రాజెక్టు పూర్తయితే కోటి ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని, పనుల్లో ఎక్కడా రాజీ ఉండకూడదని పేర్కొన్నారు. అవసరమైతే డిప్యూటేషన్‌పై మరింత మంది ఇంజినీర్లను పంపిస్తామని, ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

సుడిగాలి పర్యటన..

ముందుగా బరాజ్ వద్దకు రాత్రి 11 గంటల సమయంలో చేరుకొని పనుల పురోగతిని పరిశీలించారు. ఇక్కడ మొత్తం 74 గేట్లు నిర్మిస్తుండగా అందులో 22 గేట్లు బిగింపునకు సిద్ధమయ్యాయని, మే 31 వరకు అన్ని గేట్లు బిగించేలా పనులు చేయాలన్నారు. మే 31 అంటే ఇంకా 75 రోజుల్లో కాంక్రీట్ పనులు, గేట్ల బిగింపు పనులు పూర్తికావాలని ఆదేశించారు. బరాజ్‌పై జూన్ వరకు బ్రిడ్జి పూర్తవుతుందని అక్కడి సిబ్బంది మంత్రికి వివరించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పనులు ఎలా జరుగుతున్నాయని ఆరా తీయగా.. సుమారు 2 వేల మంది రోజూ 3 షిఫ్టుల్లో పనులు చేస్తున్నామని, ప్రతి రోజూ 3 పూటలా కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్నామని అధికారులు తెలిపారు. కార్మికులపై పని ఒత్తిడి ఉండకుండా అవసరమైతే మరింత మంది సిబ్బందిని పెంచుకోవాలని మంత్రి సూచించారు. జూన్ చివరినాటికి నీరందించేలా అన్నిరకాల చర్యలు చేపట్టాలని, ఎక్కడా నిర్లక్ష్యం వద్దని పేర్కొన్నారు. కార్మికుల్లో సైతం ఉత్సాహాన్ని నింపేలా వారితో కాసేపు మాట్లాడిన మంత్రి.. వారికి అందుతున్న సౌకర్యాల గురించి వాకబు చేశారు. దాదాపు అర్ధరాత్రి 1.30 గంటల దాకా పనులను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడే ఉన్న నవయుగ క్యాంపు ఆఫీసులో బస చేశారు.

గేట్ల తయారీ కేంద్రం పరిశీలన..

అర్ధరాత్రి 1.30 గంటల దాకా బరాజ్ వద్దే ఉండి అక్కడే బస చేసిన మంత్రి.. మళ్లీ ఆదివారం ఉదయాన్నే 6.30 గంటలకు సుందిళ్ల బరాజ్ సమీపంలో ఏర్పాటు చేసిన గేట్ల తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్ని గేట్లు పూర్తయ్యాయి.. వాటికి జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా బిగించేలా గేట్ల తయారీ వేగంగా జరుగాలని ఆదేశించారు. ఆయన వెంట కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ నల్లా వెంకటేశ్వర్లు, ఎస్ఈ సుదర్శన్‌రెడ్డి, నవయుగ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఈశ్వర్‌రావు, డీఈలు వీరబాబు, భద్రయ్య, ఏఈ ఉన్నారు.



సిద్దిపేటలోని కోమటిచెరువు కళాక్షేత్రంలో 'తీయనైన తెలుగు-తెలంగాణ వెలుగు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు



సూర్యాపేటలో 'తీయనైన తెలుగు తెలంగాణ వెలుగు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ రామమందిరంలో పంచాంగ శ్రవణం వింటున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



చెన్నూర్‌లో పుస్తకాలను పంపిణీ చేస్తున్న విప్ నల్లాల ఓదెలు, ఎమ్మెల్సీ పురాణం సతీశ్

మంచిర్యాలలో 'తెలంగాణ వెలుగు' పుస్తకాల పంపిణీ

మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: తెలుగుభాష అభివృద్ధి కోసం కృషిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉగాది సందర్భంగా ప్రత్యేకంగా ముద్రించిన 'తీయనైన తెలుగు-తెలంగాణ వెలుగు' పుస్తకాలను ఆదివారం మంచిర్యాల జిల్లావ్యాప్తంగా పంపిణీ చేశారు. కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన పుస్తకాలను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్‌కు జిల్లా పౌర సంబంధాల అధికారి సంపత్ అందించారు. చెన్నూర్‌లో విప్ నల్లాల ఓదెలు, ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ బెల్లంపల్లిలో మున్సిపల్ చైర్‌పర్సన్ పసుల సునీతరాణి పుస్తకాలను పంపిణీ చేశారు.

పాడిపంటలతో కళకళలాడాలి

- ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలి
- ఉగాది వేడుకల్లో మంత్రుల ఆకాంక్ష

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: రాష్ట్రంలో ఉగాది వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. సాయంత్రం వేళ ఆలయాల్లో పూజలు నిర్వహించిన ప్రజలు పంచాంగ శ్రవణంలోనూ పాల్గొన్నారు. ఈ వేడుకల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీ, బ్రాహ్మణ పరిషత్ సంయుక్తంగా సిద్దిపేటలోని కోమటిచెరువు కళా క్షేత్రంలో నిర్వహించిన వేడుకల్లో మంత్రి హరీశ్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. 'తీయనైన తెలుగు-తెలంగాణ వెలుగు పుస్తకాన్ని' ఆవిష్కరించిన సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ తెలుగు నూతన సంవత్సర ఉగాది ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని, రైతులు పాడి పంటలతో, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు రవిచంద్ర, సీఎం కేసీఆర్ గురువు మృత్యుంజయశర్మ తదితరులు పాల్గొన్నారు. సూర్యాపేటలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకలో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీవిళంబి నామ సంవత్సరంలో ప్రజలకు శుభమే జరుగాలని, అన్ని రంగాల వారు అభివృద్ధి చెందుతూ ఎలాంటి వివాదాలు లేకుండా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అంతకుముందు 'తీయనైన తెలుగు.. తెలంగాణ వెలుగు' కరదీపికను ఆవిష్కరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని రామమందిరం ఆలయంలో నిర్వహించిన పంచాంగ పఠనంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సాగు, తాగునీరు పుష్కలంగా అందించేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టిందన్నారు. విద్య, వైద్య, రవాణా, సంక్షేమ రంగాల్లో సబ్బండ వర్గాల అభివృద్ధి కోసం అన్ని విధాల బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత నిచ్చి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఆదిలాబాద్‌లోని సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ఉగాది వేడుకలో బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కొత్త ఏడాదిలో రాష్ట్రంలోని రైతులంతా ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

బాల్యంపై వికృత పంజా

- దేశవ్యాప్తంగా బాలలపై పెరిగిపోతున్న నేరాలు
- 2016లో లక్షకు పైగా కేసులు నమోదు
- ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితి దారుణం
- చట్టాల సక్రమ అమలు, విస్తృత అవగాహనతోనే మార్పు

కోల్‌కతా, మార్చి 18:

ఆటపాటల్లో మునిగి తేలాల్సిన బాల్యం కామాంధుల కబంధ హస్తాల్లో చిక్కుకుపోతున్నది. అభం శుభం ఎరుగని చిన్నారులు దుర్మార్గుల వికృత క్రీడలో పావులుగా మారుతున్నారు. బడికెళ్లి చదువుకోవాల్సిన వయసులో వేధింపులు, లైంగిక దాడులు, కిడ్నాప్‌లకు బలవుతున్నారు. ఇలాంటి ఘటనలు ఏటా లక్షల్లో నమోదవుతూ ఉండటం.. ఏటికేడు పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశం. ఎన్ని కఠిన చట్టాలు తెచ్చినా.. అమలులో నెలకొన్న నిర్లక్ష్యం.. న్యాయస్థానాల్లో జరుగుతున్న జాప్యం వెరసి.. తప్పు చేసేవారిలో ఏమాత్రం భయం కలిగించలేకపోతున్నాయి. ఫలితంగా దేశంలో చిన్నారులపై అఘాయిత్యాలు పెరుగుతూనే ఉన్నాయి. 2015, 2016లో పిల్లలపై జరిగిన ఐరాత్‌ను పరిశీలిస్తే ఏకంగా 11 శాతం పెరుగుదల కనిపించడం ఆందోళనకరం. స్వయంగా నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) వెల్లడించిన కఠోర సత్యమిది. ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం 2015లో బాలలపై జరిగిన నేరాలు 94,172 కాగా, 2016 నాటికి ఈ సంఖ్య 1,06,958కు పెరిగింది. ఏకంగా 12,786 నేరాలు పెరిగాయి. ఇందులో కిడ్నాప్‌లు, వేధింపులు, లైంగిక దాడులు వంటి నేరాలు ఉన్నాయి. ఇందులో 33 శాతం నేరాలు పోస్కో చట్టం కిందికి వస్తున్నాయి.

ముప్పు పెరుగుతున్నది

క్రై (చిల్డ్రన్స్ రైట్స్ అండ్ యూ) స్వచ్ఛంద సంస్థ ప్రకారం.. బాలలపై నేరాలకు సంబంధించి నమోదవుతున్న కేసుల్లో 2006 నుంచి 2016 నాటికి 500 శాతం పెరుగుదల కనిపించింది. 2006లో 18,967 కేసులు నమోదుకాగా 2016 నాటికి 1,06,958 కేసులు నమోదయ్యాయి. కేసుల సంఖ్య పెరుగడంలో రెండు కోణాలు ఉన్నాయని క్రై సంస్థ పాలసీ అడ్వయిజర్ కోమల్ గంగోత్రా చెప్తున్నారు. ఏదైనా ఘటన జరిగితే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలనే అవగాహన ప్రజల్లో పెరుగడం ఒక కారణమైతే.. చట్టాలు, న్యాయస్థానాలు బాధితులకు భరోసా కల్పించడం మరో కారణమని పేర్కొన్నారు. మొత్తంగా పెరుగుతున్న కేసులను బట్టి బాలలకు ముప్పు పెరుగుతున్నదని స్పష్టమవుతున్నట్టు వివరించారు. అయితే చట్టాలు, న్యాయస్థానాలు వేసే శిక్షలతో ఈ పరిస్థితి పూర్తిగా మారుతుందని చెప్పలేమని, మరింత విస్తృతంగా ఆలోచించి బాలల రక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నదన్నారు. నేరాల అదుపునకు ఉపయోగపడే చట్టాలు, అమలు చేసే వ్యవస్థ, మౌలిక వసతుల మధ్య చాలా అంతరం ఉన్నదని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. అదేసమయంలో సమాజంలో విలువలు పెరుగాలన్నారు.



ఆ ఐదు రాష్ట్రాల్లోనే 50 శాతం నేరాలు

రాష్ట్రాల వారీగా చూసినప్పుడు సగం నేరాలు కేవలం ఐదు రాష్ట్రాల్లోనే నమోదయ్యాయి. మొత్తం ఘటనల్లో 50 శాతం ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్‌లోనే జరుగడం గమనార్హం. ఇందులో 15 శాతం నేరాలతో ఉత్తరప్రదేశ్ మొదటిస్థానంలో ఉండగా మహారాష్ట్ర (14శాతం), మధ్యప్రదేశ్ (13 శాతం) ఆ తర్వాతి స్థానాలను ఆక్రమించాయి. కిడ్నాప్‌లు, పోస్కో చట్టం కింద నమోదైన నేరాల్లో ఉత్తరప్రదేశ్ మొదటిస్థానంలో ఉండగా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రెండు, మూడోస్థానంలో నిలిచాయి.

2016లో నమోదైన కేసుల్లో నేరాలవారీగా పరిశీలించినప్పుడు..

- అగ్రస్థానం కిడ్నాప్‌లదే.. మొత్తం 52,253 కేసులు (49 శాతం) నమోదయ్యాయి.
- ఆ తర్వాతి స్థానం లైంగిక దాడులది.. మొత్తం నేరాల్లో 18 శాతం లైంగికదాడుల కేసులే కావడం ఆందోళన కలిగించే అంశం.

లక్షమంది మిస్సింగ్

ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం 2016లో దేశవ్యాప్తంగా నమోదైన మిస్సింగ్ కేసుల సంఖ్య 1,11,569. ఇందులో బాలికలే అధికం. ఆ ఏడాది 70,394 మంది బాలికలు అపహరణకు గురికాగా, 41,175 మంది బాలురు మిస్సయ్యారు. ఇందులో అత్యధికంగా పశ్చిమబెంగాల్‌లోనే (15.1 శాతం) నమోదయ్యాయి. అయితే ఏడాది చివరినాటికి 55,944 మంది చిన్నారుల జాడ దొరుకడం ఊరట కలిగించే అంశం.